

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 22-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 337 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి పూర్తి; నక్షత్రం: మఖ తె. 4.29 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ. 2.58-4.46; దుర్ముహూర్తం: ఉ. 8.46-9.34, మ. 12.47-1.35; అమృతఘడియలు: రా. 1.46-3.34; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.22; సూర్యాస్తమయం: 6.24 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కేంద్ర నిజనిర్ధారణ విభాగంపై సుప్రీంకోర్టు స్టే

ఇది భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించిన అంశమని వ్యాఖ్య

నిజనిర్ధారణ విభాగాన్ని వ్యతిరేకిస్తూ ఎడిటర్స్ గిల్డ్, కునాల్ పిటిషన్లు

11

కేజ్రీవాల్ అరెస్ట్



మద్యం స్కాం కేసులో ఢిల్లీ సీఎంను అదుపులోకి తీసుకున్న ఈడీ

- ఇదే కేసులో కవితను అరెస్టు చేసిన వారంలోనే!
- ఇద్దరినీ ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారించే చాన్స్
- ఇప్పటికే 9సార్లు సమన్లు.. హాజరుకాని ఢిల్లీ సీఎం
- గురువారం రాత్రి సమన్లతో నేరుగా సీఎం ఇంటికి
- కేజ్రీవాల్, ఆయన భార్య ఫోన్లు, ఐప్యాడ్ స్వాధీనం
- దాదాపు రెండు గంటలపాటు సోదాలు, ప్రశ్నలు
- నేడు పీఎంఎల్ఏ కోర్టు ముందుకు.. కస్టడీకి వినతి
- అరెస్టును అడ్డుకోవాలని ఉదయమే ఢిల్లీ హైకోర్టుకు
- ఎలాంటి రక్షణా కల్పించలేమంటూ జడ్జీల తిరస్కరణ
- ఢిల్లీ సీఎం ఇంటి ఎదుట ఆప్ కార్యకర్తల నిరసన
- పెద్దఎత్తున మోహరించిన ఆర్ఏఎఫ్, సీఆర్పీఎఫ్
- కేజ్రీవాలే సీఎంగా కొనసాగుతారు: మంత్రి ఆతిషి



ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి ఈడీ కార్యాలయానికి తీసుకెళ్తున్న అధికారులు

టార్గెట్ పూర్తయింది! గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ప్రచారానికి రూ.100 కోట్లు చేతులు మారాయని, అందుకు ఢిల్లీ మద్యం విధానాన్ని సరళీకరించారనే ఆరోపణలున్న ఢిల్లీ మద్యం కుంభకోణం క్లైమాక్స్‌కు చేరుకుంది! ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది! దాంతో, దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న అరెస్టుల పర్వం ముగిసినట్లే! ఈ కేసులో పాత్రధారులంతా అప్రూవర్లుగా మారిపోవడంతో సూత్రధారుల మెడకు ఉచ్చు బిగుసుకున్నట్లే! కాకపోతే.. ఒకప్పుడు అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించిన కేజ్రీవాల్ ఇప్పుడు అదే కేసులో అరెస్టు కావడమే వైచిత్రి!

న్యూఢిల్లీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం రాత్రి అరెస్టు చేసింది. ఇదే కేసులో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవితను అరెస్టు చేసిన వారం రోజుల్లోనే 'కుట్రదారు'గా పేర్కొన్న కేజ్రీవాల్‌నూ అరెస్టు చేయడం విశేషం. తద్వారా, ఢిల్లీ మద్యం స్కాంలో అరెస్టుల పర్వం క్లైమాక్స్‌కు చేరినట్లయింది. ఈ స్కాంలో రూ.100 కోట్లు చేతులు మారాయని ఆరోపిస్తున్న ఈడీ.. ఈ కుంభకోణంలో పాత్రపై కేజ్రీవాల్‌ను, కవితను ఎదురెదురుగా కూర్చోబెట్టి ప్రశ్నించనున్నట్లు తెలిసింది. నిజానికి, ఢిల్లీ మద్యం స్కాంలో విచారణకు రావాలంటూ ఈడీ ఇప్పటికే తొమ్మిదిసార్లు కేజ్రీవాల్‌కు సమన్లు పంపింది. కానీ, ఆయన హాజరు కాలేదు. దాంతో, గురువారం రాత్రి 7.45 గంటల సమయంలో పదోసారి సమన్లతో నేరుగా ఈడీ అధికారులే కేజ్రీవాల్ ఇంటికి చేరుకున్నారు. సోదాలు చేసేందుకు తమ వద్ద వారంట్ ఉందని ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బందికి తెలిపారు. తొలుత కేజ్రీవాల్, ఆయన భార్య మొబైల్ ఫోన్లను, ఐప్యాడ్‌ను

మిగతా 2వ పేజీలో...

అవినీతి కేసులో అరెస్టైన అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు!!

జైలు నుంచి సీఎం కేజ్రీ విధులు.. **సాధ్యమేనా?**

నిబంధనలు అంగీకరించేనా!

కేజ్రీ అరెస్టు దారుణం

భగ్గుమన్న 'ఇండియా' కూటమి

- నియంతృత్వ చర్య: రాహుల్
- బీజేపీ దిగజారుడుతనం: పవార్
- ఓటమి భయంతోనే..: స్టాలిన్

విశాఖ కేరాఫ్ కొకైన్

దక్షిణ అమెరికా బ్రెజిల్‌లో బయల్దేరిన 'సరుకు'! దక్షిణ భారతంలో... తూర్పు తీరంలోని విశాఖ పోర్టుకు చేరింది! ఒక కంటైనర్‌లో 25వేల కిలోల డ్రై ఈస్ట్! అందులోనే... గుట్టుచప్పుడు కాకుండా 'కొకైన్'! ఇప్పటిదాకా వెతికింది 20 బస్తాలనే! మొత్తంగా వెతికితే ఎన్ని వందలు, వేల కోట్ల రూపాయల విలువైన కొకైన్ దొరుకుతుందో! ఇదో అంతర్జాతీయ సంచలనం! ఒకవైపు సీబీఐ, కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేస్తుండగా.. మరోవైపు తగదునమ్మా అంటూ రాష్ట్ర పోలీసులు, అధికారులు రంగంలోకి దిగి విచారణ ప్రక్రియను జాప్యం చేయాలని ప్రయత్నించడం గమనార్హం!

విశాఖలో కొకైన్ కలకలం



డ్రై ఈస్ట్ మాటున గుట్టుగా సరఫరా

- బ్రెజిల్ నుంచి షిప్పులో విశాఖకు రాక
- 25వేల కిలోల డ్రై ఈస్ట్‌లో కలిపి రవాణా
- 'ఆపరేషన్ గరుడ'లో ఇంటర్‌పోల్ సమాచారం
- రంగంలోకి దిగి పట్టుకున్న సీబీఐ
- డ్రై ఈస్ట్‌లో కలిపింది కొకైనేనని నిర్ధారణ
- సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్టర్స్ పేరిట బుకింగ్
- కంటెయినర్‌ను పరిశీలిస్తున్న సమయంలో విచారణకు అడ్డుపడిన ఏపీ అధికారులు
- సరుకు తడిసిపోతుంది రేపు చూసుకుందాం అంటూ ఆక్వా కంపెనీ ప్రతినిధుల హడావుడి
- తెర వెనుక వైసీపీ పెద్దలున్నారనే అనుమానం

11

నంబర్లూ ఇచ్చేశాం!

ఎన్నికల బాండ్ల పూర్తి సమాచారాన్ని ఈసీకి సమర్పించాం

- రాజకీయ పార్టీల ఖాతా, కేవైసీ, కొనుగోలుదారుల కేవైసీ డేటా ఇవ్వలేదు
- అవి లేకున్నా ఏ పార్టీకి ఎవరు ఎన్నెన్ని విరాళాలిచ్చారనే వివరాలు తెలుస్తాయి
- సుప్రీంలో ఎస్‌బీఐ చైర్మన్ అఫిడవిట్.. తాజా వివరాలను ప్రచురించిన ఈసీ

న్యూఢిల్లీ, మార్చి 21: యూనిక్ నంబర్లతో సహా ఎన్నికల బాండ్లకు సంబంధించి అన్ని వివరాలూ ఎన్నికల కమిషన్‌కు అందజేశామని పేర్కొంటూ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టులో ప్రమాణ పత్రం దాఖలు చేసింది. ఎన్నికల బాండ్లను కొన్నవారు వాటిని ఏ పార్టీలకు ఇచ్చారో తెలిపే కీలక సమాచారం యునిక్ బాండ్ నంబర్. ఆ నంబర్ లేకుండా ఈసీకి బాండ్ల వివరాలు అందించడంపై సుప్రీంకోర్టు ఆగ్రహించిన నేపథ్యంలో.. ఆ వివరాలను కూడా సమర్పించినట్టు ఎస్‌బీఐ చైర్మన్ పేరిట దాఖలు చేసిన ఈ అఫిడవిట్‌లో వెల్లడించింది. అయితే.. బాండ్లను నగదుగా మార్చుకున్న రాజకీయ పార్టీల ఖాతా నంబర్లు, కేవైసీ (నో యువర్ కస్టమర్) తాలూకూ పూర్తి వివరాలను ఇస్తే వాటి భద్రతకు భంగం (అకౌంట్ నంబర్ ఆధారంగా సైబర్ క్రిమినల్స్

మిగతా 2వ పేజీలో...



'వికసిత్ భారత్' సందేశాలు ఆపండి

కేంద్రానికి ఎన్నికల సంఘం ఆదేశం

సుప్రీం ఆదేశాలనే ధిక్కరిస్తారా?

- ధర్మాసనం వ్యాఖ్యలను వక్రీకరిస్తారా?
- నిత్యం రాజ్యాంగ వ్యతిరేక పనులేనా?
- తేలిగ్గా తీసుకోం..చర్యలకు ఆదేశిస్తాం
- సీఎం కోరినా మంత్రిగా పొన్ముడితో ప్రమాణం చేయించరా?
- తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం ఆగ్రహం
- నేటిలోగా ప్రమాణానికి ఆదేశం

చెన్నై/న్యూఢిల్లీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శిక్షపడి, సుప్రీంకోర్టులో ఊరట పొందిన డీఎంకే ఎమ్మెల్యే కె.పొన్ముడితో మంత్రిగా ప్రమాణం చేయించేందుకు నిరాకరించిన తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రమాణస్వీకార నిరాకరణకు ఆయన చెప్పిన కారణాలనూ తప్పుబట్టింది. మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించబోనని గవర్నర్ ఎలా చెబుతారని నిలదీసింది. "రాజ్యాంగాన్ని అమలుచేయబోనని సాక్షాత్తూ గవర్నరే అంటే ఏమి చేయాలి? ఆయన సుప్రీంకోర్టు ఆదేశాలనే ధిక్కరిస్తున్నారు" అని

మిగతా 2వ పేజీలో...

ఎన్నికల వేళ.. ఇంత అలక్ష్యమా?

3 జిల్లాల ఎస్పీలపై సీఈవో ఆగ్రహం

- హత్యలు, హింసపై వివరణ కోరిన వైనం
- సమస్యాత్మకమని తెలిసీ శాంతిభద్రతలను నియంత్రించలేదేం?
- పల్నాడు ఎస్పీని నిలదీసిన మీనా.. నంద్యాల, ప్రకాశం, ఎస్పీలూ హాజరు
- హింస జరగకూడదని ఎస్పీలకు స్పష్టంగా చెప్పాం: సీఈవో

10

ప్రధాని సభలో భద్రతా వైఫల్యంపై విచారణకు ఈసీ ఆదేశం

రైలు టికెట్లకూ డబ్బుల్లేవ్



- కాంగ్రెస్ ఆర్థిక వనరులపై ముప్పేట దాడి
- మోదీ కుట్రతోనే ఇదంతా జరుగుతోంది
- ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయాలి: సోనియా
- రాజ్యాంగసంస్థలు జోక్యం చేసుకోవాలి: ఖర్గే
- మా నేతలు రైళ్లలో కూడా ప్రయాణించలేకపోతున్నారు
- ఎవరికీ రెండు రూపాయలూ ఇవ్వలేని పరిస్థితి: రాహుల్
- ఓటమి తప్పదనే సాకులు చెబుతున్నారు: బీజేపీ
- కాంగ్రెస్ ఖాతాలను జప్తు చేయలేదు: ఐటీ వర్గాలు

11



ఆ ఉద్యోగులను తొలగించొద్దు

- '2018 గ్రూప్-1' కేసులో హైకోర్టు ఆదేశం
- మెయిన్స్ పరీక్ష రద్దును సవాల్ చేస్తూ.. దాఖలైన అప్పీళ్లపై విచారణ 27కి వాయిదా
- ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని.. ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నామన్న ధర్మాసనం
- 167 మందికి తాత్కాలిక ఉపశమనం

10

'పతంజలి' క్షమాపణలు

తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వబోమని సుప్రీంకు హామీ

2

ఈసీల నియామకంపై స్టే ఇవ్వలేం: సుప్రీం

200 మంది సభ్యుల్లోంచి 2 గంటల్లోనే ఆరుగురిని షార్ట్‌లిస్ట్ ఎలా చేస్తారని ప్రశ్న?



భగ్గుమన్న 'ఇండియా' కూటమి

ఇది నియంతృత్వ చర్య

మీడియా సంస్థలను స్వాధీనం చేసుకుని, ప్రతిపక్షాలను చీల్చడం, కంపెనీల నుంచి డబ్బును దోచడం, విపక్షాల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం వంటి చర్యలతో.. దుష్టశక్తి(మోదీని ఉద్దేశించి)కి సంతృప్తి లేదు. ఇప్పుడు ఎన్నికైన సీఎంలను కూడా అరెస్టు చేయడం సాధారణంగా మారింది. భయకంపితుడైన ఓ నియంత ప్రజాస్వామ్యాన్ని వధించాలనుకుంటున్నారు. ఇండియా కూటమి దీనికి దీటుగా సమాధానమిస్తుంది.

- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

విపక్ష నేతలను భయపెడుతున్నారు

కేజ్రీవాల్ అరెస్టు రాజ్యాంగ వ్యతిరేకం. రాజకీయాలను ఇంతగా దిగజార్చడం మోదీ సర్కారుకు తగదు. విపక్ష నేతలంతా ఏ రాత్రికి ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు జరుగుతాయో తెలియక భయపడుతున్నారు. ఒక సీఎం(హేమంత్ సోరెన్)ను జైలుపాలు చేశారు. ఇప్పుడు మరో ముఖ్యమంత్రి(కేజ్రీవాల్)ని అరెస్టు చేశారు. భారత చరిత్రలోనే ఇలాంటి సిగ్గుమాలిన చర్యలను ఏనాడూ చూడలేదన్నారు.

- ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

ఇండియా కూటమికి చెందిన రెండో సీఎంను అరెస్టు చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలంటే ఎన్నికల్లో బీజేపీని ఓడించాల్సిందే.

- సీతారాం ఏచూరి, సీపీఎం నేత

బీజేపీది దిగజారుడుతనం

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా దిగజారుతుందనడానికి ఈ అరెస్టు నిదర్శనం. ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యపై ఇండియా కూటమి ముక్తకంఠంతో నిరసిస్తుంది.

- శరద్‌పవార్, ఎన్సీపీ నేత

ఓటమి భయంతోనే కేజ్రీవాల్ అరెస్టు

పదేళ్ల పాలనలో వైఫల్యాలను ఎదుర్కొన్న ఫాసిస్టు బీజేపీ ఓటమి భయంతోనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. ఈ చర్యతో బీజేపీ ప్రతిష్ఠ పాతాళానికి దిగజారిపోయింది. ప్రతిపక్ష నేతలను వేటాడడం బీజేపీ నిరాశానిస్పృహలకు సంకేతం. కేజ్రీవాల్ అరెస్టుతో ప్రజల ఆగ్రహం మరింత పెరుగుతుంది. ఆ ఆగ్రహ జ్వాలలు ఇండియా కూటమిని విజయం దిశగా తీసుకెళ్తాయి.

- ఎంకే స్టాలిన్, తమిళనాడు సీఎం

కోడ్ అమల్లో ఉండగా అరెస్టా?

ఎన్నికలకు కొద్ది రోజుల ముందు.. ఈసీ కోడ్ అమలులో ఉన్న సమయంలో సీఎంను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ముఖ్యమంత్రులు, విపక్ష నేతలు అరెస్టయితే.. దేశంలో స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు ఎలా జరుగుతాయి? సుప్రీంకోర్టు, ఈసీ కూడా రక్షణ కల్పించకుంటే.. బీజేపీ నియంతృత్వం నుంచి ప్రజలకు రక్షణ ఎలా?

- ఓబ్రెయిన్, టీఎంసీ ఎంపీ

ఇది రాజకీయ ప్రతీకారమే

విపక్షాలను అణచివేయడానికి ఈడీ, సీబీఐలను బీజేపీ ఆయుధాలుగా వాడుకుంటోంది. నిరాధారమైన ఆరోపణలు చేస్తూ.. విపక్ష నేతలను టార్గెట్‌గా చేసుకుంటున్నారు. ఇది బీజేపీ రాజకీయ ప్రతీకార చర్యకు నిదర్శనం. ఈ అరెస్టు చట్ట వ్యతిరేకం.

- కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

కేజ్రీవాల్ అరెస్ట్



సీఎం కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆందోళనకు దిగిన ఆప్ కార్యకర్తలు

(మొదటి పేజీ తరువాయి)

స్వాధీనపరుచుకున్నారు. అనంతరం రెండు గంటలపాటు 12 మంది అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఆయనను ఈడీ ఆఫీసుకు తరలించేందుకు ప్రయత్నించగా రావడానికి ఆయన నిరాకరించారు. ఇంట్లోనే ప్రశ్నించాలని ఈడీ అధికారులను ఆయన కోరారు. చివరికి, రాత్రి 9.45 గంటల సమయంలో కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రత్యేక కోర్టు ముందు శుక్రవారం ఆయనను హాజరు పరుస్తామని, ఆయన కస్టడీకి అనుమతి కోరతామని ఈడీ అధికారులు తెలిపారు. అరెస్టు చేసి తీసుకెళ్లిన తర్వాత గురువారం రాత్రి ఈడీ కార్యాలయంలోనే కేజ్రీవాల్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. అరెస్టు సమయంలో ఈడీ జాయింట్ డైరెక్టర్ కపిల్ రాజ్ అక్కడే ఉన్నారు. పీఎంఎల్ఏ చట్టంలోని సెక్షన్ 50 కింద కేజ్రీవాల్ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. కాగా, అవినీతి ఆరోపణలతో ఇటీవల అరెస్టైన రెండో ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ నిలిచారు. కొద్ది రోజుల కిందట జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ల్యాండ్ స్కాం కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అంతేనా.. ఒకప్పుడు అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమం చేసిన కేజ్రీవాల్‌ను ఇప్పుడు అవే అవినీతి ఆరోపణలతో అరెస్టు చేయడం విశేషం.

ముందుగా ఊహించి కోర్టుకు వెళ్లినా..

తనను అరెస్టు చేసే అవకాశం ఉందని ముందుగానే ఊహించిన కేజ్రీవాల్ గురువారం ఉదయం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఢిల్లీ మద్యం స్కాంలో వరుసగా సమన్లు జారీ చేస్తున్న ఈడీ.. తనపై కఠిన చర్యలు తీసుకోకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కానీ, అక్కడ ఆయనకు చుక్కెదురైంది. ఆయన వినతిని హైకోర్టు తిరస్కరించింది. ప్రస్తుత దశలో ఎలాంటి రక్షణ కల్పించలేమని న్యాయమూర్తులు జస్టిస్ సురేష్ కుమార్ కైత్, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 22కు వాయిదా వేసింది. కేజ్రీవాల్ అరెస్టును అడ్డుకోవడానికి ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో గంటల వ్యవధిలోనే ఈడీ రంగంలోకి దిగింది. సెర్చ్ వారంటుతో ఆయన నివాసానికి వెళ్లి అరెస్టు చేసింది. దాంతో, కేజ్రీవాల్ అరెస్టు రాజ్యాంగ వ్యతిరేకమంటూ ఆయన తరఫు న్యాయవాదులు గురువారం రాత్రి సుప్రీం కోర్టు తలుపు తట్టారు. తక్షణమే ఆయనను విడుదల చేయాలంటూ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అయితే, ఈ కేసును శుక్రవారం విచారిస్తామని సుప్రీం తెలిపింది.

కేజ్రీవాల్ నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత

కేజ్రీవాల్ ఇంటికి ఈడీ అధికారులు చేరుకోవడం, ఆయనను అరెస్టు చేసే అవకాశం ఉందనే ప్రచారం జరగడంతో ఆప్ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున సీఎం నివాసం వద్దకు చేరుకున్నారు. పెద్దఎత్తున నిరసన తెలిపారు. అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో, పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్పీఎఫ్ దళాలను కేజ్రీవాల్ నివాసం వద్ద మోహరించారు. ఈడీ కార్యాలయానికి వెళ్లే దారులను అష్ట దిగ్బంధనం చేసి పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్తర ఢిల్లీలో ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లే రహదారి అంతటా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో సెక్షన్ 144ను విధించి జనం ప్రవేశించకుండా అడ్డుకున్నారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే పెద్ద ఎత్తున ఆప్ కార్యకర్తలు పోగవుతారని ఊహించే భారీగా బలగాలను కోరామని ఒక పోలీసు అధికారి తెలిపారు. కాగా.. ఈ అరెస్టుకు కేజ్రీవాల్ భయపడే ప్రసక్తి లేదని, తమ ధైర్య సాహసాలు చెక్కు చెదరబోవని ఎక్స్ వేదికగా ఆప్ ప్రకటించింది.

ఆప్ ఎన్నికల ప్రచారానికి వంద కోట్లు!

ఢిల్లీ మద్యం కుంభకోణంలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వివిధ మార్గాల ద్వారా పంపించిన వంద కోట్ల రూపాయలను ఆప్ తన ఎన్నికల ప్రచారానికి వినియోగించినట్లు ఈడీ గతంలో పలు సందర్భాల్లో స్పష్టం చేసింది. ఢిల్లీ ప్రభుత్వ ముఖ్యులకు కవిత వంద కోట్ల ముడుపులు ఇచ్చినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపింది. ఇటీవల కవిత కస్టడీ రిపోర్టులోనూ ఈ వివరాలను పేర్కొంది. శరత్ చంద్రా రెడ్డి, మాగుంట రాఘవ, మాగుంట శ్రీనివాసులు రెడ్డి తదితరులతో సౌత్ లాబీకి ప్రాతినిధ్యం వహిస్తున్న కవిత.. ఆప్ అగ్ర నేతలతో కుమ్మక్కయ్యారని పేర్కొం ది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, అప్పటి ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాతో ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపింది. ఇదే కేసులో గత ఏడాది ఏప్రిల్‌లో తొమ్మిది గంటలపాటు కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఇదే కేసులో అప్పటి డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అరెస్టై దాదాపు ఏడాదిన్నరగా జైల్లో ఉన్నారు. ఇక, సౌత్ లాబీలోని మిగిలిన పాత్రధారుల్లో అత్యధికులు అప్రూవర్లుగా మారారు. ఇటీవల ప్రధాన కుట్రదారుగా పేర్కొంటున్న కవితను ఈడీ అరెస్టు చేసింది. ఇప్పుడు కవిత ఇచ్చిన సమాచారంతో కేజ్రీవాల్‌ను విచారించడం, ఇద్దరినీ ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారించడం ద్వారా ఈ కేసును క్లైమాక్స్‌కు తీసుకొచ్చే ప్రయత్నాల్లో ఈడీ ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

కేజ్రీవాలే ముఖ్యమంత్రి: ఆతిషి

నిర్బంధం నుంచే కేజ్రీవాల్ పాలన కొనసాగిస్తారని, ముఖ్యమంత్రిగా ఆయనే కొనసాగుతారని ఆమ్ ఆద్మీ పార్టీ మంత్రి ఆతిషీ ప్రకటించారు. పదవికి ఆయన రాజీనామా చేయబోరని స్పష్టం చేశారు. జైలు నుంచి పాలన సాగించేందుకు ఏ నిబంధనా అడ్డుకోలేదని తెలిపారు. ఈ కేసులో రెండేళ్లుగా విచారణ చేస్తున్నా ఒక్క రూపాయి కూడా అవినీతి సొమ్మును ఈడీ కనిపెట్టలేకపోయిందని ఆమె అన్నారు. ఈ కేసులో ఈడీకి ఢిల్లీ హైకోర్టు నోటీసు ఇచ్చిందని, అయినా వేలాదిమంది పోలీసులు, పారా మిలటరీ దళాలను మోహరించి అరెస్టు చేయాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం లోక్‌సభ ఎన్నికల ముందు మోదీ చేస్తున్న భారీ కుట్రగా ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా ఆరోపించారు. కేజ్రీవాల్ కు కోట్లాది మంది ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయని, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఆప్ ప్రభుత్వాలు అమలు చేస్తున్న అద్భుతమైన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రపంచమంతా ప్రశంసిస్తోందని, ఆయనను అరెస్టు చేయవచ్చు కానీ ఆయన ఆశయాలను అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు.

జైలు నుంచి కేజ్రీ విధులు.. సాధ్యమేనా?



కేజ్రీవాల్ ఇంటి బయట ఆందోళన చేస్తున్న ఆప్ ఎమ్మెల్యేలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

న్యూఢిల్లీ, మార్చి 24: కేజ్రీవాల్ జైలు నుంచే ముఖ్యమంత్రిగా తన విధులు నిర్వర్తిస్తారని ఆప్ చెబుతోంది. ఈ విషయంలో ఆయనను అడ్డుకునే చట్టమేదీ లేదని ఆ పార్టీ పేర్కొంది. అయితే, సీఎంగా జైలు నుంచి పనిచేయడం ఎంతవరకు సాధ్యమనే అంశంపై చర్చ జరుగుతోంది. ఇది రాజ్యాంగ సంక్షోభానికి దారి తీస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాణా కుంభకోణంలో లాలూ ప్రసాద్ యాదవ్ అరెస్టు అయినప్పుడు తన భార్య రబ్డీ దేవిని బిహార్ సీఎం పీఠంపై కూర్చోబెట్టి జైలుకెళ్లారు. ఈడీ భూ కుంభకోణం కేసులో జనవరిలో హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేసింది. దానికి ముందు ఆయన ఝార్ఖండ్ సీఎం పదవికి రాజీనామా చేశారు. కేజ్రీవాల్ రాజీనామా చేయకపోవడం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందనే విషయాన్ని కేంద్ర హోం శాఖ పరిశీలిస్తోంది. ఆయన పబ్లిక్ సర్వెంట్ కాబట్టి.. కేంద్రం ఆయనను సస్పెండ్ చేయవచ్చని లేదా తొలగించవచ్చని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా అరెస్టు అయినప్పుడు ఇదే పద్ధతి అనుసరిస్తారని వారు గుర్తుచేస్తున్నారు. ఇంతకుముందు ఎవరూ జైలు నుంచి సీఎంగా పనిచేసిన ఉదంతం లేదని తిహాడ్ జైలు వర్గాలు చెబుతున్నాయి. జైలు మాన్యువల్ ప్రకారమే తాము వ్యవహరిస్తామని స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ అగ్రనేతలంతా అరెస్టయ్యారు. ఇప్పటికే ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అరెస్టయిన సంగతి తెలిసిందే. కేజ్రీవాల్ గత ఏడాది నవంబరు నుంచి ఈ నెల 21 వరకు ఈడీ జారీ చేసిన 9 సమన్లను బేఖాతరు చేశారు. కేజ్రీవాల్ అరెస్టుపై ఆయన టీమ్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కర్నూలు	36.8	25.6
ఏలూరు	36.0	25.0
అనంతపురం	36.0	24.0
విజయవాడ	35.3	22.4

పలుచోట్ల వర్షాలు

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అధికపీడనం కొనసాగుతుండడంతో భూ ఉపరితలంపైకి తేమగాలులు వీచాయి. దీంతో కోస్తాలో గురువారం పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రాయలసీమ, దక్షిణకోస్తాలో వేడివాతావరణం కొనసాగింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పొడి వాతావరణం నెలకొంటుందని, రాయలసీమలో వేడి తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

సుప్రీంకోర్టుకు 'పతంజలి' క్షమాపణలు

న్యూఢిల్లీ, మార్చి 21: తమ సంస్థల ఉత్పత్తులు, మందుల సామర్థ్యంపై తప్పుదోవ ప్రకటనలు ఇవ్వబోమంటూ పతంజలి ఆయుర్వేద సంస్థ సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పింది. ఈమేరకు పతంజలి మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ, యోగా గురు బాబా రాందేవ్ అనుచరుడు ఒకరు బుధవారం అఫిడవిట్ సమర్పించారు. న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించి పతంజలి ఉత్పత్తులపై ప్రకటనలు ఇచ్చినందుకు మంగళవారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బాబా రాందేవ్‌పాటు బాలకృష్ణ ఏప్రిల్ 2న కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అనాముల్లాల ధర్మాసనం ఆదేశించింది. దీంతో మర్నాడే వివరణ ఇస్తూ అఫిడవిట్ సమర్పించింది. చట్టాలను గౌరవిస్తామని, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించే ఉద్దేశంలేదని బేషరతుగా క్షమాపణలు చెప్పింది. ఇకపై తప్పుదోవపట్టించే ప్రకటనలు ఇవ్వబోమని పేర్కొంది.

దశాబ్దం నుంచి ఆధిపత్య పోరు

- పదేళ్లుగా ఆమ్ ఆద్మీ పార్టీ వర్సెస్ బీజేపీ
- ప్రధాని మోదీని గట్టిగా ఢీకొన్న కేజ్రీవాల్
- పలు రాష్ట్రాల్లో కమలానికి కంట్లో నలుసు
- కేజ్రీవాల్ అరెస్టుతో తుది అంకానికి చేరిక

న్యూఢిల్లీ, మార్చి 21: దాదాపు పదేళ్లుగా కేంద్రంలో మోదీ.. ఢిల్లీలో కేజ్రీవాల్ అధికారంలో ఉన్నారు..! ఈ వ్యవధిలో మోదీకి ఎందరో తలొంచారు.. మరికొందరు ఎందుకొచ్చిన గొడవని సర్దుకున్నారు..! కానీ, కేజ్రీ మాత్రం గట్టిగా ఢీకొట్టారు. తన ఆమ్ ఆద్మీ పార్టీని పంజాబ్, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాలకు విస్తరించి జాతీయ పార్టీ స్థాయికి ఎదగడమే కాక, మోదీ విధానాలను ఎండగడుతూ బీజేపీకి కంట్లో నలుసుగా మారారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ వినహా మోదీకి ఈ స్థాయిలో ఎదురునిలిచింది కేజ్రీవాలే కావడం గమనార్హం. తాజాగా ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఆయన అరెస్టు ద్వారా ఇరు పార్టీల వైరం పతాక స్థాయికి చేరినట్లైంది. మోదీ నాయకత్వంలో బీజేపీ 2014 ఎన్నికల్లో కేంద్రంలో కొలువుదీరింది. ఆ తర్వాత కొద్ది నెలలకే 2015లో జరిగిన ఎన్నికల్లో ఢిల్లీలోని 70 సీట్లకు గాను 67 నెగ్గి కేజ్రీవాల్ చారిత్ర విజయం నమోదు చేశారు. దీనికిముందే 2013లో ఆయన స్వల్పకాలం సీఎంగా పనిచేశారు. తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో వారాణసీలో మోదీపై పోటీకి దిగి వార్తల్లో నిలిచారు. 2019లో మోదీ మరోసారి విజయం సాధించగా, 2020లో అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీ గెలుపొందారు. ఇన్నేళ్లలో ప్రభుత్వ కార్యక్రమాలు, రాజకీయ అభిప్రాయ భేదాలతో వీరి వైరం పెరుగుతూనే పోయింది. ఒక్కో ఎమ్మెల్యేను రూ.25 కోట్లకు కొనుగోలు చేయాలని చూసిందని, పార్టీని చీల్చే కుట్రలకు పాల్పడిందని, కేజ్రీని జైలుకు పంపి ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేసిందనేది బీజేపీపై ఆప్ ఆరోపణలు కాగా, ఆప్, కేజ్రీ అవినీతిని బీజేపీ ఎత్తిచూపేది.

అలా మొదలైంది..

ఇక అధికారుల బదిలీలు, పోలీస్, భూమి విషయాల్లో లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ)కు అధికారం కట్టబెడుతూ 2015లో కేంద్ర హోం శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ కేంద్రం, ఆప్ సర్కారు మధ్య మొదలైన తొలి ఘర్షణగా చెబుతారు. ఇది హైకోర్టు, సుప్రీంకోర్టులో సుదీర్ఘ న్యాయ పోరాటానికి దారితీసింది. నిరుడు మే 11న సీనియర్ అధికారుల బదిలీ, పోస్టింగ్‌పై ఢిల్లీ ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీం తీర్పునిచ్చింది. ఆ కొద్ది రోజులకే ఎల్జీ-ప్రభుత్వం మధ్య అధికార సమతుల్యతను పాటిస్తూ కేంద్రం ఆర్డినెన్స్‌ను తెచ్చింది. నిరుడు ఆగస్టులో నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ గవర్నమెంట్ (సవరణ) చట్టం ద్వారా ఎల్జీకి కేంద్రం అధికారాలను కట్టబెట్టాలని చూసింది.



ఎల్జీలతో లడాయి..

కేంద్ర ప్రభుత్వం నియమించే లెఫ్టినెంట్ గవర్నర్ల (ఎల్జీ)తో ఆప్ సర్కారుకు తొలి నుంచి పొసగలేదు. నజీబ్ జంగ్ ఎల్జీగా ఉన్న సమయంలో.. చీఫ్ సెక్రటరీ నియామకం, అవినీతి నిరోధక శాఖపై నియంత్రణ, సీనియర్ అధికారుల బదిలీ, పోస్టింగ్‌లు, ఫైల్స్‌పై సంతకాల విషయంలో ఆప్ గట్టిగానే నిలదీసింది. దీంతో 400 ఫైల్స్ పరిశీలనకు మాజీ కాగ్ షుంగ్లూ సహా ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. జంగ్ వెళ్లిపోయారు అనుకుంటే, ఆయన స్థానంలో వచ్చిన అనిల్ బైజాల్‌తో కేజ్రీ సర్కారు ఇంకా గట్టిగా తలపడాల్సి వచ్చింది. బైజాల్ కారణంగా అధికారులు తమ మాట వినడం లేదంటూ కేజ్రీ మంత్రులతో కలిసి రాజ్ నివాస్ ఎదుటనే ధర్నాకు దిగే స్థాయికి చేరింది. సీఏఏ వ్యతిరేక అల్లర్లపై స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం, ప్రభుత్వ నిధుల వ్యయం ఇలా చాలా అంశాల్లో బైజాల్-ఆప్ సర్కారు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. 2022 మేలో ఎల్జీగా వచ్చిన వీకే సక్సేనా మొత్తం వ్యవహారాన్ని మలుపుతిప్పారు. బాధ్యతలు చేపట్టిన 2 నెలల్లోనే.. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీలోని అవకతవకలపై సీబీఐ విచారణకు ఆదేశించారు. తర్వాత మనీ ల్యాండరింగ్‌పై ఈడీ రంగంలోకి దిగి ఆప్ మంత్రి మనీశ్ సిసోడియా, ఎంపీ సంజయ్‌సింగ్‌లను అరెస్టు చేసింది. లిక్కర్ స్కాంతో పాటు ఢిల్లీ జల మండలి కేసులోనూ కేజ్రీకి పదేపదే సమన్లు జారీ చేసింది. గురువారం చివరకు కేజ్రీవాల్ అరెస్టు జరిగింది.

సుప్రీం ఆదేశాలనే ధిక్కరిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహించింది. నిత్యం రాజ్యాంగానికి వ్యతిరేకంగానే వ్యవహరిస్తున్న గవర్నర్ రవి తీరును తాము తేలిగ్గా తీసుకోబోమని, దీనిపై తగిన చర్యలకు ఆదేశిస్తామని స్పష్టం చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం కూడా రవి నుంచి వివరణ తీసుకోవాలని సూచించింది. శుక్రవారంలోగా పొన్ముడితో ప్రమాణ స్వీకారం చేయించాలని తేల్చిచెప్పింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో పొన్ముడికి మద్రాసు హైకోర్టు విధించిన శిక్షను సుప్రీంకోర్టు ఇటీవల నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పు తర్వాత పొన్ముడిని మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నిర్ణయించారు. ఆయనతో ప్రమాణస్వీకారం చేయించాలని రాజ్‌భవన్‌కు లేఖ రాశారు. అయితే, సీఎం అభ్యర్థనను గవర్నర్ తోసిపుచ్చారు. పొన్ముడిని నిర్దోషి అని సుప్రీంకోర్టు చెప్పలేదని, కేవలం ఆయన శిక్షను మాత్రమే నిలుపుదల చేసిందని, అలాంటి వ్యక్తితో మళ్లీ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించలేనని పేర్కొన్నారు. గవర్నర్ వైఖరిని సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం...సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై గురువారం ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. గవర్నర్ చెప్పిన కారణాలను, గతంలో ఆయన వ్యవహరించిన తీరును కూడా వివరించారు. ఈ సందర్భంగా ధర్మాసనం...గవర్నర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గవర్నర్ రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించింది. తమిళనాడులో జరుగుతున్న పరిణామాలను సునిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. "గవర్నర్‌కు అసలు చట్టం తెలుసా? ఒక రాష్ట్ర గవర్నర్ తన అధికారాన్ని అడ్డుగా పెట్టుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి సిఫారసు చేసిన వ్యక్తితో మంత్రిగా ప్రమాణం చేయించకపోవడం ఖండించతగ్గ విషయం. రాజ్యాంగ శాసనాన్ని ముందుగా తెలుసుకోవాల్సింది గవర్నరే. ఆయన తన ఇష్టానుసారం నడచుకుంటానంటే కుదరదు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఒక ఎమ్మెల్యేతో మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించనని గవర్నర్ చెప్పడం ఇదే ప్రథమం. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించినట్లే. అంతేకాకుండా ఆయన...రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలను తరచూ అడ్డుకుంటున్నారు. ఇది కూడా ప్రజాస్వామ్యానికి విరుద్ధమే' అని ధర్మాసనం ఆగ్రహించింది.

మా కళ్లకు గంతలు లేవు..

"గవర్నర్ రవి తీరు మమ్మల్ని తీవ్రంగా కలవరపెడుతోంది. మేం ఈ అంశాన్ని అంత తేలిగ్గా తీసుకోవడం లేదు. మేం కళ్లకు గంతలు కట్టుకుని కూర్చోలేదు. గవర్నర్‌పై చర్యలకు ఆదేశిస్తాం. గవర్నర్‌కు సరైన సలహాలు ఇచ్చేవారు లేనట్లుంది. గవర్నర్ రాజ్యాంగాన్ని పాటించకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుంది? గవర్నర్ ఇకనైనా రాజ్యాంగం ప్రకారం నడచుకుంటారని భావిస్తున్నాం" అని బెంచ్ వ్యాఖ్యానించింది.

నంబర్లూ ఇచ్చేశాం!

(మొదటి పేజీ తరువాయి)

వాటిని టార్గెట్ చేసే ప్రమాదం ఉంది) కాబట్టి ఆ వివరాలను మాత్రం ఇవ్వలేదని పేర్కొంది. బాండ్లను కొనుగోలు చేసినవారి కేవైసీ వివరాలను కూడా ఇదే కారణాలతో సమర్పించలేదని వివరించింది. తాము ఇచ్చిన వివరాలతో ఏయే కంపెనీలు/ఎవరెవరు ఏయే పార్టీలకు బాండ్ల రూపంలో విరాళాలు సమర్పించిందీ తెలుస్తుందని.. ఆ వివరాలు తెలుసుకోవడానికి బ్యాంకు ఖాతాలు, కేవైసీ వివరాలు అక్కర్లేదని స్పష్టం చేసింది. ఎస్బీఐ సమర్పించిన ఈ వివరాలను భారత ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైట్‌లో రెండు పీడీఎఫ్ ఫైళ్ల రూపంలో విడుదల చేసింది. ఒక పీడీఎఫ్‌లో బాండ్లను కొనుగోలు చేసినవారి/కంపెనీ పేరు, బాండు విలువ, బాండ్ నంబర్, ఆ బాండును ఎప్పుడు కొనుగోలు చేసింది?, దాని ఎక్స్‌పైరీ డేట్, అది నగదుగా మారిందీ లేనిదీ.. తదితర వివరాలు ఇచ్చింది. మరొక పీడీఎఫ్ ఫైల్‌లో.. బాండ్ నంబ ర్, దాన్ని నగదుగా మార్చుకున్న పార్టీ పేరు, ఏ తేదీన ఆ బాండ్‌ను ఆ పార్టీ సొమ్ము చేసుకుంది, ఏ ఖాతాలో డబ్బు జమ అయ్యిందీ (ఖాతానంబర్ చివరి నాలుగు అంకెలు మాత్రమే ఇచ్చారు) తదితర వివరాలు ఉన్నాయి.

నా మీద అరవొద్దు


- న్యాయవాది నెడుంపరపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఆగ్రహం

న్యూఢిల్లీ, మార్చి 21: "నా మీద అరవొద్దు. ఇదేమీ బహిరంగ ప్రదేశం కాదు.. మీరు కోర్టులో ఉన్నారు" ..అంటూ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సీనియర్ అడ్వొకేట్ జె.నెడుంపరపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల బాండ్లకు సంబంధించి.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసమగ్ర సమాచారం ఇవ్వడంపై దాఖలైన పిటిషన్లను సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారించింది. ఆ విచారణ సందర్భంగా.. ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు తీర్పుతో నెడుంపర విభేదించారు. "ఇది ప్రభుత్వ విధానానికి సంబంధించిన అంశం. దీంట్లో కోర్టులు జోక్యం చేసుకోకూడదు." అంటూ నెడుంపర ధర్మాసనంతో వాగ్వాదానికి దిగారు. దీంతో సీజేఐ ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈ అంశంపై మీరు ఏదైనా అప్లికేషన్ ఇవ్వాలనుకుంటే ఈమెయిల్ ద్వారా పంపండి. అది ఈ కోర్టు ప్రొటోకాల్" అని తేల్చి చెప్పారు. నిజానికి నెడుంపర న్యాయస్థానంతో ఘర్షణ పడడం ఇదే మొదటిసారి కాదు. సీనియర్ అడ్వొకేట్ల నియామకాల్లో న్యాయమూర్తుల పిల్లలకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ 2019లో ఆయన ఆరోపణలు చేయడాన్ని కోర్టు ధిక్కరణ చర్యగా సుప్రీంకోర్టు పరిగణించి, మూడు నెలల జైలు శిక్ష విధించింది. అప్పుడు ఆయన కోర్టును బతిమాలి.. బేషరతుగా క్షమాపణ చెప్పడంతో కోర్టు శిక్షను రద్దు చేసింది.

200 సభ్యుల్లోంచి 2గంటల్లోనే

ఆరుగురిని షార్ట్‌లిస్ట్ ఎలా చేస్తారు?

- కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- ఈసీల నియామకంపై స్టే ఇవ్వలేమని స్పష్టం



న్యూఢిల్లీ, మార్చి 21: ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకం ఆదరాబాదరాగా జరిగిందంటూ సుప్రీంకోర్టు పరోక్షంగా ఆక్షేపించింది. 200 మంది సభ్యుల్లోంచి కొన్ని గంటల్లోనే ఆరుగురిని షార్ట్‌లిస్ట్ ఎలా చేస్తారు? అని కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. మాజీ ఐఏఎస్ జ్ఞానేశ్ కుమార్, సుఖ్బీర్ సింగ్ ఈసీలుగా నియమించిన నేపథ్యంలో సుప్రీం పైవిధంగా స్పందించింది. ఈసీల నియామకంపై 200 మంది సభ్యుల పేర్లను పరిశీలించవచ్చు. అయితే ఇందుకు టైం ఎంత ఇచ్చారు? బహుశా రెండే రెండు గంటలు కావొచ్చు. ఈ విషయంలో మరింత పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉండింది అంటూ కేంద్రాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. లోక్‌సభ ఎన్నికల ముందు ఈసీల నియామకం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈసీల నియామకం కోసం కొత్తగా తీసుకొచ్చిన చట్టాన్ని నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిని గురువారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తా సారథ్యంలోని ధర్మాసనం విచారణ చేసింది. అయితే ఈసీల నియామకం కోసం 200 మంది సభ్యులోంచి గంటల వ్యవధిలో ఆరుగురితో షార్ట్‌లిస్ట్ వెలువరించడాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించినా ఈసీల నియామకంపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ఈ సమయంలో ఈసీల నియామకంపై స్టే విధిస్తే తీవ్ర అనిశ్చితి, గందరగోళానికి దారితీస్తుందని పేర్కొంది. దీనిపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. అయితే ఈసీల నియామకంపై కేంద్రం తెచ్చిన కొత్త చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను పరిశీలిస్తామని కోర్టు స్పష్టం చేసింది. వీటిపై ఆరువారాల్లోగా స్పందన తెలపాలని కేంద్రాన్ని ఆదేశించింది.

'వికసిత్ భారత్' సందేశాలు ఆపండి: ఈసీ

న్యూఢిల్లీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ హయాంలో సాధించిన విజయాలను పేర్కొంటూ ప్రజలకు వాట్సాప్‌లో పంపుతున్న 'వికసిత్ భారత్ సంపర్క్' బల్క్ సందేశాలను నిలిపేయాలంటూ కేంద్రాన్ని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు గురువారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖకు నోటీసులు జారీ చేసింది. దీనిపై తక్షణమే సమ్మతి నివేదికను పంపాలని కోరింది.



పోరుమామిళ్లలోని కొత్తవీధిలో మహబూబ్ చాంద్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భువనేశ్వరి

చంద్రబాబుకు అండగా ఉండండి

- ఆయన సీఎం అయితేనే మీ పిల్లలకు భవిష్యత్తు
- వైసీపీ పాలనలో గంజాయికి అడ్డాగా ఏపీ
- రాజ్యమేలుతున్న ల్యాండ్, శాండ్, లిక్కర్ మాఫియా
- ఓటు ఆయుధంతో దుర్మార్గ పాలనకు అంతం
- 'నిజం గెలవాలి' కార్యక్రమంలో నారా భువనేశ్వరి పిలుపు

కడప, మార్చి 21(ఆంధ్రజ్యోతి): "చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. వారికి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబుపై నమ్మకంతో ఏపీలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఎన్నో కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. ఆయన సీఎం అయితే రాష్ట్రం మళ్లీ నంబర్ వన్‌గా నిలబడుతుంది" అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా గురువారం వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్లలో చంద్రబాబు అక్రమ అరెస్టుతో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించారు. కొత్త వీధిలో గుండెపోటుతో మృతిచెందిన మహబూబ్ చాంద్(40) ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. భువనేశ్వరిని చూసి కుటుంబీకులు భావోద్వేగానికి గురయ్యారు. టీడీపీ మీకు అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం బలిజకోటలో పార్టీ కార్యకర్త మున్నెల్లి అక్కమ్మ కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ, ఉమ్మడి ఏపీ నుంచి విభజిత రాష్ట్రం వరకు చంద్రబాబు హయాంలో రాష్ట్రం నంబర్‌వన్‌గా ఉండేదని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు తరువాత వచ్చిన సీఎంలు ఆయన విధానాలను కొనసాగించారని చెప్పారు. ఈ ఐదేళ్లు చంద్రబాబు సీఎంగా కొనసాగి ఉంటే రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉండేదని పేర్కొన్నారు. జగన్ సీఎం అయిన తరువాత చంద్రబాబుపై కక్షతో పాలన సాగిస్తున్నారని, ఐదేళ్లలో రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చారని ఆరోపించారు. ల్యాండ్, శాండ్, లిక్కర్ మాఫియా రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. సచివాలయాన్ని, ప్రభుత్వ కార్యాలయాలను తాకట్టు పెడుతున్నారని.. భూకబ్జాలు మితిమీరాయని, సెంటు స్థలం నుంచి ఎకరా స్థలం వరకు ఆక్రమించేస్తున్నారని తెలిపారు. అందుకే ప్రతి రోజూ మీ భూములు చెక్ చేసుకోవాలని ప్రజలకు సూచించారు. స్వాతంత్ర్యం కోసం గాంధీజీ పిలుపునిస్తే జనం పోరాటం చేశారని.. ఇప్పుడు వైసీపీ నుంచి విముక్తి కోసం చంద్రబాబుకు అందరూ అండగా ఉండాలని ఆమె కోరారు. ఇవి కీలకమైన ఎన్నికలని, ఓటు అనే ఆయుధంతో ఈ దుర్మార్గ పాలనను అంతం చేద్దామని పిలుపునిచ్చారు. మీరు ఓటు వేయడంతో పాటు మరో పదిమందితో ఓట్లు వేయించాలని అన్నారు. 'ఐదేళ్లలో ఎన్నో అరాచకాలు చూశాం. ఎలాగైనా గెలిచేందుకు వైసీపీ బరి తెగిస్తుంది.. అందుకే రెండు నెలలు కష్టపడండి. చివరి నిమిషం వరకు అప్రమత్తంగా ఉండాలి' అని భువనేశ్వరి సూచించారు. కాగా.. గురువారం రాత్రి బద్వేలులోని ఆర్ ఆర్ కన్వెన్షన్ హాల్‌లో భువనేశ్వరి బస చేశారు. శుక్రవారం బద్వేలు, బి.కోడూరు మండలాల్లోని 4 కుటుంబాలను పరామర్శించనున్నారు.



టీడీపీ నాయకుడు మునయ్య అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోస్తున్న టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి

మునయ్యకు కన్నీటి వీడ్కోలు

గిద్దలూరు టౌన్, మార్చి 21: వైసీపీ నాయకుల చేతిలో దారుణ హత్యకు గురైన టీడీపీ నాయకుడు పాముల మునయ్యకు ఆ పార్టీ శ్రేణులు కన్నీటి వీడ్కోలు పలికాయి. ఈ నెల 18న వైసీపీ నాయకుల చేతిలో తీవ్రంగా గాయపడిన మునయ్య హైదరాబాద్ కిమ్స్‌లో చికిత్సపొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి మృతదేహాన్ని ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలంలోని గడికోట పంచాయతీ పరిధిలోని పరమేశ్వర్‌నగర్‌కు తీసుకొచ్చారు. గురువారం టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మునయ్య మృతదేహానికి టీడీపీ జెండా కప్పి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. మునయ్య కుటుంబానికి రూ.2లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఫోన్‌లో పరామర్శించి, అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈఏపీసెట్ తేదీల మార్పు

- మే 16 నుంచి 22 వరకు నిర్వహణ

జేఎన్టీయూకే, మార్చి 21: రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీఈఏపీసెట్)-2024 పరీక్షలను మే 16 నుంచి 22 కు మార్పు చేసినట్లు ఏపీఈఏపీసెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మే 13 నుంచి 19 వరకు ఈ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, మే 13న రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మే 16 నుంచి 22 వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ఏపీలో 47, హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, సికింద్రాబాద్‌ల్లో రెండు కేంద్రాలు మొత్తం 49 ప్రాంతీయ కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. https://cets.apsche.ap.gov.in/EAPCET/Eapcet/EAPCET_HomePage.aspx లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పూరించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే 0884-2359599, 2342499 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు లా సెట్ నోటిఫికేషన్ విడుదల

పెదకాకాని, మార్చి 21: ఆంధ్రప్రదేశ్‌లో న్యాయ శాస్త్ర కోర్సుల్లో ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఏపీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్, ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2024 నోటిఫికేషన్ శుక్రవారం విడుదల చేయనున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నోటిఫికేషన్ వివరాలను ప్రకటించారు. మూడేళ్లు, ఐదేళ్ల ఎల్ఎల్బీ, రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు సంబంధించి ఈ నెల 26 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చు. ఏప్రిల్ 25లోగా అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.500 అపరాధ రుసుముతో ఏప్రిల్ 26 నుంచి మే 3 వరకు, రూ.1000 అపరాధ రుసుంతో మే 11 వరకు, రూ.2000 అపరాధ రుసుముతో మే 12 నుంచి 20 వరకు, రూ.3000 అపరాధ రుసుముతో మే 29వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తుల్లో మార్పులకు మే 30 నుంచి జూన్ 1 వరకు అవకాశం ఇచ్చారు. జూన్ 3 నుంచి హాల్ టికెట్లను అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 9న మధ్యాహ్నం 2.30 నుంచి 4.00 గంటల వరకు ఆన్‌లైన్‌లో లా సెట్ పరీక్ష జరుగుతుంది. పూర్తి వివరాలను cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. ఏమైనా సందేహాలు ఉంటే వర్సిటీలోని లా సెట్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 7993788813, 0863-2346171 నంబర్లలో సంప్రదించవచ్చని కన్వీనర్ తెలిపారు.

31న ప్రభుత్వ ఖాతాలున్న బ్యాంకులకు సెలవు రద్దు

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి రోజైన మార్చి 31 ఆదివారం కూడా ప్రభుత్వ ఖాతాలు నిర్వహించే బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెలవు రద్దు చేసింది. సాధారణంగా ఆదివారం సెలవు దినం కాగా, కేంద్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు ప్రభుత్వ ఖాతాలపై లావాదేవీల కోసం అన్ని ఏజెన్సీ బ్యాంకులు తెరిచి ఉంచాలని ఆర్బీఐ స్పష్టం చేసింది. సంవత్సరాంతంలో ప్రభుత్వ ఆర్థిక లావాదేవీలన్నీ యథావిధిగా నిర్వహించాలని ఆదేశించింది.

కోడ్ వచ్చిన రోజే 'మైపాడు' ప్రైవేటుకు

- రహస్యంగా బీచ్ రిసార్ట్ ఐదేళ్లు లీజుకు.. 'ఆంధ్రజ్యోతి' చేతికి చిక్కిన ఆధారం
- ముడుపుల పర్వం సాగినట్టు ఆరోపణలు

విజయవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణ అంశంపై హైకోర్టులో కేసు విచారణ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఉన్నతాధికారులకు ఇవేవీ పట్టడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక యూనిట్లను కారు చౌకగా ప్రైవేటు చేతుల్లో పెట్టేందుకు రంగం సిద్ధం చేసిన ఏపీటీడీసీ ఉన్నతాధికారులు.. తాజాగా నెల్లూరు జిల్లాలోని మైపాడు బీచ్ రిసార్ట్‌ను ప్రైవేటు సంస్థకు కట్టబెట్టారు. సరిగ్గా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజునే దీనిని అప్పగించారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) ఆఫ్ హోమ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ అనే సంస్థకు ఐదేళ్ల కాలానికి లీజుకు ఇచ్చేశారు. పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణకు సంబంధించి పర్యాటక శాఖ ఉద్యోగుల సంఘం నేతలు కొందరు ఇటీవలే హైకోర్టులో కేసు వేశారు. ఈ కేసు విచారణలో ఉంది. ప్రైవేటీకరణ అంశాలతో పాటు ఇతర ఆరోపణలపైనా రెండు వారాలలో కౌంటర్ వేయాలని కోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఏపీటీడీసీ అధికారులు ప్రైవేటీకరణ చర్యలు మానటం లేదు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక యూనిట్ల ద్వారా వస్తున్న వాస్తవ ఆదాయం కంటే కూడా కారు చౌకగా లీజుకు ఇవ్వాలని నిర్ణయించటంపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ప్రైవేటీకరణ పేరుతో సొంత మనుషులకు పర్యాటక యూనిట్లను కట్టబెట్టేస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. అస్మదీయ సంస్థలకు అవకాశం కల్పించటం వల్ల ఉన్నతాధికారులకు ఆదాయంలో వాటాలు ఇవ్వబోతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మైపాడు బీచ్ రిసార్ట్‌ను ప్రైవేటు సంస్థ చేతిలో పెట్టేశారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున ముడుపుల పర్వం నడిచిందన్న ఆరోపణలు వస్తున్నాయి.

కథ అడ్డం తిరిగింది

రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక యూనిట్ల రెన్నోవేషన్ పనులకు పిలిచిన టెండర్లను కోడ్ నేపథ్యంలో పాత తేదీలతో ఖరారు చేసి వర్క్ ఆర్డర్స్ ఇచ్చేందుకు బుధవారం విజయవాడలో ఏపీటీఏ కార్యాలయంలో ఉన్నతాధికారులు రహస్యంగా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. మీటింగ్ విషయం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో రావటంతో ఏపీటీడీసీ ఉద్యోగులు ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పర్యాటక యూనిట్లను తనఖా పెట్టి విజయవాడ రామవరప్పాడులోని ఎస్‌బీఐ బ్రాంచి ద్వారా రుణం తీసుకున్న డబ్బులతో ఈ పనులు చేయిస్తున్నట్టుగా ఏపీటీడీసీ ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లను ఊరించారు. ముందుగా కమీషన్లు తీసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. పాత తేదీలతో అగ్రిమెంట్లు చేసుకుందామని, పాత తేదీలతో వర్క్ ఆర్డర్స్ ఇస్తామని, కమీషన్లు ఇచ్చేసి పనులు మొదలు పెట్టుకోమని చెప్పినట్టుగా గుప్పుమంది. అయితే రామవరప్పాడు ఎస్‌బీఐ బ్రాంచి ఇంకా రుణం సర్దుబాటు చేయలేదని సమాచారం. ఈ విషయం కాంట్రాక్టర్లకు ముందుగా తెలియకపోవడంతో సమావేశంలోనే కమీషన్లు ఇచ్చేందుకు డబ్బుల మూటలు తీసుకువచ్చారు. బుధవారం నాటి సమావేశంలో పనులకు బిల్లుల చెల్లింపు అంశాలకు సంబంధించి కొన్ని అస్పష్టతలు ఉండటంతో కాంట్రాక్టర్లు కమీషన్ల డబ్బులను బయటకు తీయలేదని సమాచారం. గురువారం బ్యాంకు నుంచి రుణమే రాలేదని పలువురు కాంట్రాక్టర్లు తెలుసుకున్నారు. ముందుగా ఉన్నతాధికారులకు కమీషన్లు ఇచ్చేస్తే .. ఆ తర్వాత చేసిన పనులకు బిల్లులు రాక నష్టపోతామని, ప్రభుత్వం మారితే విజిలెన్స్ విచారణలను కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో పలువురు కాంట్రాక్టర్లు గురువారం విజయవాడలో రహస్యంగా భేటీ అయ్యారు. ఉన్నతాధికారులు కమీషన్ల కోసం ఒత్తిడి తెస్తున్నారని, మనమే ఇబ్బందులు పడతామని, ఎన్నికలయ్యే వరకు ఓపిక పట్టాలని నిర్ణయించినట్టుగా తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న ఏపీటీడీసీ ఉన్నతాధికారులు ఇంజనీరింగ్ విభాగం అధికారుల ద్వారా కాంట్రాక్టర్లు పనులు చేపట్టాలని ఒత్తిడి తీసుకురావటం ప్రారంభించారు.



ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజున నెల్లూరు జిల్లా మైపాడు బీచ్ రిసార్ట్‌ను ప్రైవేటుకు అప్పగించిన దానికి సాక్ష్యం ఇదే



శ్రీవారి భక్తులకు అన్నప్రసాదాలను వడ్డిస్తున్న లోకేశ్

శ్రీవారి సేవలో నారా కుటుంబం

- దేవాన్ష్ పుట్టినరోజు.. భక్తులకు అన్నదానం

తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గురువారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా సతీమణి బ్రాహ్మణి, తల్లి భువనేశ్వరితో కలిసి బుధవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన, గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనానికి చేరుకున్నారు. సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్, తల్లి భువనేశ్వరితో కలిసి భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించారు. ఏటా దేవాన్ష్ జన్మదినాన తిరుమలలో ఒకరోజు అన్నప్రసాద వితరణ పథకానికి నారా కుటుంబం విరాళమిస్తున్న విషయం తెలిసిందే. ఈసారి కూడా అన్నప్రసాద వితరణకు రూ.38 లక్షల విరాళాన్ని టీటీడీకి అందజేసి కొంత సమయం స్వయంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడంతో పాటు భక్తులతో కలిసి అన్నప్రసాదాలను స్వీకరించారు. అనంతరం, తిరుపతి చేరుకున్న ఆయన.. తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, స్థానిక టీడీపీ నేతలతో కొద్ది సమయం వేర్వేరుగా రాజకీయ పరిస్థితులపై చర్చించారు.



ఇండియా కూటమి ఐక్యవేదిక సదస్సులో సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు

మెడలు వంచుతానని మోకరిల్లారు

- బీజేపీకి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన జగన్
- ఇండియా కూటమి సభలో షర్మిల ధ్వజం
- బీజేపీని, దానికి సహకరిస్తున్న పార్టీలనూ ఓడిద్దాం
- సీపీఎం, సీపీఐ నేతల పిలుపు

విజయవాడ/గవర్నరుపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విభజన జరిగి పదేళ్లయినా రాష్ట్రానికి రాజధాని లేకపోవడం సిగ్గుచేటని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. బీజేపీ అభ్యర్థులు ఎక్కడ పోటీ చేసినా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇండియా కూటమి ఐక్యవేదిక సదస్సు విజయవాడలోని బాలోత్సవ్ భవనంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం కేంద్రం మెడలు వంచుతానన్న జగన్ చివరికి బీజేపీకి మోకరిల్లారని విమర్శించారు. 'రాష్ట్రంలో గంగవరం పోర్టును అదానికి కట్టబెట్టారు. బీజేపీ ఏది అడిగినా ఇవ్వడానికి సిద్ధంగా జగన్ ఉన్నారు. బీజేపీకి ఊడిగం చేస్తూ రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారు. రాష్ట్రానికి కేంద్రం ఏంచేసిందో అధికార, ప్రతిపక్షాలు చెప్పగలవా?. బీజేపీకి కొమ్ముకాస్తున్న పక్షాలకు ప్రజలు బుద్ధి చెప్పాలి' అని షర్మిల ప్రజలకు పిలుపునిచ్చారు. జగన్, చంద్రబాబు తెలుగు ప్రజల పౌరుషాన్ని మోదీ పాదాల వద్ద తాకట్టు పెట్టారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. మత రాజకీయాల ద్వారా ఎన్నికల్లో గెలవాలని బీజేపీ చూస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. అన్ని ప్రాంతీయ పార్టీలను బీజేపీ బెదిరిస్తోందన్నారు. సమావేశంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయం ఎదుట మంత్రి పెద్దిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

మంత్రి పెద్దిరెడ్డి క్షమాపణ చెప్పాలి

- లేదంటే బస్సుయాత్రను అడ్డుకుంటాం
- అనుచిత వ్యాఖ్యలపై కర్నూలులో దివ్యాంగుల నిరసన

కర్నూలు(అర్బన్), మార్చి 21: చంద్రబాబు నాయుడును రాజకీయ వికలాంగుడు అని సంబోధించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని, లేదంటే వైసీపీ బస్సుయాత్రను అడ్డుకుంటామని విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.యల్లప్ప అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని టీడీపీ కార్యాలయం ఎదుట మంత్రి పెద్దిరెడ్డి దిష్టిబొమ్మను దివ్యాంగులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యల్లప్ప మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు సంకల్పయాత్రలో ప్రతి రోజూ విభిన్న ప్రతిభావంతులతో ఫొటోలకు ఫోజులు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతారా? అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని నిలదీస్తున్న మహిళ

ద్వారంపూడి, మేకపాటికి చేదు అనుభవం

- తొలిరోజు ఎన్నికల ప్రచారంలోనే నిలదీతలు

కార్పొరేషన్(కాకినాడ), మర్రిపాడు, మార్చి 21: కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిలకు గురువారం తొలిరోజు ఎన్నికల ప్రచారంలోనే చుక్కెదురైంది. కాకినాడ ఏటిమొగ ప్రాంతాన్ని ద్వారంపూడి పర్యటించగా.. 'ఏటిమొగ వచ్చి ఎన్ని ఏళ్లయ్యింది? మా మత్స్యకారులకు ఏం చేశావని ఇప్పుడు వచ్చి ఓట్లు అడుగుతున్నావు? చెత్త మీద కూడా పన్ను వేస్తారా?' అని మహిళలు నిలదీయడంతో ఆయన ఉక్కిరిబిక్కిరయ్యారు. మరోచోట ఇంటి ముందు కూర్చుని ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతున్న మహిళను ఉద్దేశించి.. 'అమ్మా లేచి నిలబడి మాట్లాడ'మని వైసీపీ నాయకుడు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. ఏటిమొగలో ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడికి అడుగడుగునా ఇదే పరిస్థితి ఎదురుకావడంతో వచ్చామా.. వెళ్లామా అన్నట్లు ముగించారు. అలాగే, 'మా గ్రామానికి మీరేం చేశారో చెప్పండి. జగనన్న ఇంటిస్థలాలని అడవిలో చూపిస్తే అక్కడ ఇల్లు కట్టుకుని ఎలా ఉండగలం? పేదలకు సెంటు భూమి ఇవ్వకుండా మండలంలో వందల భూ సమస్యలు పరిష్కరించామని చెప్పడం ఏమిటి?' అంటూ నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని మహిళలు నిలదీశారు. మర్రిపాడు మండలం చిన్నమాచునూరు పంచాయతీలో 'విజయీభవ' పేరుతో గురువారం ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. కదరి నాయుగుపల్లిలో ఎమ్మెల్యే ప్రసంగాన్ని మహిళలు అడ్డుకున్నారు. సమస్యలు పరిష్కరించలేనప్పుడు మీకెందుకు రాజకీయం అంటూ ఓ ముస్లిం మహిళ నిలదీసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నేపాల్‌లో కొత్త రాజకీయం

మరో నాలుగైదురోజుల్లో నేపాల్ ఉపప్రధాని నారాయణ్ కాజీ శ్రేష్ఠ చైనా వెళ్ళి, బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్‌ఐ) ప్రాజెక్టులకు సంబంధించిన ఒప్పందాలమీద సంతకాలు చేస్తారట. ఓ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు ఆయన ప్రయాణం కడుతున్నప్పటికీ, ఉభయదేశాల మధ్యా నాలుగేళ్ళుగా నలుగుతున్న బీఆర్‌ఐ వ్యవహారాన్ని కొలిక్కి తీసుకురావడమే ఆయన పర్యటన ప్రధాన లక్ష్యమని వార్తలు వస్తున్నాయి. నేపాలీ కాంగ్రెస్‌తో తెగ దెంపులు చేసుకొని, మళ్ళీ తన పాతశత్రువైన కేపీశర్మ ఓలి పార్టీతో ప్రధానమంత్రి పుష్పకుమార్ దహల్ అలియాస్ ప్రచండ ఇటీవల కూటమికట్టిన నేపథ్యంలో బీఆర్‌ఐ ప్రాజెక్టుల విషయంలో తిరిగి కదలిక వచ్చినట్టు కనిపిస్తోంది. చైనాకు కేపీశర్మ ఓలి సన్నిహితుడన్న విషయం తెలిసిందే. అసలే ప్రచండ, ఆ పైన ఓలీతో చేతులు కలపడం భారత దేశానికి ఓ కొత్త తలనొప్పి ఖాయంగా కనిపిస్తోంది.

బీఆర్‌ఐలో భాగంగా ఏడు ప్రాజెక్టులకు సంబంధించి ఏడేళ్ళక్రితం నేపాల్–చైనా మౌలికమైన అవగాహన కుదుర్చుకున్నాయి. అయితే, పెట్టుబడి ఏ రూపంలో ఉండాలన్న విషయంలో చైనాతో అవగాహన కుదరక, అప్పుల ఊబిలోకి జారిపోతామన్న భయంవల్ల కూడా ఈ ప్రాజెక్టులు ముందుకు కదలలేదు. అయితే, తాను నిర్మించిన పొఖారా విమానాశ్రయాన్ని కూడా బీఆర్‌ఐలో భాగంగా చైనా అభివర్ణించడం, బీఆర్‌ఐ ప్రాజెక్టులను ఇంకా ఆరంభించనేలేదని మరోపక్క నేపాల్ అంటూండటం చూస్తూనే ఉన్నాం. గ్రాంట్లు, రుణాలు తదితర విషయాల్లో ఉభయదేశాల మధ్యా ఇటీవల ఒక అవగాహన కుదిరిందని, ముసాయిదా తయారైందని, సంతకాలు కాగానే ప్రాజెక్టులు పట్టాలెక్కుతాయని వార్తలు వస్తున్నాయి. భారతదేశ సరిహద్దులకు అత్యంత సమీపంలో ప్రత్యేక ఆర్థికమండళ్ళు, రోడ్లు, రైళ్ళు ఇత్యాది రవాణా మార్గాల వంటివి ఏర్పడబోతున్నాయని దీని అర్థం. భారీ ప్రాజెక్టుల కోసం తవ్వకాలు, సొరంగాల నిర్మాణం వంటివి జరుగుతూండటం కచ్చితంగా ఓ కంట కనిపెట్టవలసిన వ్యవహారమే. ప్రచండ అధికారంలోకి రాగానే బీఆర్‌ఐ విషయంలో చెప్పుకోదగ్గ కదలిక వచ్చింది. ఇప్పుడు కేపీశర్మ ఓలితో చేతులు కలిపిన నేపథ్యంలో ఆచరణ దిశగా అడుగులు వేగంగా పడుతున్నట్టు కనిపిస్తోంది.

వారం క్రితం ప్రచండ సభావిశ్వాసాన్ని చూరగొన్నప్పుడు బొటాబొటి మద్దతుతో బయటపడ్డారు. 2022 నవంబరు సార్వత్రిక ఎన్నికల అనంతరం ఆయన తన భాగస్వామ్యపక్షాలను మార్చడం ఇది మూడోసారి. సొంతబలం లేకున్నా మిత్రపక్షాలను తారుమారుచేస్తూ ప్రధానిగా కొనసాగగలుగుతున్నారు. ఆయన ప్రభుత్వానికి ఇప్పటివరకూ మద్దతు ఇస్తున్న నేపాలీ కాంగ్రెస్‌తో ప్రాంతీయస్థాయి ఎన్నికల నిర్వహణకు సంబంధించి విభేదాలు వచ్చాయని, అంతకంటే ముఖ్యంగా, ఆ పార్టీకి చెందిన దాదాపు సగంమంది సభ్యులు దేశాన్ని తిరిగి హిందూ రాజ్యంగా ప్రకటించాలంటూ ఇటీవల ఓ తీర్మానం చేయడం ఈ కొత్త పరిణామానికి కారణమని అంటారు. ఈ దిశగా ఇప్పటికే ఉద్యమం సాగుతున్న విషయం తెలిసిందే. అనేక పార్టీలూ, సంఘాలూ ఇందులో చేరుతూంటే, మాజీ రాజు జ్ఞానేంద్ర తన మద్దతు ప్రకటించారు కూడా. మార్చి 4న నేపాలీ కాంగ్రెస్‌తో తెగదెంపులు చేసుకొని, కేపీ శర్మ ఓలీ పార్టీతో చేతులు కలిపి, మార్చి 13న సభావిశ్వాసాన్ని చూరగొన్నప్పుడు 275 సంఖ్యాబలం ఉన్న సభలో ఈ ఏడుపార్టీల సంకీర్ణానికి 157 ఓట్లు వచ్చాయి. మూడు అవిశ్వాస తీర్మానాల్లోనూ అత్యంత తక్కువ మార్కులు పడ్డది ఇప్పుడే. ఈ కూటమి ఎంతకాలం నిలుస్తుందన్నది అటుంచితే, కేవలం ముప్ఫైరెండు స్థానాలున్న ప్రచండ 89 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించిన నేపాలీ కాంగ్రెస్‌తోనూ, 79 స్థానాలున్న ఓలీ పార్టీతోనూ పొత్తుల ఎత్తులు వేస్తూ అధికారంలో కొనసాగగలుగుతున్నారు. ఇప్పుడు నేపాల్‌లో రెండు కమ్యూనిస్టు పార్టీలు కూటమి కట్టి అధికారంలో ఉండటం చైనాకు సంతోషాన్ని కలిగించే పరిణామం. ఈ రెండుపార్టీలూ దగ్గరకావడానికి గతంలో విశేష కృషిచేసిన చైనాకు ఆ సంతోషం ఎక్కువకాలం నిలవలేదు. ఇప్పుడు అవి చేయీచేయీ కలిపి ఏడేళ్ళుగా పురోగతిలేని ప్రాజెక్టులను పరుగులుపెట్టించాలని నిర్ణయించడం చైనాకు మరింత ఉత్సాహాన్నిచ్చే విషయం. నడిరోడ్డుమీద బిచ్చమైనా ఎత్తుకుంటాను కానీ, ఓలీతో చేతులు కలిపేది లేదని ప్రచండ చేసిన ప్రతిజ్ఞ ఇప్పుడు చాలామందికి గుర్తుకు వస్తున్నది.

2024 : సమ ఉజ్జీల సమరమేనా?





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

సార్వత్రిక ఎన్నికలు ఒక పెద్ద పరుగు లాంటివి. 18వ లోక్‌సభ ఎన్నికలు రెండున్నర నెలల పాటు, ఏడు దశలలో అందునా చండ్రగాడ్పులు వీచే వేసవిలో జరగనున్నాయి. కనుకనే ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగించినా, ఈ ప్రజాస్వామ్య పోరుతో సాధారణంగా ముడివడి ఉండే కోలాహలం కొరవడింది. ఉత్సాహం లోపించడానికి మరింత సహేతుకమైన కారణం కూడా ఉన్నది: ఎన్నికల ఫలితాలు ముందుగానే నిశ్చయమై ఉన్నాయి! ఆ ఫలితాల అనివార్యతపై ఒక స్పష్టమైన ఏకాభిప్రాయమున్నది. విజేతలు ఎవరో, పరాజితులు ఎవరో ముందుగానే తేలిపోయినప్పుడు పోరుపై ఆసక్తి సన్నగిల్లి పోవడమూ సహజమే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే మరోసారి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారన్నదే ఆ నిశ్చిత విషయం. స్వతంత్ర భారత ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అంటే మోదీకి ఆరాధనా భావం ఏ మాత్రం లేక పోగా వ్యతిరేకత ఉన్నది. అయితే ఆయన మాదిరిగానే ఈయన కూడా వరుసగా మూడోసారి ప్రధానమంత్రి కానున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం తప్పక సంభవించే సంఘటన ఇదేనని అసంఖ్యాక ఓటర్లు విశ్వసిస్తున్నారు. ఫలితాలు ముందుగానే నిర్ధారణ అయినప్పటికీ ఒక ప్రశ్న వేయక తప్పదు: 'స్వేచ్ఛ'గా, 'నిష్పాక్షికం'గా జరగాల్సిన ఈ ప్రజాస్వామ్య పోరులో పాల్గొనే రాజకీయ పక్షాలు అన్నిటికీ సమాన విజయావకాశాలు ఉన్నాయా?

ప్రతిపక్షాల పరిస్థితి గందరగోళంగా ఉందనడంలో సందేహం లేదు. ప్రతిపక్ష కూటమి 'ఇండియా' ఏక త్రాటిపై లేదు. ఎవరికి వారే యమునా తీరేగా పలు భాగస్వామ్య పక్షాలు వ్యవహరిస్తున్నాయి. అంతర్గత వైరుధ్యాలు 'ఇండియా'ను పీడిస్తున్నాయి. దాని కదనోత్సాహాన్ని బలహీనపరుస్తున్నాయి. మహారాష్ట్ర తమిళనాడు మినహా మరే ప్రధాన రాష్ట్రంలోనూ 'ఇండియా' భాగస్వామ్య పక్షాలు కలసికట్టుగా లేవు. ఈ కూటమి ఆవిర్భావానికి ప్రధాన కారకుడు అయిన నితీశ్ కుమార్ రాజకీయ కసరత్తులలో మొనగాడినని మరోసారి నిరూపించుకున్నారు. 'ఇండియా' నుంచి వైదొలిగి ఎన్డీఏలో చేరారు! బిహార్ ముఖ్యమంత్రి పదవిని పదిలపరచుకున్నారు. మమత బెనర్జీ 'ఏక్లా చలో' (ఒంటరిగా సాగిపోవాలి) మంత్రాన్ని అనుష్ఠానిస్తున్నారు; తాత చరణ్ సింగ్‌కు 'భారతరత్న' పురస్కారంతో జయంత్ చౌదరి పరమానంద భరితుడై బీజేపీలో చేరారు; అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నారు. పంజాబ్‌లో ప్రతి లోక్‌సభా స్థానానికి ఆయన నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తోంది; హిందూత్వ శక్తులను ఓడించడమే లక్ష్యం కావాలని ఘోషించే వామపక్షాలు వయనాడ్‌లో రాహుల్ గాంధీనే కాకుండా కేరళ వ్యాప్తంగా కాంగ్రెస్‌ను సవాల్ చేస్తున్నాయి. మార్గదర్శకత్వం లోపించిన ప్రతిపక్షానికి కాంగ్రెస్ పరిస్థితి అద్దం పడుతోంది. 'ఇండియా' కూటమిని సంఘటితం చేయాల్సిన సమయంలో రాహుల్ గాంధీనే మరోసారి భారత్ జోడో యాత్రలో నిమగ్నమయ్యారు.

ఇలా ఎంతగా అనైక్యంగా ఉన్నప్పటికీ ఎన్నికల రంగంలో సమాన విజయావకాశాల లబ్ధికి ప్రతిపక్ష కూటమి పూర్తిగా అర్హమైనది. ఎన్నికల సంఘాన్నే తీసుకోండి. ఎన్నికలను సక్రమంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యత ఈ రాజ్యాంగ సంస్థపై ఉన్నది. తటస్థ మధ్యవర్తిగా ఎన్నికల సంఘం ఏ ఒక్క రాజకీయ పక్షం వైపు మొగ్గకూడదు. మరి ఈ రాజ్యాంగ సంస్థ తన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నదా? 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణ దాని చిత్తశుద్ధికొక పరీక్ష. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాలు ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఉన్నాయని ఎన్నికల సంఘంలో వ్యక్తమైన మెజారిటీ అభిప్రాయంతో ఎన్నికల కమిషనర్లలో ఒకరైన అశోక్ లావాసా విభేదించారు. అయితే ఆ భిన్నాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడమే కాకుండా, అసలు ఆయన్ని ఆ రాజ్యాంగ సంస్థ నుంచి తొలగించారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో భారత ప్రధాన న్యాయమూర్తి కూడా భాగస్వామిగా ఉండి తీరాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని మోదీ సర్కార్ ఖాతర్ చేయలేదు. సీజేఐ ప్రమేయం లేకుండానే ఇటీవల ఇద్దరు కొత్త కమిషనర్లను నియమించింది. ఈసీ ప్రకటించిన ఎన్నికల షెడ్యూలు సైతం పలు ఇబ్బందికర ప్రశ్నలకు తావిస్తోంది. ఎన్నికల హింసాకాండ చరిత్ర లేని మహారాష్ట్రలో పోలింగ్‌ను ఐదు విడతల్లో ఎందుకు నిర్వహిస్తున్నారు? ప్రతి దశలోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పర్యటించి ప్రచారం చేసేందుకు వెసులుబాటు కల్పించేందుకేనా?

ప్రధాని మోదీ హయాంలో రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తి నామమాత్రమై పోతోంది. ఎన్నికల సంఘం విశ్వసనీయత తగ్గిపోవడం కూడా ఇందులో భాగమేనని చెప్పక తప్పదు. గత ఏడాది వికసిత్ భారత్ యాత్ర సందర్భంగా మోదీ ప్రభుత్వ విజయాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించే బాధ్యతలను ఉన్నతాధికారులకు అప్పగించే ప్రయత్నాలు జరిగాయి. ప్రభుత్వ యంత్రాంగాన్ని ఇలా నిస్సిగ్గుగా రాజకీయాకరణ చేయడం చాలా వివాదాస్పదమమయింది. అలాగే ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని సైనికులను రక్షణ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. దీనివల్ల అధికార పార్టీ, ప్రభుత్వం మధ్య విభజన రేఖ చెరిగిపోయింది. ఇదెలా రాజ్యంగ విహితం?

కేంద్ర దర్యాప్తు సంస్థలను ముఖ్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వంపై విమర్శలను ఎదుర్కొనేందుకై ప్రతిపక్షాలపై దర్యాప్తు సంస్థలను ఉసిగొలుపుతున్నారు. ఫలితంగా విపక్ష నేతలు సదా తమపై ఎటువంటి కేసులు నమోదు అవుతాయనే భయాందోళనలలో ఉంటున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు పదే పదే సమన్లు జారీ చేసి అరెస్టు చేశారు. జల్ బోర్డ్ కేసుకు సంబంధించి కూడా ఆయనకు సమన్లు జారీ అయ్యాయి. ప్రజల దృష్టిలో నిజాయితీపరులు కాని నేతలుగా తమ ప్రత్యర్థులను అప్రదిష్టపాలు చేయడమే లక్ష్యంగా జాతీయ అధికార పక్షం వ్యవహరిస్తోంది. మద్యం కేసులోనే భారత రాష్ట్ర సమితి నాయకురాలు కవితను అరెస్ట్ చేశారు. ఎన్నికల తరుణంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు మరింత ముమ్మరం కానున్నాయనడంలో సందేహం లేదు.

దర్యాప్తు సంస్థల బలప్రయోగ చర్యలు, బాండ్ల రూపేణా విరాళాల మధ్య సహ సంబంధమున్నదని ఇంత వరకు వెల్లడయిన ఎన్నికల బాండ్ల వివరాలు స్పష్టం చేస్తున్నాయి. దాతలు, నేతల మధ్య ఒక క్విడ్ ప్రో కో ఒప్పందం మేరకే ఆ బాండ్ల కొనుగోలు జరిగిందనేది వాస్తవం. భారీ విరాళాలు ఇచ్చిన 30 కంపెనీలలో 14, ఆ బాండ్లను కొనుగోలు చేసిన కాలంలో వివిధ ఆరోపణలపై దర్యాప్తు చర్యల నెదుర్కొంటున్నవే కావడం గమనార్హం. చట్టం భారినపడకుండా ఉండేందుకే ఆ కంపెనీలు ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసివుంటాయని పైన పేర్కొన్న వాస్తవం విస్పష్టంగా సూచిస్తోంది. సరే, ఈ బాండ్ల సొమ్ములో సగానికి పైగా బీజేపీకే దక్కడంలో ఆశ్చర్యపోవల్సిందేమీ లేదు. దేశవ్యాప్తంగా ప్రభావ ప్రాభవాలు అపరిమితంగా ఉన్న పార్టీ అది. అధికారాలూ ఆర్థిక వనరులూ అపారంగా దానికి అందుబాటులో ఉన్నాయి. మరి మిగతా పార్టీలు మొత్తంగా చేసే ఖర్చు కంటే కేవలం ఒకే ఒక్క పార్టీ చేస్తున్న వ్యయం అధిక మొత్తంలో ఉన్నప్పుడు ప్రజలను ఆకట్టుకునే ప్రచారార్భాటాలు ఆ ఒక్క పార్టీకే లబ్ధి చేకూర్చేవిగా ఉండవూ? మోదీ సర్కార్ నిర్వహిస్తున్న మల్టీ -మీడియా ప్రచార సమరాలను గమనిస్తే ఆ విషయం మరింతగా స్పష్టమవుతుంది.

ఆ ప్రచార ధోరణులూ, దృశ్యాలూ మన దృష్టిని మీడియా తీరుతెన్నుల వైపుకు తీసుకెళుతున్నాయి. పత్రికలు, టీవీ ఛానెళ్లలో అధిక భాగం తమ విధ్యుక్త ధర్మాన్ని త్యజించాయి. ప్రజలకు పాలకులు జవాబుదారీలుగా ఉండేలా చేయడంలో మీడియాకు కీలక పాత్ర ఉన్నది. పాలకుల స్వార్థాల నుంచి ప్రజల ప్రయోజనాలను రక్షించడానికి ఒక కాపలా వ్యవస్థ (వాచ్ డాగ్)గా పని చేయాలి. మరి మీడియా అలా వ్యవహరిస్తుందా? దేశంలో ప్రధాన టీవీ వ్యూయర్‌షిప్ మానిటోరింగ్ ఏజెన్సీ అయిన బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ 2019 ఏప్రిల్‌లో నిర్వహించిన ఒక సర్వేలో టీవీ చానెల్స్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, ఆయన రాజకీయ ప్రత్యర్థుల కంటే మూడురెట్లు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నాయని వెల్లడయింది. మోదీ సంబంధిత వార్తాకథనాలు, ఇతర కార్యక్రమాలు మొదలైనవి మోదీని ప్రశంసలతో ముంచెత్తేవేనని మరి చెప్ప నవసరం లేదు.

మీడియా మద్దతు అంతగా లేనిపక్షంలో మోదీ విజయం సాధించలేరన్నట్టుగా దీనిని అర్థం చేసుకో నవసరం లేదు. అలాగే రాజ్యవ్యవస్థను సంస్థాగతంగా కైవసం చేసుకుని ఉండకపోతే ఆయన ఓటమి పాలయ్యేవారు అనేందుకు కూడా ఆస్కారం లేదు. వాస్తవమేమిటంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అపరిమితంగా అధికారం చెలాయించే నాయకుడు. నిరంకుశంగా ప్రవర్తించడం ఆయన స్వతస్సిద్ధ స్వభావం. మరే నేతకు లేని ప్రజాదరణ ఆయనకు ఉన్నది.

జనాన్ని సమ్మోహపరచడంలో ఆయన అద్వితీయుడు. మోదీ వ్యక్తిత్వమూ, నాయకత్వమూ శక్తిమంతమైనవి. కనుకనే కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా సంఖ్యానేక ప్రజలు ఆయనతో మమేకమవుతున్నారు. కొంతమందికి ఆయన విశ్వగురు, ఇతరులకు ఒక హిందూ పూజారి, చేపట్టిన పనులను శీఘ్రగతిన, సమర్థంగా పూర్తి చేయగల పాలనా దక్షుడు. మూర్తీభవించిన జాతీయతావాది. ఈ కారణంగానే 'ఆయేగా తో మోదీ హి' (మోదీ మాత్రమే గెలుస్తారు) అన్న మంత్రం ఎల్లెడలా మారు మోగుతోంది. నిజానికి భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న గొంతులను పూర్తిగా నొక్కివేస్తున్న పాలనా వ్యవస్థకు అదొక సంకేతం. అయితే గెలిచే జట్టు ఏదో నిశ్చితంగా చెప్పగల ఒక క్రీడా పోటీలో సైతం ఎదుటి జట్టుకూ సమాన అవకాశం ఉండి తీరాలి. ఈ సదవకాశానికి అది అన్ని విధాల అర్హమైనది. 2024 సార్వత్రిక ఎన్నికలలోనూ ప్రతిపక్షాలకు అటువంటి ప్రాథమిక సానుకూలతలను నిరాకరించడమంటే ప్రజాస్వామ్యానికి తీవ్ర హాని చేయడమే అవుతుంది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)


> 'స్వేచ్ఛ'గా, 'నిష్పాక్షికంగా' జరగాల్సిన 2024 ప్రజాస్వామ్య పోరులో పాల్గొనే రాజకీయ పక్షాలు అన్నిటికీ సమాన విజయావకాశాలు ఉన్నాయా? గెలిచే జట్టు ఏదో నిశ్చితంగా చెప్పగల ఒక క్రీడా పోటీలో సైతం ఎదుటి జట్టుకూ సమాన అవకాశం ఉండి తీరాలి. ఈ సదవకాశానికి అది అన్ని విధాల అర్హమైనది. 2024 సార్వత్రిక ఎన్నికలలోనూ ప్రతిపక్షాలకు అటువంటి ప్రాథమిక సానుకూలతలను నిరాకరించడమంటే ప్రజాస్వామ్యానికి తీవ్ర హాని చేయడమే అవుతుంది.

శాంతియోధుడు రాందాస్

భారతదేశ రక్షణ శాఖకు మూడు మూలస్తంభాలలో ఒకటైన నౌకాదళానికి అత్యున్నత అధికారిగా (1990–93) పనిచేసిన 90 ఏళ్ళు పైబడిన అడ్మిరల్ రాందాస్ గారికి సైనిక వందనాల లాంఛనంతో మార్చి 16న హైదరాబాద్, తిరుమలగిరి స్వర్గపురిలో అంత్యక్రియలు జరిగాయి. అప్పుడు అక్కడ 'ఇన్‌క్విలాబ్ జిందాబాద్' నినాదం వినిపించడం అక్కడ హాజరైన వారికి కొంత ఆశ్చర్యం కలిగించింది. 'కామ్రేడ్ రాందాస్ అమర్ రహే', 'జోహార్ అడ్మిరల్ రాందాస్' అంటూ ఆయన రెండవ కూతురు సాగరితో సహా పిడికిళ్ళు ఎత్తి నినదించటం ఆయన ప్రత్యేకతను తెలిపింది.

నౌకాదళంలో 1953 నుంచి 1993 వరకు నలభై ఏళ్ళ సేవలో విశిష్ట, పరమ విశిష్ట, వీరచక్ర సేవా పతకాలు సాధించిన లక్ష్మీనారాయణ్ రాందాస్ చివరి మూడేళ్ళల్లో నౌకాదళ విభాగానికి అత్యున్నతాధికారిగా, అనగా అడ్మిరల్‌గా పని చేశారు. సర్వీసు చివరి నెలలో త్రిదళాధిపతిగా నియమితులైనారు. కొచ్చిన్‌లో నావల్ అకాడమీని ఏర్పాటు చేయడం, ప్రతిష్ఠాత్మకమైన బియాస్ (వ్యాస్) నౌకతో భారత నౌకాదళాన్ని పటిష్ఠపరచటం, బంగ్లాదేశ్ ఏర్పడిన సందర్భంగా 1971 ఘటనల్లో, బంగ్లాదేశ్‌లో చిక్కుబడిన 93,000 మంది పాకిస్థాన్ సైనికులను తరలించుకు వెళ్లడానికి పాకిస్థాన్ నౌకాదళం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవడంలో రాందాస్ కీలకంగా వ్యవహరించారు. నౌకాదళంలోని ఒక అధికారిగా ఆనాడు అలాంటి పాత్రను ఆయన పోషించినా, తర్వాత కాలంలో ఉపఖండంలో, ప్రత్యేకించి భారత పాకిస్థాన్‌ల నడుమ యుద్ధాలు వద్దని ఆయన బలంగా విశ్వసించటమే గాక బహిరంగంగా శాంతి సామరస్యాలను ప్రబోధించారు. 1996 నుంచి 2003 దాకా శాంతి ప్రజాస్వామ్యాల కోసం భారత పాకిస్తాన్ ప్రజా వేదిక (PIPFPD) నిర్వాహకులలో ఒకరిగా ఉంటూ దాని భారత విభాగానికి గౌరవాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహించారు. ఆ కాలంలో కలకత్తాలో (1996), బెంగళూరులో (2000), కరాచీలో (2003) జరిగిన ఆ వేదిక ఉమ్మడి సభలలో పాల్గొనే అవకాశం నాకు కూడా దొరికింది. కరాచీలో రాందాస్ గారితో ప్రత్యక్షంగా కొద్దిసేపు మాట్లాడగలిగాను.

నివాళి



అడ్మిరల్ రాందాస్ పదవీ విరమణ అనంతరం వివిధ ప్రజా సేవా కార్యకలాపాలలో పాల్గొన్నారు. అందులో ముఖ్యంగా చెప్పుకోదగినది 'శాంతి ప్రజాస్వామ్యాల కోసం భారత పాకిస్థాన్ ప్రజా వేదిక'లో చురుకైన పాత్రను నిర్వహించడం. సమస్త జీవన రంగాలలో భారత పాకిస్థాన్ ప్రజల నడుమ రాకపోకలకు అవకాశాలు సులువుగా ఉండేట్లు చేసి స్నేహ సుహృద్భావాలు పెరిగేట్లు చేయటం.

1933 సెప్టెంబర్ 5న బొంబాయిలో మాతుంగ ప్రాంతంలో జన్మించిన రాందాస్, ఢిల్లీలో చదువుకుంటూ పదహారేళ్ళ వయసుకే డెహ్రాడూన్‌లో సైనిక శిక్షణశాలలో చేరి, 1953లో భారత నౌకాదళంలో కమిషన్డ్ ఆఫీసర్‌గా పదవిని స్వీకరించారు. 1958–62 సంవత్సరాల నడుమ తొలి భారతీయ అడ్మిరల్ అయిన కటారి రాందాస్ కుమార్తె లలితతో 1961లో లక్ష్మీనారాయణ్ రాందాస్ వివాహం జరిగింది. వారి కుమార్తెలు కవిత, సాగరి, మల్లికలు. అందరూ వివిధ స్థాయిలలో సామాజిక కార్యకలాపాలలో నేటికీ పాల్గొనేవారే కావటం విశేషం. ఆయన అల్లుళ్లు ముగ్గురూ వేరువేరు మతాలకు చెందిన వారు కావటం మరొక విశేషం. అల్లుడు జుల్ఫికర్ అహ్మద్ ప్రకారం అడ్మిరల్ రాందాస్ ఒక ఫెమినిస్టు.

1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం ఢిల్లీ మహానగరంలో సిక్కులపై ఉన్మాద పూరితంగా దమన, దహనకాండ జరిగిన సందర్భంలో రాందాస్ జీవిత సహచరి లలిత, బాధితులను ఆదుకోవడంలో, శాంతి సామరస్యాలు నెలకొల్పే కృషిలో చురుకైన పాత్ర నిర్వహించారు. ఆయన నౌకాదళ అధికారిగా ఉంటున్న ఆ రోజుల్లో భార్య లలితతో పాటు, స్వామి అగ్నివేష్‌తో సహా వచ్చి రక్షణ శాఖ వారు కేటాయించిన ఇంటిలో సమావేశాలు నిర్వహించుకుంటున్న 'నాగరిక్ ఏక్తా మంచ్' వారి శాంతి బృందాలను ఆయన ఏ మాత్రం నిరుత్సాహపరచలేదు. తన ఉద్యోగ భద్రతకు, ప్రమోషన్లకు ఎటువంటి ఆటంకం కలుగుతుందోనని రాందాస్ చూసుకోలేదు. ఆశ్చర్యం గొలిపే విషయం ఏమిటంటే ఆనాటి బాధితుల పక్షాన సహాయకులుగా నిలిచిన వారిని ఖలీస్తానీ ఉగ్రవాదులకు మద్దతు అందిస్తున్న జాతి ద్రోహులు అని కూడా ఎవరూ నిందించలేదు. ఆయన నౌకాదళ ప్రధాన అధికారి కావటానికి కొద్దినెలల ముందు, అమెరికాలో జీవిస్తున్న కూతురు కవిత, జుల్ఫికర్ అహ్మద్ అనే పాకిస్తానీ యువకుడిని పెళ్ళిచేసుకోవటానికి వారి కుటుంబం ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు.

అడ్మిరల్ రాందాస్ పదవీ విరమణ అనంతరం వివిధ ప్రజా సేవా కార్యకలాపాలలో పాల్గొన్నారు. అందులో ముఖ్యంగా చెప్పుకోదగినది 'శాంతి ప్రజాస్వామ్యాల కోసం భారత పాకిస్థాన్ ప్రజా వేదిక'లో చురుకైన పాత్రను నిర్వహించడం. సమస్త జీవన రంగాలలో భారత పాకిస్థాన్ ప్రజల నడుమ రాకపోకలకు అవకాశాలు సులువుగా ఉండేట్లు చేసి స్నేహ సుహృద్భావాలు పెరిగేట్లు చేయటం. ఉభయ దేశాలు రక్షణ రంగ బడ్జెట్లను తగ్గించుకుని, దానిని పేద ప్రజల అభివృద్ధికి వెచ్చించమని కోరటం. కశ్మీరు సమస్యను ఉభయదేశాల సమస్యగా మాత్రమే కాక, కశ్మీరీ ప్రజల జీవన్మరణ సమస్యగా కూడా పరిగణించి ప్రజాస్వామిక పరిష్కారం సాధించాలి అని తీర్మానించటం!

అణ్వాయుధాలు, అణు యుద్ధాలు కూడదని, ప్రత్యేకంగా భారత పాకిస్థాన్‌ల నడుమ అలాంటి ప్రయత్నాలు వద్దని ఆయన వివిధ వేదికల ద్వారా బలంగా వ్యక్తం చేశారు. కూడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు సాగిస్తున్న పోరాటానికి మద్దతుని అందించారు. ఆ సందర్భంగా ఆయనకు రామన్ మెగసెసే పురస్కారం లభించింది.

2017లో వివిధ రంగాల్లో ప్రముఖులైన 200 మంది భారత పాకిస్థాన్ ప్రజల నడుమ సంబంధాలు మెరుగు కావాలని ఢిల్లీలో సమావేశమై చేసిన ప్రకటనలో రాందాస్ కూడా ఉన్నారు. రెండేళ్ళ క్రితం, 90వ ఏట అడుగిడనుండగా 2022 ఆగస్టులో 'ఆజాదీ – అమృత కాల్ – అచ్ఛే దిన్' అంశంపై ఆయన రాసిన వ్యాసంలో... చిన్ననాడు తాము ఆశించిన, ఆనాటి పెద్దలు హామీలు ఇచ్చిన, భారత రాజ్యాంగం నిర్దేశించిన ఆకాంక్షలు, లక్ష్యాలు, ఆదర్శాలు పూర్తిగా వమ్మయిన కాలంలో జీవిస్తున్నందుకు ఆయన ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఆయన ప్రజల మీద, భారత రాజ్యాంగంలోని ప్రజాస్వామిక విలువలకై పౌర సమాజం సాగించే కృషి మీద ఎలాంటి నిరాశను వ్యక్తం చేయకుండా ఊపిరి ఉన్నంతదాకా భవిష్యత్తుపై సానుకూల విశ్వాసంతోనే జీవించారు. ఆయనదొక విశిష్టమైన వ్యక్తిత్వం. ఉన్నతాధికార శ్రేణులలో అత్యంత అరుదైన వ్యక్తి. ప్రజలకు, వారి ఆకాంక్షలకు చేరువగా ఉండాలని కోరుకున్న ధీరోదాత్తుడు.

■ దివికుమార్
జనసాహితి

'శాంతి కోసం నీరు'

ప్రతి ఏటా మార్చి 22న ప్రపంచ జల దినోత్సవం జరుపుకుంటాము. ఇది మంచినీటి వనరుల ప్రాముఖ్యతను, వాటిని సుస్థిరంగా నిర్వహించాల్సిన అవసరాన్ని ప్రపంచానికి గుర్తు చేసే అంతర్జాతీయ దినోత్సవం. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం, ప్రతి సంవత్సరం నీటికి సంబంధించిన విభిన్న అంశాన్ని వెలుగులోకి తెస్తుంది.

నీరు అనేది జీవనానికి అత్యంత కీలకమైన వనరు. భూమిపై జీవకోటి మనుగడకు ఇది ఆధారం. ప్రపంచ జల దినోత్సవం 2024 యొక్క థీమ్ 'శాంతి కోసం నీరు'. ప్రపంచవ్యాప్తంగా శాంతి, స్థిరత్వంలో నీరు పోషించే కీలక పాత్రను ఈ అంశం ప్రముఖంగా చాటి చెబుతుంది. నీటి కొరత, కాలుష్యం తీవ్రమైన సామాజిక ఒత్తిళ్లకు, కొన్నిసార్లు హింసాత్మక ఘర్షణలకు కూడా దారితీస్తాయి. ఈ థీమ్, నీటి సమర్థవంతమైన నిర్వహణ ద్వారా సహకారాన్ని, శాంతి పునాదులను బలోపేతం చేయడం యొక్క అవసరాన్ని నొక్కి చెబుతుంది.

నీటి కొరత, కాలుష్యం వంటి సవాళ్లు సామాజిక ఒత్తిళ్లు పెరగడానికి దారితీసి, కొన్నిసార్లు హింసాత్మక ఘర్షణలకు కూడా కారణమవుతాయి. ప్రత్యేకించి సరిహద్దులను దాటి ప్రవహించే నదీ జలాల విషయంలో తరచుగా వివాదాలు తలెత్తుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 3 బిలియన్లకు పైగా ప్రజలు తమ పొరుగు దేశాలతో పంచుకునే నీటి వనరులపైనే ఆధారపడి ఉన్నారు. అయితే అటువంటి సహజ వనరులను కలిసి వినియోగించుకునే విషయంలో కేవలం 24 దేశాలు మాత్రమే సహకార ఒప్పందాలు కలిగి ఉన్నాయి. ఈ నేపథ్యంలో, నీటి పంపిణీలో న్యాయం, సమానత్వం, అలాగే ట్రాన్స్‌బౌండరీ నీటి సహకార వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా నీటి వల్ల ఘర్షణలు చెలరేగకుండా నివారించవచ్చు.

నీటిని సుస్థిరంగా నిర్వహించడం ద్వారా, సహజ వనరుల పంపిణీలో పారదర్శకత, సహకారం పెంపొందించడం ద్వారా శాంతికి బలమైన పునాదిని సృష్టించవచ్చు. ట్రాన్స్‌బౌండరీ వాటర్ సహకార ఒప్పందాలు, ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, జలాశయాల సమన్వయ నిర్వహణ వంటి వాటి ద్వారా వివిధ దేశాల మధ్య విశ్వాసాన్ని, అవగాహనను పెంపొందించవచ్చు. జల వనరుల పరిరక్షణకు సమష్టి కృషి చేయడం వలన సరిహద్దులకు అతీతంగా సంఘాల మధ్య ఐక్యత, సామరస్యం బలోపేతం చేయబడతాయి.

ప్రపంచ జల దినోత్సవం 2024 మనకు నీటిని సంఘర్షణకు కారణంగా కాకుండా, శాంతి, సహకార చిహ్నంగా మార్చాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, పౌర సమాజం, వ్యక్తులకు నీటి విషయంలో సమష్టి బాధ్యత ఉంది. నీటి సవాళ్లను పరిష్కరించడం కోసం సరికొత్త సాంకేతికతలు, ప్రకృతి ఆధారిత పరిష్కారాలు, సుస్థిర నీటి నిర్వహణా పద్ధతులను ప్రోత్సహించడం ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ నీటి వినియోగంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం, నీటి పరిరక్షణలో తమవంతు పాత్ర పోషించడం ద్వారా శాంతి మరియు సుస్థిర భవిష్యత్తుకు దోహదపడవచ్చు.

శాంతి, సమృద్ధి అనేవి అభివృద్ధికి, సుస్థిర ప్రపంచానికి అవసరమైన కీలక అంశాలు. ఈ లక్ష్యాలను సాధించడంలో నీరు ఒక శక్తివంతమైన సాధనం. ప్రపంచ జల దినోత్సవం 2024 యొక్క 'శాంతి కోసం నీరు' అనే థీమ్ మనకు ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తు చేస్తుంది. సుస్థిర నీటి నిర్వహణ పద్ధతులు, సహకారంతో కూడిన సరిహద్దుల–అతీత నీటి నిర్వహణ, సంఘాల మధ్య విశ్వాసాన్ని పెంపొందించగలవు. తద్వారా శాంతియుత, సమృద్ధితో కూడిన ప్రపంచాన్ని సృష్టించుకోవడానికి వీలుకలుగుతుంది

– శ్రీధర్ ఫిజిక్స్


కమ్యూనిస్ట్ యోధుడు కాగలిగేవాడు భగత్‌సింగ్!

భారతీయ యువతకు చరిత్రలో భగత్‌సింగ్ బలిదానం కంటే స్ఫూర్తిదాయకమైన అంశం మరొకటి లేదు. ఎన్ని సందర్భాల్లో అతని ప్రస్తావనలు వచ్చినా అవి పదే పదే గుర్తు చేసినా పాతబడేవి కావు. నిరసన వ్రతాలు, నిరాహార దీక్షల చరిత్రలో ముఖ్యంగా భారతీయ జైళ్లలో జరిగిన దీక్షల్లో భగత్‌సింగ్‌ది మరొకరు బ్రేకు చేయలేని రికార్డు. ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన వ్రతం 57 రోజులకు ఆయన మరణంతో ముగిసింది. భగత్‌సింగ్ సహచరుడు జతిన్ దాస్ వ్రతం కూడా 63 రోజులకు ఆయన బలిదానంతో ముగిసింది. మరో సహచరుడు సోహన్‌సింగ్ భాక్నా 90 రోజులు నిరాహార దీక్ష చేశాడు. కాని భగత్‌సింగ్ 114 రోజుల నిరాహార దీక్ష అన్ని కోర్కెలు సాధించిన విజయంతో ముగిసింది. లాహోర్ కుట్ర కేసులో ఉరిశిక్ష విధించబడిన సమయంలో ఆయన జైల్లో నిరాహార దీక్షలో వుండటంతో ఆయన పరోక్షంలోనే శిక్ష విధించబడింది. ఇంతటి శారీరక, మానసిక ధృఢత్వం కల్గిన ఈ మహావీరుణ్ణి గూర్చి మరికొంత మననం చేసుకుందాం.

1907 సెప్టెంబర్ 27వ తేదీ పంజాబ్‌లోని లియాల్‌పూర్ జిల్లా బాంగా గ్రామంలో విద్యావతి, కిషన్‌సింగ్ దంపతులకు భగత్‌సింగ్ జన్మించారు. ఆరుగురు పిల్లల్లో పెద్దవాడు మరణించడంతో రెండవ కుమారుడైన భగత్ సింగే పెద్దవాడు. ఆయన పుట్టినరోజే పినతండ్రి స్వరణ్ సింగ్ జైలు నుంచి విడుదల కావటం అదృష్టంగా భావించి భగత్ (అదృష్టం) అని పేరు పెట్టారు. వారి కుటుంబానికి అదృష్టం వచ్చిందో లేదో కాని భగత్‌సింగ్ రూపంలో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి, విప్లవోద్యమానికి కూడా అదృష్టం వరించింది. భవిష్యత్ తరాలకు సైతం స్ఫూర్తిగా నిలిచే ఆ అదృష్టం పేరే భగత్‌సింగ్.

పిన్న వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమం పట్ల ప్రేమ, శ్వేతజాతి పాలన పట్ల విముఖత పెంచుకున్న భగత్‌సింగ్ 1919 ఏప్రిల్ 13న జలియన్‌వాలాబాగ్ మారణహోమం గూర్చి విని చలించిపోయి అక్కడకు వెళ్లి రక్తసిక్తమైన మట్టిని ఒక సీసాలో నింపుకొని వచ్చాడు. 19 ఏళ్ళ వయస్సులో పెళ్లి ప్రస్తావన తెచ్చినప్పుడు 'నా జీవిత లక్ష్యం భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయటం. చిన్నతనంలోనే చిన్నాన్నకు వాగ్దానం చేసిన ప్రకారం వ్యక్తిగత సంతోషాల్ని వదులుకొని దేశసేవకు అంకితమవుతా'నని ఉత్తరం రాసి వెళ్లిపోయాడు. కొన్ని రోజులు రోడ్లపై పత్రికలు అమ్మి ఆ తర్వాత 'ప్రతాప్' పత్రిక సహాయ సంపాదకునిగా చేరి 'బల్వంత్‌సింగ్' పేరుతో ఆ పత్రికకే కాక ప్రభ (కాన్పూర్), మహారథి (ఢిల్లీ), చాంద్ (అలహాబాద్) పత్రికల్లో అనేక వ్యాసాలు రాశాడు. 1926లో సుఖదేవ్, భగవతీచరణ్, యశ్‌పాల్ తదితరులతో కల్సి 'నవజవాన్ భారత్' అనే సంస్థని స్థాపించారు.

> ఉరిశిక్షకు, యావజ్జీవ కారాగార శిక్షకు గురైన సంఘటనలు జరిగే నాటికి ఈ వీరులు– ముఖ్యంగా భగత్‌సింగ్– కమ్యూనిస్టు కాదు. కాని శిక్ష అనంతరం జైల్లో ఉన్న రెండేళ్ళలో మిత్రుడూ, తనకి న్యాయవాది అయిన ప్రాణనాథ్ సహకారంతో మార్క్సిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు. మరికొంతసేపట్లో ఉరి తీస్తారనగా కూడా లెనిన్ గ్రంథం ఒకటి చదువుతూ ఉన్నాడు.



1928 అక్టోబర్ 30న సైమన్ కమీషన్‌కు నిరసనగా లాహోర్‌లో జరిగిన నిరసన ఊరేగింపుపై లాఠీఛార్జి జరగటంతో గాయపడిన లాలాలజపతిరాయ్ నవంబర్ 17న చనిపోవటంతో భగత్‌సింగ్‌తో సహా యువకులంతా రగిలిపోయారు. లాఠీచార్జికి కారకులైన స్కాట్‌ని చంపాలని నిర్ణయించుకొని కాపుకాయగా స్కాట్ బదులు సాండర్స్ అనే మరో ఇన్‌స్పెక్టర్ దొరకటంతో డిసెంబర్ 17న అతణ్ణి కాల్చి చంపి అందరూ క్షేమంగా తప్పించుకున్నారు. ఆ తర్వాత పారిశ్రామిక వివాదాల చట్టంపై చర్చ జరుగుతుండగా 1929 ఏప్రిల్ 8న కేంద్ర శాసనసభలో (ఆనాటి పార్లమెంటు) బాంబులు విసిరి కరపత్రాల్ని విరజిమ్మారు. భగత్‌సింగ్, భటుకేశ్వర్ దత్, జయదేవ్ కపూర్‌లు ఈ ఘటనలో పాల్గొన్నారు. జాతీయ నాయకులు మాలవ్యా, జిన్నా, మోతీలాల్ నెహ్రూ, విఠల్‌భాయి పటేల్ తదితరులు సభలో ఉన్నందున ఎవరికీ గాయాలు కలగకుండా, ధ్వని, పొగ మాత్రమే కల్గించటం ఈ బాంబు దాడి ఉద్దేశం. విసిరిన బాంబు స్పీకర్‌గా ఉన్న జార్జిషూటర్ కుర్చీ వెనుక పడింది. సురక్షితంగా తప్పించుకునే అవకాశం ఉన్నా, పట్టుబడితే ఉరిశిక్ష పడుతుందని తెల్సినా న్యాయస్థానంలో జరిగే విచారణ విప్లవోద్యమ ప్రచారం కోసం ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో కావాలనే పట్టుబడ్డారు. 'చెవిటి వారికి వినపడాలంటే పెద్దగొంతు కావాలి' అనే సూక్తితో ప్రారంభమయ్యే కరపత్రాల్ని సభలో విరజిమ్మారు. ఉరిశిక్ష పడుతుందని భావించినా ఈ కేసులో భగత్‌సింగ్, భటుకేశ్వర్ దత్‌లకు యావజ్జీవ కారాగార శిక్ష మాత్రమే పడింది.

అయితే సాండర్స్ హత్యతో కలిపి లాహోర్ కుట్రకేసు కూడా భగత్‌సింగ్ మరో 27 మంది విప్లవకారులపై బనాయించగా ఆ కేసులో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లకు ఉరిశిక్ష, విజయకుమార్ సిన్హా, కిషోరిలాల్, జయదేవ్ కపూర్, శివవర్మ, కమలనాథ్ తివారి, గయాప్రసాద్, మహవీర్‌సింగ్‌లకు యావజ్జీవ శిక్ష, కుందన్ లాల్‌కు 7 సంవత్సరాలు, ప్రేమదత్తుకి 5 సంవత్సరాలు శిక్షలు పడ్డాయి. అజయ్ ఘోష్ తదితరులు నిర్దోషులుగా బయటపడ్డారు. దేశభక్తులుగా ఈనాడు గుర్తింపు పొందిన కొందరు బ్రిటీష్ వారిని శరణు కోరినా, భగత్ సింగ్ క్షమాభిక్ష కోరటానికి నిరాకరించి, తనకి తెలియకుండా ప్రభుత్వాన్ని కోరిన తండ్రిని కూడా నిందించాడు. పైగా పంజాబ్ గవర్నర్‌కి రాసిన లేఖ 'మీకోర్టు తీర్పు ప్రకారం మేం మీ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించాం కాబట్టి మేం యుద్ధ ఖైదీలం. ఆ విధంగానే మమ్మల్ని గుర్తించాలి. మీ సైనిక బృందంతో మమ్మల్ని కాల్చించాలి. మీ స్వంత కోర్టు తీర్పును గౌరవిస్తారో లేదో నిర్ణయించుకోవాల్సింది, ప్రపంచానికి చాటుకోవాల్సింది మీరే' అని పేర్కొన్నాడు.


1931 మార్చి 5న జరిగిన గాంధీ ఇర్విన్ ఒడంబడికలో ప్రజలంతా కోరుకున్నట్లు ఈ ఉరిశిక్ష మార్పు లేదా రద్దు ప్రస్తావన లేదు. నేను ప్రయత్నించానని చెప్పిన గాంధీ మాటను దేశ ప్రజలు విశ్వసించలేదు. చివరకు మార్చి 24న ఉరిశిక్ష అమలు చేస్తామని చెప్పి భారతదేశ నేర విచారణ, శిక్షల అమలు చరిత్రలో ఏనాడూ జరగని విధంగా రాత్రిపూట ఉరిశిక్షలు అమలుపరచి, శవాలను రహస్యంగా జైలు వెనుక నుంచి 60 కి.మీ దూరంలోని హుస్సేని వాలాకు తీసుకెళ్లి సట్లెజ్ నది ఒడ్డున దహనం చేశారు. ఈ వార్త నగరమంతా వ్యాపించటంతో వందలాది ప్రజలు ఆ ప్రాంతానికి చేరుకోగా ప్రజలను చూసి పోలీసులు సగం కాలిన శవాలను సట్లెజ్ నదిలోకి తోసి పారిపోయారు. అలా పోగయిన ప్రజలు నది నుండి శవాలను వెలికితీసి సగౌరవంగా అంత్యక్రియలు పూర్తిచేశారు.

ఉరిశిక్షకు, యావజ్జీవ కారాగార శిక్షకు గురైన సంఘటనలు జరిగే నాటికి ఈ వీరులు ముఖ్యంగా భగత్ సింగ్ కమ్యూనిస్టు కాదు. కాని శిక్ష అనంతరం జైల్లో ఉన్న రెండేళ్ళలో మిత్రుడూ, తనకి న్యాయవాది అయిన ప్రాణనాథ్ సహకారంతో మార్క్సిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు. మరికొంతసేపట్లో ఉరి తీస్తారనగా కూడా లెనిన్ గ్రంథం ఒకటి చదువుతూ ఉన్నాడు. ఈ నిరంతర అధ్యయనంలో గత టెర్రరిస్టు కార్యక్రమాల్లో తప్పులను, గాంధీ సంస్కరణ వాదన్ని గుర్తించి వాటిని తిరస్కరించాడు. ఒకవేళ భగత్‌సింగ్ ఉరిశిక్ష రద్దయి ఆయన సజీవంగా ఉంటే దేశానికేమోగాని భారత కమ్యూనిస్టు ఉద్యమానికి దశా దిశా నిర్దేశించగల ఒక మహానాయకుడు మిగిలేవాడు.

• చెరుకూరి సత్యనారాయణ

(మార్చి 23: భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతి)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
శుక్రవారం 22 మార్చి 2024





భక్తులకు కాళ్లు కాలకుండా హీట్ ప్రూఫ్ పెయింటింగ్స్ (ఇన్‌సెట్‌లో) పల్లకీలో ఆదిదంపతుల ఊరేగింపు



కొండెక్కిన కోడ్

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టేసుకుంటున్నారు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు. కొద్దిరోజుల్లో ఎన్నికలు జరుగుతాయి.. అధికారం చేతికొస్తుందా, రాదా.. అనే మీమాంసలో మరిన్ని అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. రెండు జిల్లాల్లో భారీగా అక్రమ క్వారీయింగ్‌కు తెరతీశారు. ఈ అక్రమ వ్యవహారాల్లో స్థానిక అధికార యంత్రాంగాలు కూడా వైసీపీ నేతలకు సహకరిస్తుండటంతో స్థానికులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేని పరిస్థితి ఏర్పడింది.

కొండపావులూరులో రాత్రింబవళ్లు మట్టి, గ్రావెల్ తవ్వకాలు

ఎన్నికల కోడ్ వచ్చాక మరింత బరితెగించి..



కొండపావులూరు సర్వే నెంబర్ 34లో తాటిచెట్టంత లోతున అక్రమ తవ్వకాలు

- రెచ్చిపోతున్న అధికార పార్టీ మైనింగ్ మాఫియా
- మంగలమ్మ చెరువులోనూ అదే పరిస్థితి
- వందలాది ట్రాక్టర్లలో మట్టి ఇటుక బట్టీలకు తరలింపు
- కట్టలేరులో భారీగా ఇసుక తవ్వకాలు.. పట్టని అధికారులు
- నున్నలో కాల్వపై కట్టడం.. బస్టాప్ అంటూ కలరింగ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరం మండలం కొండపావులూరు సర్వే నెంబర్ 6 సమీపంలోని సర్వే నెంబర్ 34లో ఎర్రమట్టి, గ్రావెల్‌పై అధికార పార్టీ ప్రజాప్రతినిధి అనుచరులు తెగబడ్డారు. అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. 'మళ్లీ మాదే అధికారం..' అంటూ రెవెన్యూ అధికారులపై కత్తిపెట్టి మరీ అనధికారికంగా క్వారీయింగ్‌కు శ్రీకారం చుట్టారు. ఇక.. ఎన్నికల కోడ్ వచ్చాక ఈ తవ్వకాలను మరింత ముమ్మరం చేశారు. అతి తక్కువ కాలంలోనే ఎకరాల కొద్దీ తవ్వేశారు. ఇందుకోసం భారీగా ఎక్స్‌కవేటర్లను ఉపయోగిస్తున్నారు. గతంలో రాత్రిపూట తవ్వకాలు జరిపేవారు. పగటిపూట ఎక్స్‌కవేటర్లను పొలాల్లో దాచేవారు. ఎన్నికల కోడ్ వచ్చాక బరితెగించి రాత్రీ పగలు తేడా లేకుండా తవ్వేస్తున్నారు. నిర్దేశిత ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా 50 అడుగులకు పైగా మట్టిని, గ్రావెల్‌ను తవ్వేశారు. వందల సంఖ్యలో టిప్పర్లు ఈ మట్టిని తీసుకెళ్తున్నాయి. ఈ మట్టిని ఇటుక బట్టీలు, రియల్ వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.



కట్టలేరు ఇసుక మార్కెట్‌లో అమ్మకాలు

'రెవెన్యూ' సహకారం

అధికార పార్టీ మాఫియా చేపడుతున్న ఈ దురాగతాలకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారు. వారి దృష్టికి వచ్చినా పట్టించుకోవటం లేదు. ఈ భూమిలో విద్యుత్ శాఖకు సంబంధించిన విద్యుత్ పోల్స్ ఉన్నాయి. ఈ పోల్స్ చుట్టూ కొద్దిమొత్తంలో వదిలేసి 50 అడుగుల లోతున తవ్వేశారు. ఇది ప్రమాదకరమంటున్నారు స్థానికులు. వర్షాలు కురిస్తే విద్యుత్ స్తంభాల కింద ఉన్న మట్టి కుంగి, కొట్టుకుపోతే ప్రమాదం ఏర్పడుతుందంటున్నారు. ఈ విద్యుత్ స్తంభాల నుంచి స్థానికంగా ఉంటున్న రైతుల పొలాల్లోకి, కొండపావులూరులోని ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌ఐడీఎంకు కూడా విద్యుత్ లైన్లు వెళ్తాయి. ఈ విషయాన్ని విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదు.

ఎక్కడపడితే అక్కడ..

● గన్నవరం మండలం వీరపనేనిగూడెం మంగలమ్మ చెరువులో కూడా భారీగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇటుక బట్టీల కోసం ఈ మట్టిని తరలిస్తున్నారు. బట్టీల దగ్గర మట్టి గుట్టలు కొండలను తలపిస్తున్నాయి. మంగలమ్మ చెరువు తవ్వకాలకు స్థానిక రెవెన్యూ అధికారులే అనధికారికంగా అనుమతులు ఇచ్చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. వారం రోజులుగా భారీ ఎత్తున చెరువులో మట్టి తోడేస్తున్నారు.

● నున్న గ్రామంలోని సాయిబాబా గుడి వెంబడి మెయిన్ రోడ్డు వద్ద మురుగు కాల్వ ఉంది. బస్టాప్ నిర్మిస్తున్నామన్న పేరుతో కాల్వపై కట్టడాలు చేపడుతున్నారు.

● గంపలగూడెం మండల పరిధిలోని కట్టలేరులో ఇసుక అక్రమ తవ్వకాలు భారీగా జరుగుతున్నాయి. స్థానిక రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆశీస్సులతోనే ఈ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై తరచూ స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవటం లేదు.

పల్లకీలో.. ఆదిదంపతులు

గంగా సమేత దుర్గామల్లేశ్వరుల పల్లకీ ఉత్సవం గురువారం కనులపండువగా జరిగింది. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈవో రామారావు పాల్గొన్నారు. గంగా సమేత దుర్గామల్లేశ్వరుల ఉత్సవమూర్తులను ఉంచిన పల్లకీని ఈవో మోశారు. అనంతరం విశేషార్చనలు జరిగాయి. హారతులు సమర్పించారు. కాగా, దుర్గగుడి ప్రాంగణంలో ఎండ వేడిమికి భక్తుల కాళ్లు కాలకుండా హీట్ ప్రూఫ్ పెయింటింగ్‌లు వేశారు. భక్తులు నడయాడే అన్ని ప్రదేశాల్లోనూ ఈ పెయింట్లు వేశారు. - వన్‌టౌన్

జడ్పీ సీఈవోపై వేటు



- స్థానిక జిల్లాలో ఉండకూడదన్న ఎన్నికల సంఘం
- కలెక్టర్‌ను ప్రశ్నించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్
- చార్జి అప్పగించి జీఏడీకి సరెండ్ కావాలని కలెక్టర్ ఆదేశం
- బాధ్యతల నుంచి రిలీవైన సీఈవో జ్యోతిబసు
- అధికార పార్టీ పెద్దలతో సత్సంబంధాలు.. సహకారాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సొంత జిల్లాలో ఉంటూ ఎన్నికల బాధ్యతలు నిర్వహిస్తున్న ఉమ్మడి కృష్ణాజిల్లా జడ్పీ సీఈవో జ్యోతిబసుపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. స్పందించిన కృష్ణా కలెక్టర్ రాజాబాబు.. చార్జి అప్పగించి సరెండ్ కావాలని ఆదేశించారు. దీంతో జ్యోతిబసు తన బాధ్యతల నుంచి రిలీవై జీఏడీకి సరెండ్ అయ్యారు. జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందరావుకు ఆయన బాధ్యతలను అదనంగా అప్పగించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆది నుంచీ వివాదాస్పదుడే..

ఎన్నికల నేపథ్యంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు ఇక్కడే ఉండటానికి వీలుగా పావులు కదిపారు. ఇందుకోసం అధికార పార్టీ పెద్దలను ఆశ్రయించి కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చారు. ఎన్నికల విధులు లేకుండా జాగ్రత్త పడ్డారు. ఒకసారి ఎన్నికల డ్యూటీ వేసినప్పటికీ తప్పించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఎన్నికల డ్యూటీ వేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం స్థానికంగా ఉంటూ కదలకపోవటంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలో తన విషయంలో స్థానికత వర్తించదని జడ్పీ సీఈవో చెప్పుకొచ్చారు. సన్నిహితుల దగ్గర మాత్రం తాను ఇక్కడి నుంచి కదిలేది లేదని, తననెవరూ కదల్చలేరన్నారు. ఈ క్రమంలో అసలు వాస్తవాలు ఏమిటన్న దానిపై ఈసీకి ఫిర్యాదులు అందాయి. రెండు రోజుల కిందట రాష్ట్ర ఎన్నికల అధికారి నిర్వహించిన వీసీలో జడ్పీ సీఈవోలు సొంత జిల్లాలోనే కొనసాగటంపై చర్చ జరిగింది. ఆయా జిల్లాల కలెక్టర్లను ప్రశ్నించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని చెప్పటంతో కృష్ణా కలెక్టర్ రాజాబాబు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. అధికార పార్టీకి వీర విధేయుడిగా ముద్రపడిన ఈ జడ్పీ సీఈవో తీరుపై విపక్షాలు మొదటి నుంచీ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

అధికార పార్టీ తరఫున పెడన నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ భర్త అడుగులకు మడుగులొత్తారు. జడ్పీ ఉద్యోగులను ఆయన పార్టీ కార్యాలయంలో పనుల కోసం నియమించటం కూడా తీవ్ర వివాదాన్ని సృష్టించింది. ఒక్క పెడన నియోజకవర్గమే కాకుండా ఉమ్మడి జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల్లో కూడా అధికార పార్టీ అభ్యర్థులకు సహకరించేలా జడ్పీ సీఈవో జ్యోతిబసుకు అధికార పార్టీ పెద్దలు బాధ్యతలు అప్పగించారని విపక్షాలు ఆరోపించాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘానికి వరుసగా ఫిర్యాదులు వెళ్లాయి.

ఎనిమిది మంది వలంటీర్లపై చర్యలు

మచిలీపట్నం/మోపిదేవి/కోడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వలంటీర్లపై అధికారులు చర్యలు ప్రారంభించారు. కృష్ణాజిల్లాలో గురువారం ఎనిమిది మంది వలంటీర్లపై వేటు వేశారు. బందరు మండలం చిన్నాపురం పంచాయతీలో బందరు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి ఈనెల 19వ తేదీన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో వలంటీర్లు తిరువీధుల నందిని, నాగిడి ఊర్వశి, దాసరి రత్నకుమారి, గుమ్మడి భవానీ, జన్ను శ్రీలక్ష్మి, జి.సురేష్ పాల్గొన్నారు. దీనిపై విచారణ చేసిన ఎంపీడీవో ఎ.బాలకృష్ణారావు ఆరుగురు వలంటీర్లను విధుల నుంచి తొలగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వలంటీర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు, క్లస్టర్ రికార్డులను స్వాధీనం చేసుకోవాలని చిన్నాపురం పంచాయతీ కార్యదర్శికి ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు. గిలకలదిండిలో ఎమ్మెల్యే పేర్ని నాని బుధవారం వైసీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వలంటీర్ లంకె ఏడుకొండలు పాల్గొన్నారు. ఈ వీడియో బయటకు రావడంతో చర్చనీయాంశమైంది.

● మోపిదేవిలో ఒకరిపై..

మోపిదేవి మండలంలోని పెదప్రోలు పంచాయతీ శివారు కప్తానుపాలెంలో అక్రమంగా 66 మద్యం సీసాలు నిల్వ ఉంచి పోలీసు దాడిలో పట్టుబడిన డి.వేణును విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో కె.శ్రీనివాసరావు తెలిపారు.

● కోడూరులో మరొకరిపై..

కోడూరు సచివాలయం-2 పరిధిలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న చిట్టిప్రోలు నాగేంద్రబాబును విధుల నుంచి తొలగించినట్టు కోడూరు మండల ఎంపీడీవో ఆర్.శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ ప్రసంగాల్లో పాల్గొన్నారని సోషల్ మీడియాలో వచ్చిన కథనంపై విచారణ అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు వలంటీర్‌ను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో తెలిపారు.

హౌస్‌హోల్డ్ రిజిస్టర్లు ఏవి?

- ఎన్నికల కోడ్ వచ్చాక వెనక్కి ఇవ్వని వలంటీర్లు
- అధికార పార్టీ నాయకుల ఇళ్లలో ఉన్నట్టు అనుమానాలు
- ప్రతి కుటుంబం పూర్తి సమాచారం వారి చేతుల్లోనే..
- సచివాలయాల అడ్మిన్ల ఉదాసీన వైఖరి

ఎన్నికల కోడ్ వచ్చి 96 గంటలవుతున్నా కోడ్ అమల్లో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. గ్రామ/వార్డుల్లో వలంటీర్ల వద్ద ఉన్న హౌస్ హోల్డ్ రిజిస్టర్లను తిరిగి తీసుకోవడంలో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో... వారి వెనుక ఉండి నడిపిస్తున్నది ఎవరో.. అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వైసీపీ నాయకుల ఇళ్లలో సదరు రిజిస్టర్లను పెట్టుకుని ఆయా కుటుంబాల వివరాలను తస్కరిస్తున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి.

- 6లో..

ఓటరూ.. మేలుకో

- కర్తవ్య నిర్వహణలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోండి
- సీ విజిల్, ఓటర్ హెల్ప్‌లైన్, కేవైసీ, సాక్ష్యం యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోండి

- 6లో..

అడహాక్ షాక్..!



ఈవో పదోన్నతులపై డైరెక్ట్ రిక్రూటీల న్యాయపోరాటం

దేవదాయ శాఖలో పదోన్నతుల చిచ్చు

ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే దేవదాయ శాఖలో అడ్డగోలుగా జరిపిన అడహాక్ పదోన్నతులు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. నిబంధనల ప్రకారం సీనియారిటీ జాబితా ఖరారు చేసి పదోన్నతులు ఇవ్వాలని ఇటీవలే హైకోర్టు స్పష్టంగా చెప్పినా, ఖాతరు చేయకుండా అడహాక్ పేరిట తాత్కాలిక పదోన్నతులు ఇచ్చేయడంపై పలువురు న్యాయపోరాటాలకు సిద్ధమవుతున్నారు.

- నిబంధనలు పాటించలేదంటూ కమిషనర్‌కు లేఖ
- స్పందన లేకపోవడంతో న్యాయ పోరాటానికి సన్నాహాలు
- ఏసీబీ కేసులున్న వారికీ పదోన్నతులపై ఆగ్రహం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గతనెలలో దేవదాయ శాఖలో గ్రేడ్-1 ఈవోలకు ఏసీలుగా, ఏసీలకు డీసీలుగా పదోన్నతులిచ్చారు. ఈ సందర్భంగా కోట్లాది రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా మల్టీ జోన్లపరంగా చూస్తే మల్టీజోన్-1, జోన్లవారీగా చూస్తే జోన్-2 పరిధిలో ఉంటుంది. ఇటీవల జోన్-2లో సుమారు 10 మంది గ్రేడ్-1 ఈవోలకు అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)లుగా పదోన్నతులు కల్పించారు. వీరిలో నలుగురు ఈవోలపై దేవదాయ శాఖలోనే డైరెక్ట్ రిక్రూటీలుగా పనిచేస్తున్నవారు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

ఆ నలుగురి పదోన్నతి అక్రమం

గ్రేడ్-1 ఈవోలైన బీఎల్ నగేశ్, పి.నారాయణమూర్తి, డి.నాగమల్లేశ్వరరావు, ఎన్వీ సాంబశివరావుకు ఏసీలుగా పదోన్నతులు కల్పించడం అక్రమమని గ్రేడ్-1 డైరెక్ట్ రిక్రూటీలైన ఎస్.హేమలత, కె.సుపద్మదేవి తదితరులు కమిషనర్‌కు ఫిబ్రవరి 4న లేఖ రాశారు. సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా వీరికి పదోన్నతులు ఇచ్చారని ఆరోపించారు. ఆలయ ఉద్యోగుల సర్వీసు నిబంధనలను తెలిపే జీవో నెంబరు 1478తో పాటు 888 ప్రకారం ఉద్యోగం వచ్చిన ఆలయంలోనే వారు పదోన్నతులు పొందాలని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. ఒక ఆలయంలో నియామకమై, మరో ఆలయంలో పదోన్నతి పొందడం సర్వీసు రూల్స్‌కు విరుద్ధమని, పైన పదోన్నతులు పొందినవారిలో అలాంటి వారు ఉన్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. దేవదాయ శాఖలో క్లర్కుగా నియామకం కావాలంటే కనీస విద్యార్హత పదో తరగతి. హయ్యర్ కేడర్‌కు పదోన్నతి పొందాలంటే దాని దిగువ కేడర్‌లో కనీసం ఐదేళ్లు పనిచేసి ఉండాలి. కానీ, పైన పదోన్నతి పొందిన వారిలో చాలామంది పదో తరగతి విద్యార్హత కూడా లేకుండా విధుల్లో చేరి ఆ తర్వాత డిగ్రీలు పొందారని, కొందరు దిగువ కేడర్‌లో కనీసం ఐదేళ్లు పనిచేయకపోయినా పదోన్నతి కల్పించారని లేఖలో వివరించారు. కేడర్ స్ట్రెంత్‌లో క్లియర్ వేకెన్సీ ఉంటేనే అందులో పదోన్నతి ద్వారా నియామకాలు జరపాల్సి ఉంది. కానీ, క్లియర్ వేకెన్సీ లేకుండానే పైవారి నియామకాలు జరిగిపోయాయని లేఖలో తెలిపారు. అలాగే దేవదాయ శాఖలో చేరే సమయంలో కనీసం 18 ఏళ్లు నిండి 30 ఏళ్లకు మించకుండా వయసు ఉండాలి. అలాంటి వారికే పదోన్నతుల్లో అవకాశం కల్పించాలి. కానీ, పైవారిలో చాలామంది 30 ఏళ్ల తర్వాత విధుల్లో చేరారని, అలాంటి వారికి పదోన్నతులు కల్పించడం నిబంధనలకు విరుద్ధమని లేఖలో పేర్కొన్నారు. డైరెక్ట్ రిక్రూటీల లేఖపై ఎలాంటి స్పందన లేకపోవడంతో వారు న్యాయపోరాటాలకు సిద్ధమవుతున్నారు. తమకు రావాల్సిన పదోన్నతులను కాసులకు కక్కుర్తిపడి ఉన్నతాధికారులు వేరే వారికి ఎలా కట్టబెడతారని వారు ప్రశ్నిస్తున్నారు.


ఏసీ పదోన్నతుల్లోనూ అదే దారి

అసిస్టెంట్ కమిషనర్లకు పదోన్నతులు కల్పించడంలోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు 20 మంది ఏసీలకు డీసీలుగా పదోన్నతి కల్పించారు. వీరిలో ఎం.విజయరాజు, పి.శ్రీనివాసరెడ్డి వంటి వారిపై ఏసీబీ కేసులున్నా డీసీలుగా పదోన్నతి కల్పించడం వెనుక పెద్ద ఎత్తున కాసులు చేతులు మారాయంటున్నారు. డీసీలుగా పదోన్నతి పొందిన వారిలో సగం మందిపై ఆర్థికపరమైన ఆరోపణలు, శాఖాపరమైన శిక్షలు ఉన్నా అడ్డగోలుగా పదోన్నతులు కల్పించారు. 2019లో ఏసీలుగా పదోన్నతులు పొందిన కేఎన్‌బీ ప్రసాద్, రాధ, రామాంజనేయులు, లీలా కుమార్, శ్రీరామవరప్రసాద్, కిషోర్ తదితరులకు కనీసం ఐదేళ్లపాటు ఆ కేడర్‌లో పనిచేయకున్నా డీసీలుగా పదోన్నతులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి.

బడ్జెట్ అధికారాలు కట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలు, సత్రాలు బడ్జెట్ కేటాయింపులు చేయించుకోవడం ఆనవాయితీ. ఈ బడ్జెట్ కేటాయింపుల తంతును కొందరు ఉన్నతాధి కారులు కాసుల పంటగా మార్చుకున్నారు. ఈ అంశంపై ఆంధ్రజ్యోతి మార్చి 9న 'బడ్జెట్ దందా' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ.. రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ)కు ఉన్న బడ్జెట్ అధికారాలపై కోత పెట్టారు. ఇప్పటి వరకు శ్రీకాకుళం నుంచి కృష్ణాజిల్లా వరకు రూ.కోటిపైన ఆదాయం ఉన్న ఆలయాలు, సత్రాల బడ్జెట్‌లను ఆర్‌జేసీ చూసేవారు. దానికి చెక్ పెడుతూ అడిషనల్ కమిషనర్-2కు బడ్జెట్ కేటాయింపు అధికారాలను ఇస్తూ ఆదేశాలిచ్చారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-18 (శుక్ర)

సహర్ (ఉదయం) : 4-57 (శని)

రసరమ్యం కూచిపూడి అభినయం



- 6లో..

విస్తృత తనిఖీలు

ఎంసీసీ, ఎన్నికల ఫిర్యాదులకు కంట్రోల్ రూం ఏర్పాటు



పూర్ణ చంద్రరావు శిష్య బృందం నృత్య అభినయం

రసరమ్యం కూచిపూడి అభినయం



మంజూష నాట్య భంగిమ

కూచిపూడి, మార్చి 21 : బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా రెండవ రోజైన గురువారం కూచిపూడి శ్రీ సిద్దేంద్ర కళావేదికపై నిర్వహించిన నాట్యాంశాలు రసరమ్యంగా సాగాయి. తొలుత చింతా రవిబాలకృష్ణ శిష్యబృందం వర్షిత వర్మ, సాయి భవ్య, రిశాలి, సుష్మిత, ఈశ్వరిలు ప్రదర్శించిన అంశాలు ఆద్యంతం భక్తిభావంతో ముంచెత్తాయి. గోవర్ధనగిరి ధారా, దశావతార శబ్దం, జణుత శబ్దం, నమో నమో రఘుకుల నాయక, శివుడు తాండవమాడెను అంశాలు ప్రదర్శించి భక్తిభావంలో ముంచెత్తారు. అనంతరం కూచిపూడి కళాక్షేత్రం (విశాఖ), హరిరామమూర్తి శిష్యురాలు మంజూష వినాయక కీర్తన, అన్నమాచర్య కీర్తనలోని అంశాలు ఆకట్టుకున్నాయి. బాలాత్రిపుర సుందరి నృత్య నికేతన్ (మచిలీపట్నం), యేలేశ్వరపు పూర్ణ చంద్రరావు శిష్యులు జాహ్నవి, రాఘవ, నంద సాకేత, సాయి పూర్ణ, కౌస్తుబ మణి, దేవి ప్రియ, జశ్మితలు శృంగార లహరి, జతి స్వరం హావభావాలు మెప్పించాయి. అనంతరం కళాకారులను వేదాంతం రాధే శ్యామ్, చింతా రవిబాలకృష్ణ, కాపూరి భానుమూర్తి, వై.ఫణికుమార్, రామలింగేశ్వరస్వామివారి దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు మెమోంటోలు అందించి ఘనంగా సత్కరించారు.



ఒలింపియాడ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో డాక్టర్ కేకేఆర్స్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, మార్చి 21 : అత్యంత ప్రతిష్టాత్మక సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11వ తేదీన అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో స్థానిక డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి ర్యాంకులను సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారామ్ తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వి.హేమ సాయిసిద్ధార్థ(8వ తరగతి) రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు, వి.యోజిత్‌రెడ్డి (6వ తరగతి) 3వ ర్యాంకు, డి.తేజత్‌నాయుడు (7వ తరగతి) 4వ ర్యాంకు, బి.కీర్తన్‌రెడ్డి (8వ తరగతి) 9వ ర్యాంకు, వైవీ కార్తీక్ (6వ తరగతి) 10వ ర్యాంకు, ఎస్.కె సాజిత్‌రెహాన్ (8వ తరగతి) 11వ ర్యాంకు, ఇ.వైష్ణవ్‌రెడ్డి (7వ తరగతి) 12వ ర్యాంకులు సాధించారని తెలిపారు. మొదటి 100ర్యాంకుల్లో 48మంది తమ విద్యార్థులు ఉండటం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, జ్యోతి, జబ్రీనాలు అభినందించారు.



డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లలు, తల్లిదండులతో ఆసుపత్రి వైద్య బృందం

ఆంధ్రా ఆసుపత్రిలో వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే


భవానీపురం, మార్చి 21 : వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా ఆంధ్రా ఆసుపత్రిలో డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లల సంరక్షణపై తల్లిదండ్రులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రా హాస్పిటల్స్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్(కృష్ణా జిల్లా శాఖ) ఏపీ స్టేట్, న్యూరో డెవలప్‌మెంట్ పీడియాట్రిక్స్ ఐఏపీ చాప్టర్తో కలిసి పిల్లల సంరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల సంరక్షణ ప్రాముఖ్యతపై పీడియాట్రిక్స్ డాక్టర్ పీవీ రామారావు, డాక్టర్ ఆశ్రితలు మాట్లాడుతూ, డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లలు సమాజంలో కలిసి జీవించడానికి తగిన చర్యలపై వివరించారు. ఇంటి వద్ద చేయదగ్గ వ్యాయామాలు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, పిల్లల మానసిక ప్రవర్తన ఎలా గమనించాలి అనే అంశాలను విశదీకరించారు. మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ మీనా, పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ సాయిదీపక్, సైకాలజిస్ట్ గాయత్రి, స్పీచ్ థెరపిస్ట్ ప్రమోద, లక్ష్మి, డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేరుకే పేదవానికి సీటు!

- మైలవరంలో పెత్తనం అంతా సొంత సామాజిక వర్గానిదే
- నెల తిరగక ముందే పరిశీలకుని మార్పు.. స్థానికుల విమర్శ

మైలవరం, మార్చి 21 : ఈసారి ఎన్నికలు పేదవానికి పెత్తందారులకు అని ప్రగల్భాలు పలికే సీఎం జగన్మోహన్ రెడ్డి.. పేరుకే పేదవారికి సీటు ఇచ్చి వారిపై పెత్తనానికి తన సామాజిక వర్గానికి చెందిన వారిని పెట్టడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం సీటును సాధారణ వ్యక్తి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సర్నాల తిరుపతిరావుకు కేటాయించినా.. ఆయనపై పెత్తనానికి అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డిని పరిశీలకునిగా పెట్టారు.. అయితే ఇటీవల మైలవరంలో పార్టీ కార్యాలయ ప్రారంభం సందర్భంగా వైసీపీ శ్రేణుల భారీ ర్యాలీ, భోజనాల ఖర్చు, వలంటీర్లకు తాయిలాల ఖర్చు లెక్కల్లో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఫిర్యాదుతో అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డిని తప్పించి నెల్లూరు జిల్లాకు చెందిన కర్రా హర్షా రెడ్డిని పరిశీలకునిగా పెట్టారు. పరిశీలకుడి మార్పు ఇపుడు మైలవరంలో హాట్ టాపిక్ అయ్యింది. పేరుకే పేదవానికి సీటు అని చెప్పుకుంటూ.. నిర్ణయాలు తీసుకునే అధికారం అభ్యర్థికి ఇవ్వడంలేదని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. నా బీసీ.. నా ఎస్సీ.. నా ఎస్టీ.. వెనుక నడిపించే రెడ్డి అనే అదృశ్య హస్తాలు ఉన్నాయని మైలవరం అభ్యర్థి విషయంలో తేటతెల్లమవుతోంది. అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, అభ్యర్థి కోరిక మేరకే అదనపు పరిశీలకునిగా కర్రా హర్షారెడ్డిని అధిష్ఠానం నియమించిదని చెప్పారు.

అవినీతి సొమ్మును రప్పిస్తాం : దేవినేని ఉమా



గొల్లపూడి, మార్చి 21 : టీడీపీ అధికారంలోకి రాగానే జగన్ ఐదేళ్లలో ల్యాండ్, శాండ్, మైన్, మైన్ సెంటు పట్టాల్లో అడ్డగోలుగా చేసిన రూ.8 లక్షల కోట్ల దోపిడీ సొమ్మును ప్రభుత్వ ఖజానాకు తిరిగి రప్పిస్తామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని జగన్ అడ్డగోలుగా దోచుకుని 38 క్రిమినల్ కేసుల్లో ఉన్న విషయాన్ని టీడీపీ ఆధారాలతో సహా బయటపెట్టిందన్నారు. ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చి ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి పాలన చేతకాక టీడీపీపై మహాదోపిడీ అని పుస్తకాలు వేశారంటే ప్రభుత్వానికి బుద్ధి ఉందా అని ప్రశ్నించారు. టీడీపీపై ఒక్క ఆరోపణ నిరూపించలేక మళ్లీ సిగ్గు లేకుండా పుస్తకాలు వేస్తున్నారంటే మీ మానసిక స్థితి ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. జరగబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలోకి విసిరేసి 161 అడుగుల గోతిలో ప్రజలు కప్పెడతారన్నారు.

ఓటరూ.. మేలుకో



- కర్తవ్య నిర్వహణలో పాలుపంచుకోండి
- సీ విజిల్, ఓటర్ హెల్ప్‌లైన్, కేవైసీ, సాక్ష్యం యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోండి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం.. అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడిన వాళ్లం అవుతాం. కొత్తగా ఓటు హక్కు సాధించిన నవ ఓటర్లతో పాటు, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఓటు హక్కు విషయంలో అత్యంత బాధ్యతాయుతంగా ఉండాలి. ఓటరు స్పృహతో కర్తవ్యాలను నిర్వర్తించాలి. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించటంలో భాగంగా ఎన్నికల సంఘం పలు మొబైల్ యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. వాటిలో ముఖ్యమైన నాలుగు యాప్‌ల గురించి తెలుసుకుందాం. ఈ యాప్‌లను ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సీ విజిల్



ఈ యాప్ ఒక రకంగా ఓటర్ల గ్రీవెన్స్, ఫిర్యాదులు స్వీకరిస్తుంది. ప్రస్తుతం అమల్లోకి వచ్చిన మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ మొదలుకొని ఎన్నికలు, ఫలితాలు ప్రకటించే వరకు ఎలాంటి ఫిర్యాదులనైనా ఎన్నికల సంఘం దృష్టికి ఓటర్లు నేరుగా ఈ యాప్ ద్వారా తీసుకు రావచ్చు. ఎక్కడైతే అక్రమాలు జరిగాయో.. జీపీఎస్ లొకేషన్‌ను ఈ యాప్ ద్వారా పంపించవచ్చు. ఒక్కోసారి ప్రత్యక్షంగా కళ్లెదుట జరిగే సంఘటనలు కూడా ఎన్నికల సంఘం దృష్టికి ఈ యాప్ ద్వారా తీసుకువెళ్లవచ్చు. మీ వివరాలు అత్యంత రహస్యంగా ఉంటాయి. మీ ఫిర్యాదు ఏ స్థితిలో ఉందో కూడా ట్రాక్ చేసి తెలుసుకోవచ్చు.

ఓటర్ హెల్ప్ లైన్



ఈ యాప్ ద్వారా ఓటర్ల జాబితాలో మీ పేరు ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు. ఓటరు రిజిస్ట్రేషన్‌ను మార్చుకోవచ్చు. ఎన్నికల సంబంధిత సమాచారాన్ని ఈ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. అలాగే ఫిర్యాదులను కూడా యాప్ ద్వారా చేయవచ్చు.

సాక్షం



ఈ మొబైల్ యాప్ ద్వారా దివ్యాంగులు సహాయాన్ని పొందవచ్చు. ఓటు హక్కు వినియోగించుకోవటానికి ముందుగానే ఈ యాప్ ద్వారా మీకు ఎలాంటి సహాయం కావాలో కోరవచ్చు. మాటలు వినలేని వారు తమను సంభాషించగలిగే వారి సహాయాన్ని కోరవచ్చు. చూపు తక్కువ కలిగిన వారు కూడా బ్యాలెట్ పేపర్‌ను చక్కగా చూడలిగే విధంగా ఫాంట్లు పెద్దవి చయటం, కోరిన మీదట రంగులు హైలెట్ చేయటం వంటివి చేస్తారు. పోలింగ్ కేంద్రాల సమాచారం గురించి తెలుసుకోవచ్చు. వీల్‌చెయిర్ సహాయాన్ని కూడా పొందవచ్చు. ఏదైనా ఫిర్యాదులు ఉన్నా చేయవచ్చు.

కేవైసీ



ఈ మొబైల్ అప్లికేషన్ ద్వారా ఎన్నికలలో పాల్గొనే అభ్యర్థుల పేర్లను, అభ్యర్థుల క్రిమినల్ కేసులు గురించి తెలుసుకోవచ్చు. అలాగే అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల గురించి, అందులోని సమాచారం తెలుసుకోవచ్చు.

ఎన్టీఆర్ జిల్లాలో విస్తృత తనిఖీలు

- ఎంసీసీ, ఎన్నికల ఫిర్యాదులకు కంట్రోల్ రూం ఏర్పాటు : కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీజీ మహిళా కళాశాలలో కలెక్టర్ తనిఖీలు

వన్‌టౌన్, మార్చి 21 : ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులతో కలిసి నగరంలో ఎన్నికల మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ తూర్పు నియోజకవర్గ రిసెప్షన్ సెంటర్‌కు సంబంధించి ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్, పశ్చిమ నియోజకవర్గం రిసెప్షన్ సెంటర్‌కు సంబంధించి వన్‌టౌన్‌లోని గాంధీ మహిళా కళాశాలను తనిఖీ చేశారు. పోలింగ్ ముందు, తరువాత మూడు దశలకు అవసరమైన ఏర్పాట్లను ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులో ఉన్నందున ఫిర్యాదులను సత్వరం పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎంసీసీ, ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను కంట్రోల్ రూం నెంబర్ 0866-2570051కు ఫోన్‌చేసి తెలియజేయాలని సూచించారు.

అనుమతుల కోసం సువిధ పోర్టల్ యాప్

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్, మార్చి 21 : రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అవసరమయ్యే వాహనాలు, ఇతర అనుమతుల మంజూరుకు సువిధ పోర్టల్ యాప్ ద్వారా లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం వారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాహనాల అనుమతికి సంబంధించి దరఖాస్తుతో పాటు వాహన రిజిస్ట్రేషన్ వివరాలను, డ్రైవింగ్ లైసెన్స్, వాహన యాజమాని పేరు, డ్రైవర్ పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ తదితర వివరాలు జతచేయాలని తెలిపారు. వాహనం సంచరించే ప్రదేశాల వివరాలు, రూట్ మ్యాప్ తెలియజేయాలి. వాహన తనిఖీ అధికారి(మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్) నుంచి వాహనాన్ని తనిఖీ చేయించుకుని సర్టిఫికేట్ తీసుకోవాలి. తాత్కాలిక ఎన్నికల కార్యాలయం ఏర్పాటుకు భవన యాజమాని అనుమతి, లేదా అద్దె వివరాలు ఇతర అంచనాల వ్యయం, తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. ర్యాలీలు, రోడ్డు షోలు, ఇతర కార్యక్రమాల అనుమతికి ప్రదేశం, రూట్ మ్యాప్ ర్యాలీలో పాల్గొనే వారి సంఖ్య, తేదీ, సమయం ఇతర వివరాలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి తెలియజేసి అనుమతి తీసుకోవాలి. బహిరంగ సభ నిర్వహణ సమయంలో వీఐపీ, వీవీఐపీల సందర్శన సమయంలో హెలీప్యాడ్ అనుమతి కోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుమతి కోసం ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. అనుమతులకు కనీసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించినా.. వాహనాలను ఎన్నికల ప్రచారానికి వినియోగించినా ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించినట్టు పరిగణించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు.

దుర్గగుడి సరుకుల శాంపిళ్ల సేకరణ

- ల్యాబ్‌కు పంపి నివేదిక కోరిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వన్‌టౌన్, మార్చి 21 : దుర్గగుడికి కాంట్రాక్టర్లు సప్లయ్ చేసిన సరుకుల శాంపిళ్లను బుధవారం రాత్రి, గురువారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు సేకరించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'దుర్గగుడికి నాణ్యత లోపం సరుకులు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు' కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్స్‌పెక్టర్ రమేష్ సిబ్బందితో వెళ్లి ప్రధాన స్టోర్, దిగువన ఉన్న స్టోర్లలో సరుకుల శాంపిళ్లు సేకరించారు. వీటిని లేబరేటరీలకు పంపి వచ్చిన నివేదిక ఆధారంగా వాటి నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణలో వచ్చిన సారాంశాన్ని బట్టి సరుకులను అంగీకరించే అవకాశముంది.

హౌస్‌హోల్డ్ రిజిస్టర్లు ఏవి?

- ఎన్నికల కోడ్ వచ్చాక వెనక్కి ఇవ్వని వలంటీర్లు
- అధికార పార్టీ నాయకుల ఇళ్లలో ఉన్నట్టు అనుమానాలు
- ప్రతి కుటుంబం పూర్తి సమాచారం వారి చేతుల్లోనే..
- సచివాలయాల అడ్మిన్‌ల ఉదాసీన వైఖరి



గుడివాడ : ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ చొప్పున జిల్లా వ్యాప్తంగా 9,400 మంది వలంటీర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వలంటీర్లు వారి పరిధిలోని 50 ఇళ్ల తాలుకు పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హౌస్‌హోల్డ్ రిజిస్టర్‌లో నమోదు చేయించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందులో పొందుపరిచారు. తరువాత డిజిటలైజేషన్ పేరుతో జీఎస్‌డబ్ల్యూఎస్ వలంటీర్ అనే మొబైల్ అప్లికేషన్‌లో కుటుంబ సర్వే పూర్తిస్థాయి వివరాలు, ప్రభుత్వం నుంచి పథకాల ద్వారా పొందిన లబ్ధి ఎంత అనే వివరాలను పొందుపరిచారు.

● అడ్మిన్‌ల ఉదాసీన వైఖరి?

ఎన్నికల కోడ్ వచ్చిన రోజునే ఉన్నతాధికారులు వలంటీర్ల వద్దనున్న హౌస్‌హోల్డ్ రిజిస్టర్‌లను వెనక్కి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. రిజిస్టర్‌లు వెంటనే ఆయా సచివాలయాల అడ్మిన్‌లకు అందజేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఆదేశాలు అమలవుతున్న దాఖలాలు లేవు. కొన్ని సచివాలయాల్లో వలంటీర్‌లు రిజిస్టర్‌లను అందజేసినట్టు చెబుతున్నా అడ్మిన్‌లు మాత్రం అందలేదని పేర్కొంటున్నారు. దీని వెనుక ఆంతర్యమేమిటో అంతు పట్టడం లేదు. అసలు రిజిస్టర్‌లను తీసుకోవాలనే సమాచారం కూడా లేదని కొందరు అడ్మిన్‌లు చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. అడ్మిన్‌లకు సదరు శాఖ నుంచి ఏయే సంకేతాలు వెళ్లాయో తెలియడం లేదు. వలంటర్‌ల వద్ద ఉన్న ప్రభుత్వ మొబైళ్లను వెనక్కి తీసుకోవాలని ఎన్నికల కమిషన్ నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని జిల్లా ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు.

● రిజిస్టర్‌లు ఎక్కడ?

వైసీపీ నాయకులు, సానుభూతిపరులకు చెందిన వారే వలంటీర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కుటుంబాల వివరాల రిజిస్టర్‌లు ఏమైనట్టు? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. కొందరు అధికారులైతే అసలు రిజిస్టర్‌లు ఉన్నాయా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డిజిటలైజేషన్‌కు మునుపు ఉన్న రిజిస్టర్‌లు కొన్నిచోట్ల వెనక్కి తీసుకున్నామని, మరికొన్ని చోట్ల వలంటీర్‌ల వద్దే ఉన్నాయని అధికారులు భిన్న సమాధానాలు చెబుతున్నారు.

● వలంటీర్‌లకు ఎందుకు?

ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి వలంటీర్‌లకు ముఖ హాజరును కూడా తీసివేశారు. గుడివాడ మందపాడులోని 21వ వార్డు సచివాలయంలో గురువారం సచివాలయ అడ్మిన్ హాజరు వేయాలనే పేరుతో వలంటీర్‌లను మధ్యాహ్నం వరకు సచివాలయాల్లో కూర్చోపెట్టారు. ఎన్నికల కోడ్ తరువాత వలంటీర్లను విధుల నుంచి, హాజరు నుంచి మినహాయించారు. ఈ క్రమంలో అసలు హాజరే వేయాల్సిన అవసరం లేనప్పుడు వలంటీర్‌లను మధ్యాహ్నం దాకా ఎందుకు ఉంచారో, వారి సేవలను ఎక్కడ వినియోగించారో అడ్మిన్‌కు తెలియాలి.

అధికార పార్టీ చేతుల్లో రిజిస్టర్‌లు

పట్టణ ప్రాంతాల్లో మాత్రం రిజిస్టర్‌లు వైసీపీ నాయకుల వద్ద ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. కొన్ని పంచాయతీల పరిధిలో గ్రామ సర్పంచ్‌లు, అధికార పార్టీ నాయకులు వీటిని తీసుకున్నట్టు వలంటీర్లు పేర్కొంటున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వలంటీర్‌లు డేటాను వినియోగించుకుని అక్రమాలకు పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అధికార పార్టీ నాయకులు తమ డేటాను దేనికి ఉపయోగిస్తారో అనే భయాందోళనలో ప్రజలున్నారు. ప్రజల పూర్తిస్థాయి డేటా ఉన్న రిజిస్టర్‌లు ఏమయ్యాయో, ఎవరి వద్ద ఉన్నాయో కూడా అధికారులు సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నారు.



యనమలకుదురులో రహదారిపక్కన సిద్ధం ఫ్లెక్సీ

ఫ్లెక్సీల తొలగింపులో అధికారుల ఉదాసీనత!

పెనమలూరు, మార్చి 21 : ఎన్నికల నియమావళిలో భాగంగా రాజకీయ ఫ్లెక్సీలపై సీవిజిల్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామంటూ.. సదరు ఫిర్యాదులపై అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. యనమలకుదురు పెట్రోలు బంకు సమీపంలో ఓ షాపు పైభాగంలో 'సిద్ధం' పేరుతో స్థానిక వైసీపీ నేత ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై స్థానిక విద్యార్థి గురువారం సీవిజిల్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే ఫిర్యాదుపై అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

అనుమానంతో పట్టుకుని.. ఆధారాలు చూసి వదిలారు



విజయవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కారులో ముగ్గురు వ్యక్తులు తీసుకెళ్తున్న రూ.12లక్షలను ఎన్నికల స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. తర్వాత ఆధారాలను పరిశీలించి వదిలిపెట్టారు. ఈ ఘటన సెంట్రల్ నియోజకవర్గం భానునగర్‌లో గురువారం జరిగింది. విజయవాడలోని బంధన్ బ్యాంక్ నుంచి సిబ్బంది రూ.12లక్షలను కారులో పామర్రు బ్రాంచ్‌కు తీసుకెళ్తున్నారు. ఇందులో ఇద్దరు వ్యక్తులకు ఒక్కోవ్యక్తికి రూ.3లక్షల చొప్పున బ్యాంకు అధికారులు అథరైజేషన్ లేఖ ఇచ్చారు. భానునగర్‌లో అధికారులు పరిశీలించగా లేఖ ప్రకారం రూ.6లక్షలు ఉండాలి. అదనంగా రూ.6లక్షలు ఉండడంతో అధికారులకు అనుమానం వచ్చింది. నగదును సీజ్‌చేసి ఆదాయపు పన్ను అధికారులను సంప్రదించారు. బ్యాంకు అధికారులను సంప్రదించి వివరణ తీసుకోవాలని, అసలు విషయాన్ని నిర్ధారించుకోవాలని సూచించారు. బ్యాంకుకు వెళ్లి అధికారులను ఆరా తీయగా రూ.12లక్షలు ఇచ్చినట్టు వెల్లడించారు. పామర్రు బ్రాంచ్‌లో రుణం కోసం ఈ నగదును పంపుతున్నట్టు తెలిపారు. దీనితో స్క్వాడ్ అధికారులు నగదును వారికి అప్పగించారు.

సౌత్ ఇండియా అడ్వకేట్స్ క్రికెట్ కెప్టెన్ దూబక్రాంతికుమార్

విజయవాడస్పోర్ట్సు, మార్చి 21 : హైదరాబాద్‌లో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగే ఐదవ సౌత్ ఇండియా అడ్వకేట్స్ క్రికెట్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా చిట్టినగర్‌కు చెందిన న్యాయవాది, యువ క్రికెటర్ దూబ క్రాంతికుమార్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు జట్టు వివరాలను ఏపీ అడ్వకేట్స్ క్రికెట్ అసోసియేసన్ ప్రెసిడెంట్ పొన్నూరి సురేష్‌కుమార్ గురువారం ప్రకటించారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణలకు చెందిన అడ్వకేట్ క్రికెట్ జట్లు బరిలో దిగుతున్నాయి. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో దూబ క్రాంతికుమార్ సత్తా చాటాడు.

జట్టు : దూబ క్రాంతి కుమార్(కెప్టెన్), సీహెచ్.సతీష్, పాకుర్తి సురేష్‌కుమార్, సీహెచ్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.అశోక్‌కుమార్, పి.నవీన్, జి.శ్రీనివాసులు యాదవ్, ఎస్.లక్ష్మీకాంత్, వి.దేవానంద్, ఎన్.సుబ్రమణ్యం, వి.శ్రీకృష్ణ, ఎన్.బి.చక్రవర్తి, ఎన్.వెంకటేష్, బీడీ.నిఖిల్ కుమార్, జి.రవిగాంధీలు బరిలో దిగుతున్నారు. కోచ్‌గా పటాన్ బాజీ షరీఫ్ ఖాన్(గుడివాడ) వ్యవహరించనున్నారు.



ఐక్యవేదిక సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న షర్మిల, ఇతర నేతలు

బీజేపీ పాలనలో దిగజారుతున్న విలువలు

- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

గవర్నర్‌పేట, మార్చి 21: దేశానికి బీజేపీ పాలన మంచిది కాదని, ఈ పాలనతో విలువలు దిగజారుతున్నాయని ఏపీసీసీ చీఫ్ షర్మిల అన్నారు. ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో గురువారం ఇండియా భాగస్వామ్య పక్షాలు, సారూప్య రాజకీయ, రైతు, కార్మిక, మహిళా, ప్రజా సంఘాల ఐక్యవేదిక సమావేశం జరిగింది. రైతు సంఘం నేతలు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షత వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జై భారత్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ, ప్రత్యేకహోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ బీజేపీ మెప్పు కోసం జగన్ పనిచేస్తున్నారని, ఆ పార్టీ చేస్తున్న మోసానికి బాబు, జగన్ ఇద్దరు మౌనం వహిస్తున్నారన్నారు.

వైసీపీ నుంచి వలసల జోరు

- యార్లగడ్డ సమక్షంలో టీడీపీలోకి చేరికలు

గుణదల, మార్చి 21 : గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు అధిక సంఖ్యలో గన్నవరం నియోజకవర్గం టిడిపి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో టీడీపీలో చేరారు. ఎనికేపాడులోని పార్టీ కార్యాలయంలో యార్లగడ్డ ఆధ్వర్యంలో మాల మహానాడు ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు వీరబత్తిన అమల్ దాస్ ఆధ్వర్యంలో 400మంది టీడీపీ కండువాలు కప్పుకున్నారు. దీంతో గన్నవరంలో టీడీపీ మరింత బలోపేతం అవుతుందని వెంకట్రావు అన్నారు.



ఎనికేపాడులో వైసీపీ నేతలకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

యార్లగడ్డ గెలుపే లక్ష్యం కావాలి

- కొనకళ్ల నారాయణ

గన్నవరం : ప్రముఖ న్యాయవాది కేవీ రమణను టీడీపీ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు తదితర నాయకులు రమణ నివాసానికి వెళ్లి కొద్దిసేపు ఆయనతో ముచ్చటించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి సపోర్టు చేయాలని కోరారు. యార్లగడ్డ వెంకట్రావు గెలుపే లక్ష్యం కావాలని కొనకళ్ల నారాయణ పిలుపునిచ్చారు. అనంతరం దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, బీబీగూడెం పీఏసీఎస్ ఛైర్ పర్సన్ బోయపాటి మురళీకృష్ణ(బుల్లియ్య) ఎంపీటీసీ సభ్యుడు శౌంరి కిషోర్, గూడపాటి తులసీమోహన్, ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, కెహెచ్ కోటేశ్వరరావు, పరుచూరి నరేష్ పాల్గొన్నారు. అనంతరం బీజేపీ కార్యాలయానికి వెళ్లి చిగురుపాటి కుమారస్వామి, నాదెండ్ల మోహన్‌ను కలిశారు. మూడు పార్టీల నాయకులు భేషజాలకు పోకుండా కలిసికట్టుగా పని చేసి యార్లగడ్డ వెంకట్రావును భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కొనకళ్ల నారాయణ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.23


ఎన్నికలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు : సీఐ

గుణదల, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఆటంకం కల్గించే ప్రయత్నం చేసే వారిని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని పటమట సీఐ మోహనరెడ్డి తెలిపారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్పనగర్, పటమట డొంకరోడ్డు తదితర ప్రాంతాల్లో గురువారం సాయుధ దళాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి స్థానికుల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై ప్రత్యేక బృందాలు నిఘా పెట్టి పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. పటమట ఎస్ఐలు శాతకర్ణి, వల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.



39వ డివిజన్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీ

విద్యాధరపురం, మార్చి 21: 39వ డివిజన్‌లో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు రేగళ్ల లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కండవల్లి సాంబశివయ్య, డివిజన్ కమిటీ మాజీ అధ్యక్షుడు కే.శివశర్మ, బూత్ కమిటీ కన్వీనర్లు యలేశ్వరపు వెంకటేశ్వరరావు, రేగళ్ల సురేష్ కరపత్రాలను పంచుతూ టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కుమ్మరివీధి, భర్తవరపు వారి వీధి, నాలుగు స్తంభాల సెంటర్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.





చంద్రబాబు పథకాలను

ఇంటింటికీ వెళ్లి వివరించాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రామలింగేశ్వరనగర్, మార్చి 21 : టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. 16వ డివిజన్‌లో గురువారం డివిజన్ బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి కుటుంబానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. చంద్రబాబు అమలు చేసే పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి చెప్పాలని అన్నారు. బీజేపీ, జనసేన బలపరిచిన తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. డివిజన్ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పటమట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజస్వరూపం ప్రజలకు తెలిసిపోయిందని, రానున్న ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జనసేన, బీజేపీలు బలపర్చిన టీడీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ తెలిపారు. గురవారం ఆయన 10వ డివిజన్ ఫన్‌టైమ్స్ క్లబ్‌లో వాకర్స్‌తో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిని రాజధానిగా అంగీకరిస్తున్నానని అసెంబ్లీలో స్పష్టంగా ప్రకటన చేసిన జగన్ అధికారంలో వచ్చిన వెంటనే మాట మార్చి మూడు రాజధానులు అంటున్నాడని, మద్యపాన నిషేదం అమలు చేస్తానని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ దుకాణాలను ఏర్పాటు చేసి కల్తీ మద్యాన్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్పొరేటర్లు దేవినేని అపర్ణ, జాస్తి సాంబశివరావు, కోగంటి వెంకటేశ్వరరావు, అట్లూరి సతీష్, చలసాని వాసు, వై.లక్ష్మీనారాయణ, అట్లూరి సుమలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

● 14వ డివిజన్ దర్శిపేట శివాలయం వీధిలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ చంద్రబాబు పాలనను రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, జనసేన, టీడీపీ, బీజేపీలు బలపర్చిన ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. నర్రా కిషోర్, యడ్లపల్లి నాగరాజు, బద్రి, కె. కోటేశ్వరరావు, యల్లబాబు, వెంకన్న డాంగేకుమారి, ఫాతిమా, జ్యోతిలు పాల్గొన్నారు.

గుణదల: 2వ డివిజన్ పరిధిలోని పడవలరేవు సెంటర్ నుంచి గురువారం గద్దె రామ్మోహన్ తనయులు గద్దె రాజేష్, కాంతి కుమార్‌లు ఎన్నికల ప్రచారం చేపట్టి ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్‌ను గెలిపించాలని కోరారు. 2వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు దాసరి గాబ్రియేలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

భారతీనగర్: తూర్పులోని 3వ డివిజన్ పరిధి కరెన్సీ నగర్‌లో గద్దె రామ్మోహన్ కుమారులు గద్దె రాజేష్, గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో అమలుచేసే సంక్షేమ పథకాల గురించి వివరించి కరపత్రాలను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థులకు ఓట్లు వేసి టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. తాడి బాబురావు, పేరేపి ఈశ్వర్, గద్దె రమేష్, కొత్తపల్లి హరీష్ పాల్గొన్నారు.

టీడీపీ నేత పార్థసారథికి సత్కారం



గవర్నర్‌పేట, మార్చి 21: జనసేన, బీజేపీ బలపర్చిన టీడీపీ నూజివీడు నియోజకవర్గం అభ్యర్థి, మాజీ మంత్రి కొలుసు పార్థసారథిని 23వ డివిజన్ టీడీపీ కార్యకర్తలు సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆహ్వానం మేరకు సూర్యారావుపేటలోని పార్టీ కార్యాలయానికి వచ్చిన పార్థసారథిని బాలస్వామి సత్కరించారు. నూజివీడు నియోజవర్గంలో తనకున్న పరిచయస్తులను, బంధువులను కలుసుకుని పార్థసారథి విజయానికి కృషి చేస్తానని బాలస్వామి తెలిపారు.

శ్రీ తారా సహిత గురువ్రతం



సత్యనారాయణపురం, మార్చి 21 : స్థానిక శ్రీ శివజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో గురువారం శ్రీ తారా సహిత గురువ్రతం నిర్వహించారు. బాబూరావు మేడ సెంటర్ ప్రాంతంలోని పీఠంలో పీఠాధిపతి శివాచార్య స్వామి వ్రతంలో పాల్గొన్నారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పేర్ల శ్యాంప్రసాద్, కొనకళ్ల సత్యకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి

పాయకాపురం, మార్చి 21 : పాయకాపురం ప్రాంతంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. వివరాల ప్రకారం స్థానిక పెట్రోల్ బంక్ ఏరియాలో ఉంటున్న చెరుకూరి శ్రీరామ్ శాంత కార్తీక్(19) ఇటీవల ఇంటర్ పరీక్షలు రాశాడు. గురువారం స్థానిక రైతుబజార్ నుంచి పోలీసు స్టేషన్ వైపు కార్తీక్ సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. విద్యార్థిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

40వ డివిజన్‌లో ఓటర్ల వెరిఫికేషన్

విద్యాధరపురం, మార్చి 21: భవానీపురంలోని పలు ప్రాంతాల్లో 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చిన్నవెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో గురువారం ఓటర్ల వెరిఫికేషన్ జరిగింది. ఈ సందర్భంగా బాలభాస్కర్‌నగర్‌లో 41, 42, 45 బూత్‌లలో ఉంటున్న 100 మంది కుటుంబాలను కలిసి ఓటర్ల వెరిఫికేషన్ చేశారు. 40వ డివిజన్ యూనిట్ ఇన్‌చార్జ్ గంగవరపు సురేష్, బూత్ కన్వీనర్లు గాడు గణేష్, కందికంటి శ్రీనివాసరావు, నాగరాజు, మన్నం నారాయణ, మలినేని ఆదినారాయణ, వినోద్, దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పోతిన మహేశ్‌కు టికెట్ ఇవ్వాలని ఆలయాల్లో పూజలు

వన్‌టౌన్, మార్చి 21: పశ్చిమ సీటును పోతిన మహేశ్‌కు ఇవ్వాలని కోరుతూ కోరుతూ 53, 39 డివిజన్లలోని జనసేన కార్యకర్తలు గురువారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 53వ డివిజన్ అధ్యక్షుడు పొట్నూరి శ్రీనివాసరావు, డివిజన్ కమిటీ సభ్యులు కొత్తపేట కోమలావిలాస్ సెంటర్‌లో ఉన్న నగరాల సీతారామస్వామి రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి 108 టెంకాయలను సమర్పించారు. 39వ డివిజన్ అధ్యక్షుడు ఏలూరు సాయిశరత్, డివిజన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కామకోటినగర్‌లోని శంకరమఠంలో జనసేన కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహేష్‌కు సీటు కేటాయిస్తే భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని కార్యకర్తలు ఆలయం వద్ద ప్రతిజ్ఞ చేశారు. **పాతరాజరాజేశ్వరి పేట:** పశ్చిమ సీటు పోతిన మహేశ్‌కు కేటాయించాలని 34, 55వ డివిజన్లలో గురువారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ మేరకు 34వ డివిజన్ అధ్యక్షుడు ఆకుల రవిశంకర్ డివిజన్‌లోని కేదారేశ్వరపేట, పండ్లమార్కెట్‌లో ఉన్న ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేపట్టి 108 కొబ్బరికాయలు కొట్టారు. 55వ డివిజన్ అధ్యక్షుడు సోమి గోవింగ్ డివిజన్‌లోని గాంధీబొమ్మ సమీపంలోని విరసప్పస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేపట్టి, 108 కొబ్బరికాయలు కొట్టారు.

ఆరోగ్యం, ఆర్థిక భద్రత, ప్రశాంత జీవనంపై అవగాహన



ప్రసంగిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

విజయవాడ, మార్చి 21: ఈ ఏడాది డిసెంబరు వరకు పదవీ విరమణ చేయనున్న ఫ్రంట్‌లైన్ సూపర్ వైజర్లకు పదవీ విరమణ తరువాత ఏం చేయాలన్న దానిపై ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదవీ విరమణ తరువాత ఆర్థిక భద్రత, ఆరోగ్యం, ప్రశాంత జీవనం వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. అడ్మిన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ బ్రహ్మానందం, ట్రాన్స్‌పోర్టు అకాడమీ ప్రిన్సిపాల్ డి. సామ్రాజ్యం, జడ్ఎస్‌టీసీ ప్రిన్సిపాల్ కే లక్ష్మి తదితరులు తమ తమ సందేశాలను ఇచ్చారు. బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు, ఎస్‌బీఐ అధికారులు, శ్రేయాస్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

పీఎస్‌సీఎంఆర్‌లో రక్తదాన శిబిరం



వన్‌టౌన్, మార్చి 21: స్థానిక కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (పీఎస్‌సీఎంఆర్)లో ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.శ్రీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో గురువారం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. విజయవాడ న్యూ సిటీ బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ పి.కల్యాణ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ పి.లక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ జె.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి, డాక్టర్ ఎస్.మణికంఠ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్‌లు ఎం.నవీన్, డాక్టర్ పి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో చైతన్య విద్యార్థుల ప్రతిభ

చిట్టినగర్, మార్చి 21: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. బి.బిల్వాణి(8వ తరగతి) ప్రథమ బహుమతిగా లెనోవో ట్యాబ్, బంగారు పతకం సాధించింది. మెహెక్ తబస్సుం(5వ తరగతి) స్మార్ట్ వాచ్, బంగారు పతకం, లహరి(7వ తరగతి) ద్వితీయ బహుమతిగా స్మార్ట్ వాచ్, బంగారు పతకం, ప్రజ్వల్(5వ తరగతి), సీహెచ్ యశశ్వి(9వ తరగతి)తృతీయ బహుమతిగా హాపీపోంలా గ్లేజ్ వాచ్, బంగారు పతకం సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

చల్లా సుధాకర్‌కు అభినందనలు

గవర్నర్ పేట, మార్చి 21: నగరానికి చెందిన చల్లా సుధాకర్‌ను రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం 23వ డివిజన్‌లోని వైసీపీ కార్యాలయంలో అభినందన కార్యక్రమం జరిగింది. 23వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు (సురేష్) శాలువాతో కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు. వైసీపీ స్థానిక నేతలు వడ్డి వాసు, రాజేష్, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

ప్లైవుడ్ డోర్ల తయారీ కంపెనీలో అగ్నిప్రమాదం

పాయకాపురం, మార్చి 21 : అంబాపురం పంచాయతీ పరిధిలోని ఓ ప్లైవుడ్ డోర్ల తయారీ కంపెనీలో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానిక పైపుల రోడ్డు నుంచి ఇన్నర్ రింగ్‌రోడ్డులోని అంబాపురం పంచాయతీ పరిధిలో అల్లూరి మధు ఓ ప్లైవుడ్ డోర్ల తయారీ కంపెనీ నడుపుతున్నాడు. గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో కంపెనీ నుంచి భారీగా మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అజిత్‌సింగ్‌నగర్ ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపుచేశారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పాయకాపురం, మార్చి 21 : తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన వాంబేకాలనీ గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం అప్పన్న కాలనీలోని డీ బ్లాక్‌లో ఉంటున్న మల్లిక ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తుంటాడు. ఈనెల 19న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి ఉడా కాలనీలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి గురువారం సాయంత్రం ఇంటికి వెళ్లగా తాళం పగుల కొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉండటం, బీరువా తలుపులు తీసి ఉండటాన్ని గమనించిన అప్పన్న ఇంట్లో చోరీ జరిగినట్టు నిర్ధారించుకుని నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీరువాలో ఉండాల్సిన రూ. 45 వేలు, 13 గ్రాముల బంగారు ఆభరణాలు, పావుకేజీ వెండి వస్తువులు చోరీకి గురైనట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న తపనతోనే పొత్తు

బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ

విద్యాధరపురం, మార్చి 21: బీజేపీ ప్రభుత్వ హయాంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి క్రమంలో ఏపీలో కూడా అభివృద్ధి చేయాలన్న తపనతోనే టీడీపీ-జనసేనలతో పొత్తు పెట్టుకోవడం జరిగిందని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ అన్నారు. విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని అగర్వాల్ కల్యాణమండపంలో గురువారం విజయవాడ బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్నికల వ్యూహంలో భాగంగానే ఏపీలో అభివృద్ధి సంక్షేమం దృష్టిలో పెట్టుకుని పొత్తు పెట్టుకున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇచ్చి ఓటు వేసి గెలిపించాలని కోరారు. పశ్చిమలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ పశ్చిమ సీటును పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించినందుకు పవన్‌కల్యాణ్, చంద్రబాబులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. పశ్చిమ సీటులో తాము 30వేల మెజారిటీతో గెలుస్తామని పేర్కొన్నారు. బొడ్డు నాగలక్ష్మి, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, మువ్వల సుబ్బయ్య, ఆర్ముగం, శ్రీరామ్, పశ్చిమ బీజేపీ కన్వీనర్లు నాగేశ్వరరావు, వెంకట్, పొట్టి శ్రీహరి, గొలగాని రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడ్డూరి శ్రీరామ్, వేదికపై షేక్ బాజీ

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

పాయకాపురం, మార్చి 21 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. శాంతినగర్‌లోని శ్రీ శారదా విద్యాలయ ప్రైమరీ స్కూల్‌లో గురువారం డిజిటల్ క్లాస్ ప్రారంభోత్సవ కార్యక్రమం, కోఫోకన్ షట్ ర్యూ జపాన్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత కార్యక్రమం పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమాలకు గోకరాజు గంగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల కన్వీనర్ పెనుమత్స అప్పలరాజు, కరస్పాండెంట్ వి. దుర్గాప్రసాద్, రాఘవరాజు, కరాటే ఇన్‌స్పెక్టర్ బల్లం కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా దేవాన్ష్ జన్మదిన వేడుకలు

పాతరాజరాజేశ్వరి పేట, మార్చి 21 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మనువడు, లోకేశ్ తనయుడు దేవాన్ష్ జన్మదిన వేడుకలను పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్. మాధవ ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో స్థానిక 35వ డివిజన్, పూర్ణానందంపేటలో గురువారం దేవాన్ష్ జన్మదిన వేడుకను జరిపారు. ఈ సందర్భంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ధనేకుల హరికృష్ణ, కర్రీ సునీత, కామందుల రాజు, శ్రీరామ్, వినోద్ బాబు, ముని భాస్కరరావు, పొన్నూరి మేరీ తదితరులు పాల్గొన్నారు.

పటమట: నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా తిరుమల వచ్చిన లోకేశ్ కుటుంబ సభ్యులను గురువారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దేవాన్ష్‌కు బర్త్‌డే విషెస్ తెలిపారు.

చెన్నై సారథి రుతురాజ్

ధనాధన్‌కు సిద్ధమా!

నేటి నుంచే ఐపీఎల్ 17వ సీజన్

చెన్నై x బెంగళూరు మధ్య ఆరంభ పోరు

రాత్రి 8.00 నుంచి స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో..

మహి కల ప్రీమియర్ లీగ్ ముగిసిందో.. లేదో.. అంతకు మించిన వినోదం రెడీగా ఉంది. 16 ఏళ్లుగా వన్నె తరగని రీతిలో అంతకంతకూ ఆకర్షణ పెంచుకుంటూ వస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్‌కు తెర లేవనుంది. ఇక రెండు నెలల పాటు బ్యాటర్ల బాదుడు.. ఫీల్డర్ల మెరుపు విన్యాసాలు.. బౌలర్ల అబ్బురపరిచే బంతులను ఈ క్రేజీ లీగ్‌లో మైమరిచి చూసేందుకు క్రికెట్ ప్రేమికులంతా సిద్ధంగా ఉండాల్సిందే. అలాగే రానున్న టీ20 వరల్డ్‌కప్‌లో బెర్త్ దక్కించుకునేందుకు యువ ఆటగాళ్లతో పాటు వెటరన్స్‌కు కూడా ఈ లీగ్ కీలకమే. దీనికి తోడు డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌తో ఆరంభమే ఘనంగా ఉండబోతోంది.



కెప్టెన్సీ వదిలేసిన ధోనీ
సీజన్‌లో ఆడతాడు : కోచ్ ఫ్లెమింగ్

చెన్నై: ఐపీఎల్ ఆరంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ సారథి ధోనీ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 16 ఏళ్లుగా ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా పేరు తెచ్చుకున్న ఎంఎస్ ధోనీ అనూహ్యంగా నాయకత్వ బాధ్యతలనుంచి వైదొలుతున్నట్టు ప్రకటించాడు. దీంతో ఇక నుంచి యువ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ జట్టును నడిపిస్తాడని సీఎస్‌కే వెల్లడించింది. లీగ్ ఆరంభానికి సరిగ్గా ఒకరోజు ముందు, ఎలాంటి ఊహాగానాలు లేకుండానే వెలువడిన ఈ వార్త అటు సీఎస్‌కే అభిమానులతో పాటు క్రికెట్ ప్రేమికులను కూడా షాక్‌లో ముంచింది. 'ఎంఎస్ ధోనీ తన కెప్టెన్సీని రుతురాజ్‌కు అప్పగించాడు. 2019 నుంచి గైక్వాడ్ జట్టులో భాగంగా ఉంటూ 52 మ్యాచ్‌లు ఆడాడు. అతడి నాయకత్వంలో జట్టు రాణిస్తుందని ఆశిస్తున్నాం' అని సీఎస్‌కే పేర్కొంది. శుక్రవారం జరిగే ఆరంభ మ్యాచ్‌లో సీఎస్‌కే జట్టు రుతురాజ్ నేతృత్వంలోనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో ఆడనుంది. అయితే 27 ఏళ్ల రుతురాజ్‌కు కెప్టెన్‌గా చేయడం ఇదేం తొలిసారి కాదు. 2023 ఆసియా గేమ్స్‌లో భారత క్రికెట్ జట్టు అతడి ఆధ్వర్యంలోనే స్వర్ణం సాధించింది. దేశవాళీల్లో మహారాష్ట్ర జట్టుకు కూడా తనే కెప్టెన్. అలాగే గతేడాది తమ ఫ్రాంచైజీని చాంపియన్‌గా నిలపడంలో బ్యాటర్‌గా రుతురాజ్ పాత్ర కీలకం. ఆడిన 16 మ్యాచ్‌ల్లో 147.50 స్ట్రయిక్ రేట్‌తో 590 పరుగులు చేశాడు. వాస్తవానికి 2019లో జట్టులోకి వచ్చిన రుతురాజ్ పూర్తిగా బెంచీకే పరిమితమయ్యాడు. ఆ తర్వాత ఏడాది ఆరు మ్యాచ్‌లు ఆడగలిగాడు. కానీ 2021లో అద్భుతంగా చెలరేగి ఆరెంజ్ క్యాప్ (635) గెలుచుకోగా.. 2022లోనూ జట్టు తరఫున అతడివే అత్యధిక పరుగులు (368). అయితే విశేష అభిమానగణం ఉన్న సీఎస్‌కే నయా కెప్టెన్‌గా ఇప్పుడు ఏమేరకు రాణిం

ఇదే ఆఖరు!

ఐపీఎల్‌లో 2008 నుంచి సీఎస్‌కేను ఎంఎస్ అత్యద్భుత జట్టుగా మార్చాడు. అయితే జట్టు ఇప్పుడు సంధి దశలో ఉంది. బహుశా 42 ఏళ్ల ధోనీకిదే చివరి ఐపీఎల్. అందుకే జట్టులో తను కొనసాగినప్పుడే మరొకరికి పగ్గాలు అప్పజెప్పాలనుకున్నాడు. వాస్తవానికి 2022లోనే ధోనీకి ఈ ఆలోచన వచ్చి జడేజాను ముందుకు తెచ్చాడు. కానీ కేవలం 8 మ్యాచ్‌ల తర్వాత తిరిగి ధోనీయే నాయకుడయ్యాడు. అప్పుడు ఆ నిర్ణయం వర్కౌట్ కాలేదు కానీ ఈసారి అలా కాదని సీఈవో విశ్వనాథన్ చెబుతున్నాడు. అప్పట్లో తాము కూడా ఎంఎస్ నుంచి కెప్టెన్సీ మార్పునకు సిద్ధంగా లేమని, కానీ ఇప్పుడు ఆ పాత్రకు యువ ఆటగాళ్లను తయారుచేయాల్సిన అవసరం ఏర్పడిందని కోచ్ ఫ్లెమింగ్ చెప్పాడు. మరోవైపు ధోనీ బరిలోకి దిగుతాడా? లేదా? అని ఫ్యాన్స్ సందేహిస్తున్నారు. కొంతకాలం క్రితమే ధోనీ మోకాలికి సర్జరీ కూడా అయ్యింది. కానీ వీటన్నింటికి చెక్ పెడుతూ.. ఎంఎస్ సీజన్ మొత్తానికి అందుబాటులో ఉంటాడని ఫ్లెమింగ్ తేల్చాడు. గత సీజన్‌తో పోలిస్తే ఇప్పుడు తను మరింత ఫిట్‌గా ఉన్నాడని చెప్పాడు.

మహీయే వదిలేశాడు..

సీఎస్‌కే జట్టులో ధోనీ అంతర్భాగం. ఈ ఫ్రాంచైజీలో అతడేం చెబితే అదే జరుగుతుంది. ముంబై ఇండియన్స్ తరహాలో హార్దిక్‌ను కెప్టెన్‌గా చేసిన తీరును ఇక్కడ చూడలేం. అంతా ఎంఎస్ ఇష్టప్రకారమే జరిగిందని సాక్షాత్తూ సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథ్ తెలిపాడు. 'జట్టు ప్రయోజనాల కోసమే ధోనీ ఆలోచనలు ఉంటాయి. అతడి తాజా నిర్ణయం గురించి నాకు ఐపీఎల్ కెప్టెన్ల సమావేశానికి ముందు మాత్రమే తెలిసింది. కెప్టెన్‌గా వైదొలగడం కేవలం అతడి ఇష్టపూర్వకంగానే జరిగింది. మనం అతడి నిర్ణయాన్ని గౌరవించాల్సిందే' అని కాశీ తెలిపాడు.

గైక్వాడ్‌కు జై..

ముంబై కెప్టెన్‌గా హార్దిక్‌ను నియమించినప్పుడు సోషల్ మీడియాలో అభిమానుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. కానీ రుతురాజ్‌పై మాత్రం సీఎస్‌కే ఫ్యాన్స్ అభిమానం కురిపిస్తుండడం విశేషం. ఓ దేశవాళీ మ్యాచ్‌లో ఎంఎస్ నుంచి ఆటోగ్రాఫ్ తీసుకున్న రుతురాజ్.. నేడు అతడి నుంచే సారథ్యం అందుకోవడం భేష్ అంటూ కొనియాడుతున్నారు. అలాగే ఎంఎస్ 26 ఏళ్ల వయస్సులో దేశానికి టీ20 వరల్డ్ కప్ అందించి.. 27 ఏళ్లకు సీఎస్‌కే కెప్టెన్ అయ్యాడని.. అలాగే 26 ఏళ్ల రుతురాజ్ భారత్‌కు ఆసియాకప్ స్వర్ణం అందించి.. 27 ఏళ్లప్పుడే సీఎస్‌కే సారథి అయ్యాడని ఫ్యాన్స్ గుర్తుచేసుకుంటున్నారు.

కెప్టెన్‌గా ఎంఎస్ కెరీర్

ఐపీఎల్ ఆరంభం నుంచి చెన్నై కెప్టెన్‌గా కొనసాగిన ధోనీ రికార్డు స్థాయిలో ఐదు టైటిళ్లు అందించాడు. 2010, 2011, 2018, 2021, 2023లో విజేతగా నిలిచిన జట్టు తాజాగా డిఫెండింగ్ చాంపియన్‌గానే బరిలోకి దిగుతోంది. అలాగే రెండుసార్లు చాంపియన్స్ లీగ్‌లోనూ విజేతగా నిలిపాడు. లీగ్‌లో అత్యధిక మ్యాచ్‌లకు కెప్టెన్సీ (226) వహించిన రికార్డు కూడా ధోనీదే. ఇందులో 133 విజయాలు, 91 ఓటములు, రెండు ఫలితం తేలనివి ఉన్నాయి. మొత్తంగా సీఎస్‌కే, రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ తరఫున 250 మ్యాచ్‌లను ఆడిన ఎంఎస్ 5082 పరుగులు సాధించాడు.

'తలా' దర్శనం లేకపాయె..

ఎంఎస్ ధోనీని విపరీతంగా ఆరాధించే అభిమానులు అతడిని నెట్స్‌లో చూసేందుకు కూడా ఎగబడుతుంటారు. ఈ క్రమంలో గతంలో చిదంబరం స్టేడియం ప్యాక్ అయిన వీడియోలు చక్కర్లు కొట్టేవి. కానీ ఈసారి ముందుగానే తమ ఆరాధ్య 'తలా' దర్శనం చేసుకునేందుకు ఫ్యాన్స్‌కు వీలు కాలేదు. ఎందుకంటే.. దేశంలో సాధారణ ఎన్నికల నేపథ్యంలో అభిమానుల కోసం స్టాండ్స్‌ను తెరిచేందుకు స్థానిక పోలీసులు అనుమతించలేదు. వేలాది ఫ్యాన్స్ తరలివస్తారు కాబట్టే భద్రత కోసం పోలీసుల అనుమతి తీసుకోవడం అవసరం. దీంతో ఏప్రిల్ 19 ఎన్నికల తర్వాత ఫ్యాన్స్‌ను నెట్స్‌లోకి అనుమతించాలని సీఎస్‌కే భావిస్తోంది.



మెగాలీగ్ కెప్టెన్లు

రాహుల్ (లఖ్‌నవూ)
కమిన్స్ (సన్‌రైజర్స్)
జితేశ్ (పంజాబ్ వైస్‌కెప్టెన్)
రుతురాజ్ (చెన్నై)
రిషభ్ పంత్ (ఢిల్లీ)
డుప్లెసి (బెంగళూరు)
గిల్ (గుజరాత్)
శాంసన్ (రాజస్థాన్)
హార్దిక్ (ముంబై)
శ్రేయాస్ (కోల్‌కతా)

చెన్నై: టీ20 ప్రపంచకప్‌నకు ముందే అభిమానులకు కావాల్సినంత వినోదం లభించనుంది. నేటి నుంచే ఐపీఎల్ 17వ సీజన్ ఆరంభం. అయితే ఈసారి లీగ్ సమయంలోనే దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగనుండడంతో ప్రస్తుతానికి 15 రోజుల షెడ్యూల్‌నే ప్రకటించారు. దీనిలో భాగంగా శుక్రవారం నుంచి ఏప్రిల్ 7 వరకు తొలి దశ మ్యాచ్‌లు జరుగబోతున్నాయి. ఈమేరకు మొత్తంగా పది జట్లు, పది వేదికల్లో 21 మ్యాచ్‌ల్లో తలపడతాయి. మిగతా షెడ్యూల్ స్వదేశంలో ఉంటుందా? తటస్థ వేదికల్లో నిర్వహిస్తారా? అనేది తేలాల్సి ఉంది. మరోవైపు జాతీయ జట్టులో సహచరులుగా ఉన్న వారే ఇక మైదానంలో ప్రత్యర్థులుగా సవాల్ విసురనున్నారు. అటు ఫ్యాన్స్ కూడా తమ ఫ్రాంచైజీల వారీగా విడిపోయి విదేశీ ఆటగాళ్లకైనా జేజేలు పలికేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపుగా అన్ని జట్లలో పలువురు కీలక ఆటగాళ్లు గాయాలతో దూరమైనా.. ఏ మాత్రం కళ తప్పని ఈ లీగ్‌లో స్టార్ ప్లేయర్లతో పాటు యువ ఆటగాళ్లు కూడా ఆకట్టుకోవాలనుకుంటున్నారు. అలాగే కారు ప్రమాదం నుంచి కోలుకుని తిరిగి బ్యాట్ పట్టనున్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషభ్ పంత్ ఎలా రాణిస్తాడనేది ఫ్రాంచైజీతో పాటు భారత టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఆత్రుతగా ఎదురుచూస్తోంది.

విరాట్‌కు కీలకం



తాజా లీగ్‌లో అందరికళ్లూ విరాట్ కోహ్లీపైనే ఉండనున్నాయి. ధనాధన్ ఫార్మాట్‌లో యువ ఆటగాళ్లు దూసుకువస్తుండడంతో టీ20 జట్టులో విరాట్ స్థానం సందేహంగా మారింది. ఈ లీగ్ ముగిశాక జూన్ 2 నుంచి టీ20 వరల్డ్‌కప్ ఉండడంతో ఆయా ఆటగాళ్ల ఫామ్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇప్పటికే విరాట్‌కు చోటు సందేహమనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీంతో ఈ ఐపీఎల్‌లో తనను తాను నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. 2022 టీ20 వరల్డ్‌కప్ ముగిశాక విరాట్ ఆడింది కేవలం రెండు టీ20 మ్యాచ్‌లే కావడం గమనార్హం. వాస్తవానికి తన టీ20 ఫామ్ మరీ అంత పేలవంగా ఏమీ లేదు. 117 మ్యాచ్‌ల్లో 138.15 స్ట్రయిక్ రేట్‌తో ఈ ఫార్మాట్‌లో అత్యధికంగా 4,037 పరుగులు సాధించాడు.

ఆటలో 'విలువ' కనిపిస్తుందా?

డిసెంబరులో జరిగిన ఐపీఎల్ వేలంలో కనీవినీ ఎరుగని రీతిలో పలువురు ఆటగాళ్లను ఆయా ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్‌ను కోల్‌కతా జట్టు ఏకంగా రూ.24 కోట్ల 75 లక్షలకు తీసుకుంది. తమ పేస్ దళానికి ప్రధాన ఆయుధంగా పనికివస్తాడనే భావనలో కేకేఆర్ ఈ రికార్డు ధరకు మొగ్గు చూపింది. ఇక ప్యాట్ కమిన్స్ కోసం సన్‌రైజర్స్ రూ.20 కోట్ల 50 లక్షలను వెచ్చించింది. ఆసీస్‌కు టీ20 ప్రపంచకప్‌ను అందించినట్టే తమకు కూడా టైటిల్‌ను అందిస్తాడనే ఆశతో కెప్టెన్‌గానూ నియమించుకుంది. ఇక కామెరూన్ గ్రీన్‌ను ముంబై నుంచి బెంగళూరు రూ.17.50 కోట్లకు తీసుకుంది. వీరే కాకుండా కొందరు అనామక ఆటగాళ్లు కూడా కోట్లు పలికారు. ఈ విలువైన క్రికెటర్లు ఫ్రాంచైజీల ఆశలను తీరుస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది.

బోణీ కొట్టేదెవరో?

టోర్నీ ఆరంభానికి ఒక్క రోజు ముందు ఎంఎస్ ధోనీ నాయకత్వం నుంచి తప్పుకొన్నాడు. కొత్త కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్..డుప్లెసి నేతృత్వంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తాజా ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. దీంతో తొలి మ్యాచ్‌లోనే భారత అభిమానులకు ధోనీ వర్సెస్ కోహ్లీ పోరు చూసే అవకాశం దక్కింది. సీఎస్‌కే టైటిల్ కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా.. ఆర్‌సీబీ మాత్రం తీవ్ర ఒత్తిడిలోనే బరిలోకి దిగబోతోంది. డబ్ల్యూపీఎల్‌లో తమ ఫ్రాంచైజీ విజేతగా నిలవడంతో బెంగళూరు అభిమానుల ఫోకస్ పురుషుల జట్టుపైకి మారింది. పేరుతో పాటు జెర్సీలోనూ మార్పు చేసుకున్న ఈ జట్టు 16 ఏళ్లుగా ఊరిస్తున్న ఐపీఎల్ ట్రోఫీని ఎలాగైనా అందుకోవాలనే కసితో ఉంది. కొన్నేళ్లుగా ఇదే చివరి లీగ్‌గా అందరూ భావిస్తున్నా ధోనీ మాత్రం ప్రతీ సీజన్‌లో ఫ్యాన్స్‌ను మురిపిస్తూనే ఉన్నాడు. ఇప్పుడు కూడా 42 ఏళ్ల వయస్సులో అత్యంత ఫిట్‌గా కనిపిస్తూ సీఎస్‌కే ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తున్నాడు. ఇక ఓపెనర్ కాన్వే, పేసర్ పథిరన గాయాలతో ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నారు. ధోనీతో పాటు రుతురాజ్, మిచెల్, జడేజా, రహానె, రచిన్, దీపక్, తుషార్ కీలక ఆటగాళ్లు. అటు ఆర్‌సీబీకి మాత్రం గాయాల బెడద లేకుండా ఆటగాళ్లంతా ఫిట్‌గా ఉన్నారు. కోహ్లీ కూడా సుదీర్ఘ విరామంతో తాజాగా కనిపిస్తున్నాడు. డుప్లెసి, మ్యాక్స్‌వెల్, దినేశ్ కార్తీక్, గ్రీన్, పటీదార్‌లతో ఆర్‌సీబీ బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తోంది. పేసర్లు సిరాజ్, జోసెఫ్, ఫెర్గూసన్‌లపై జట్టు బౌలింగ్‌లో ఆధారపడి ఉంది.



క్వార్టర్స్‌లో గాయత్రి, రజావత్



బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో గాయత్రీ గోపీచంద్ జంట, ప్రియాన్షు రజావత్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. గురువారం జరిగిన మహిళల డబుల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ 21-10, 21-12తో సహచర ద్వయం ప్రియ/శృతీ మిశ్రాపై సునాయాసంగా నెగ్గింది. పురుషుల సింగిల్స్ రౌండ్-16 పోరులో రజావత్ 21-14, 21-13తో లీ లాన్ జీ (చైనా)ను చిత్తు చేసి క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. ఇక మహిళల డబుల్స్ మరో రెండో రౌండ్‌లో అశ్వినీ పొన్నప్ప జంట పరాజయం పాలైంది. జపాన్‌కు చెందిన హిరోకామీ/కటోతో జరిగిన మ్యాచ్‌లో అశ్విని/తనీషా క్రాస్టో 17-21, 16-21తో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించారు.

'ద హండ్రెడ్'లో భారత్ నుంచి ఇద్దరే!



లండన్: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్ చాంపియన్ జట్టు ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన, కీపర్ రిచా ఘోష్‌కు మాత్రమే రాబోయే 'ద హండ్రెడ్' లీగ్‌లో చోటు దక్కింది. సదరన్ బ్రేవ్ జట్టు మంధానను తీసుకోగా, ఆమె ఆర్సీబీ సహచరి రిచా ఘోష్‌పట్ల బర్మింగ్‌హామ్ ఫినిక్స్ జట్టు మొగ్గు చూపింది. ఎడమచేతి వాటం బ్యాటర్ స్మృతి తాజా డబ్ల్యూపీఎల్ 10 మ్యాచ్‌ల్లో 300 రన్స్‌తో సత్తా చాటింది. మరోవైపు ఫినిషర్‌గా అదరగొట్టిన ఘోష్ 10 మ్యాచ్‌ల్లో 142 స్ట్రయిక్ రేట్‌తో, రెండు అర్ధ శతకాలు సహా 257 పరుగులు సాధించింది. ఇన్నింగ్స్‌కు 100 బంతుల చొప్పున ఉండే ఈ లీగ్ లండన్‌లో జూలై 23 నుంచి జరగనుంది. మొత్తం ఎనిమిది జట్లు టోర్నమెంట్‌లో తలపడనున్నాయి. భారత్ నుంచి హర్మన్‌ప్రీత్, దీప్తిశర్మ, జెమీమా రోడ్రిగ్స్ శ్రేయాంక పాటిల్ సహా మొత్తం 17 మంది భారత క్రికెటర్లు హండ్రెడ్ లీగ్ డ్రాఫ్టులో పేర్లు నమోదు చేసుకున్నారు. కానీ జట్లేవీ వారిని తీసుకొనేందుకు ఆసక్తి చూపలేదు.

పారిస్ ఒలింపిక్స్

చెఫ్ డి మిషన్‌గా మేరీకోమ్

భారత పతాకధారి శరత్ కమల్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భారత పతాకధారిగా వెటరన్ టీటీ ఆటగాడు శరత్ కమల్ వ్యవహరించనున్నాడు. ఈమేరకు కామన్వెల్త్ క్రీడల చాంపియన్ శరత్ పేరును భారత ఒలింపిక్ సంఘం గురువారం ప్రకటించింది. అలాగే దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌ను చెఫ్ డి మిషన్‌గా ఎంపిక చేసింది. కాగా..ర్యాంకింగ్స్ ఆధారంగా భారత పురుషులు, మహిళల టీటీ జట్లు పారిస్ ఒలింపిక్స్ టీమ్ విభాగాలకు అర్హత సాధించిన విషయం విదితమే. 'క్రీడల పట్ల అసమాన అంకితభావం, ఎందరికో స్ఫూర్తిగా నిలిచే మేరీకోమ్ చెఫ్ డి మిషన్‌గా భారత అథ్లెట్లకు మార్గదర్శనం చేయనుంది' అని ఐఓఏ తెలిపింది.

ఐపీఎల్‌కు జంపా దూరం

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆరంభానికి ముందు రాజస్థాన్ రాయల్స్‌కు గట్టిదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన స్పిన్నర్లలో ఒకడైన ఆస్ట్రేలియా ఆటగాడు ఆడమ్ జంపా మెగా లీగ్ నుంచి వైదొలిగాడు. జంపాను రాజస్థాన్ రూ. 1.5 కోట్లకు రిటైన్ చేసుకొంది. అయితే, గత కొంతకాలంగా తీరికలేని క్రికెట్ ఆడుతున్న జంపా విశ్రాంతి నిమిత్తం తప్పుకొన్నట్టు తెలుస్తోంది. జంపా తప్పుకోవడంతో స్పిన్ భారం అశ్విన్, యజ్వేంద్ర చాహల్‌పైనే పడనుంది. గత సీజన్‌లో రాయల్స్ తరఫున ఆరు మ్యాచ్‌లు ఆడిన జంపా 8 వికెట్లు పడగొట్టాడు.

పర్వదినం

ప్రకృతి అంతా ప్రకాశవంతమైన రంగులతో నిండి ఉన్నట్టే... మీ మనస్సు కూడా ఆనందం, విచారం, కోపం అసూయ, కరుణ, దాతృత్వం... ఇలా అనేక భావోద్వేగాలు కలిగి ఉంటుంది. వాటికి మీరు సాక్షిగా మారినప్పుడు మాత్రమే... జీవితాన్ని ఆస్వాదించగలరు. ఆ భావోద్వేగాలే మీ స్వభావం అనుకుంటే ఇబ్బందిలో పడతారు. వాటికి దూరంగా, సాక్షిగా ఉండి, చైతన్యం వైపు పయనించడానికి మార్గం - ధ్యానం. ధ్యానంలో ఉన్నప్పుడు మీ మనసులో జరిగే అన్నిటికీ మీరు సాక్షిగా ఉంటారు. మీకు శత్రువు వేరెవరో కాదనీ, మీ మనసేననీ గమనిస్తారు.

రంగులతో నింపేద్దాం

'మీ శత్రుత్వాలను స్నేహాలుగా మార్చుకోండి. ఒక్క శత్రువు కూడా మిగలకూడదు'- ఇదే హోలీ పండుగ ఇచ్చే సందేశం. మన లోపల శత్రుత్వ భావన ఉన్నప్పుడే శత్రువు పుడతాడు. ఆ భావన మనలో లేకపోతే శత్రువులు కూడా ఉండరు. మీరు ఉద్దేశపూర్వకంగా ఎవరికీ హాని చేయనప్పుడు... ఎవరైనా మిమ్మల్ని ఏ కారణంవల్లనైనా శత్రువుగా భావించినా చింతించకండి. మీతో శత్రుత్వం వహించడం వల్ల వాళ్ళే నిద్రపట్టక, కలత చెందుతూ, ఒత్తిడికి గురవుతారు. అది వారి సమస్య. వాళ్ళకే వదిలెయ్యండి. మన వైపు నుంచి మాత్రం శత్రుత్వ భావనను పెంచుకోవద్దు.


వృత్తి, ఉద్యోగం, అంతస్తులు, కులం, లింగం లేదా వయస్సు ఆధారంగా... సమాజంలో విభజనలను కొన్నిసార్లు మనం చూస్తూ ఉంటాం. ఈ అడ్డంకులను దాటి- అందరూ దగ్గరకు చేరే వేడుక హోలీ. వేల ఏళ్ళ నుంచి విభేదాలకు అతీతంగా ప్రజలను ఏకం చేస్తున్న పండుగ ఇది. మానవులందరూ ఒక్కటే అని చాటుతూ ఈ పండుగను జరుపుకొంటారు.

ప్రహ్లాదుణ్ణి చంపడం కోసం అతని అత్త హోలిక అతణ్ణి ఒడిలో కూర్చోబెట్టుకుని మంటల్లోకి వెళ్ళడం, ఆమె కాలిపోవడం, ప్రహ్లాదుడు క్షేమంగా బయటపడడం గురించిన కథ ఒకటి ఉంది. భక్తి భావంలో మునిగి ఉండేవారికి జీవితం వర్ణరంజితంగా, ఉత్సవంగా మారుతుంది. గతాన్ని దగ్ధం చేసి, సరికొత్త ఆరంభానికి మీరు సిద్ధమవుతారు. భావోద్వేగాలు మనల్ని నిప్పులా దహిస్తూ ఉంటాయి. కానీ అవే ఒక రంగుల ఫౌంటెన్ అయినప్పుడు... జీవితానికి ఆహ్లాదాన్ని చేకూరుస్తాయి. అజ్ఞానంలో ఉన్నప్పుడు భావోద్వేగాలు ఒక సమస్య. జ్ఞానంలో ఉన్నప్పుడు అవే భావోద్వేగాలు మీ జీవితాన్ని వర్ణభరితంగా మారుస్తాయి. హోలీ రోజున అందరినీ కలుసుకోండి. తరచుగా నిస్తేజంగా కనిపించే ఈ ప్రపంచాన్ని ఆనందం, భక్తి, స్వచ్ఛత అనే రంగులతో నింపండి.

• శ్రీశ్రీ రవిశంకర్



25న హోలీ



విశేషం

జ్ఞాన తీర్థ సంగమం

శ్రీ రాఘవేంద్రస్వామి పూర్వావతారం... విష్ణుభక్తుడు, శ్రీ నరసింహావతార కరుణాపాత్రుడు అయిన ప్రహ్లాదుడు కాగా... ఆ తదుపరి అవతారం శ్రీవ్యాసరాజ యతివరేణ్యులు. ఆయన ఆరాధన, శ్రీ రాఘవేంద్రుల గురువు శ్రీ సుధీంద్ర తీర్థుల ఆరాధన కూడా ఫాల్గుణ మాసంలోనే జరుగుతుంది. అందులోనూ కృష్ణపక్షంలో వచ్చే తదియ నాడు... మధ్వ సంప్రదాయంలో కలికితురాయిలు అనదగిన గొప్ప యతివరేణ్యులు శ్రీ వ్యాసరాజులు, శ్రీ వాదిరాజులు, శ్రీ సుధీంద్ర తీర్థుల ఆరాధనలు జరగడం మరో విశేషం. అవి ఈ నెల 28న రాబోతున్నాయి. "అది అత్యంత పవిత్రమైన రోజు మాత్రమే కాదు... మధ్వులకు త్రివేణీ సంగమం" అని ప్రసిద్ధ ప్రవచనకారుడు శ్రీ బ్రాహ్మణాచార్యులు వర్ణించారు. గంగ, యమున, సరస్వతి నదులతో కూడినది మనకు తెలిసిన త్రివేణీ సంగమం... కాగా ఆ రోజు ముగ్గురు జ్ఞాన తీర్థుల సంగమం. నదీ తీర్థాలలో వచ్చే పుణ్యఫలం... భగవంతుడు మనకు ఇచ్చినప్పుడు లభిస్తుంది. కానీ తీర్థుల జ్ఞాన సంగమంలో... వారి స్మరణ ద్వారా, వారి బృందావనాల దర్శనం ద్వారా రావలసిన పుణ్య ఫలం తక్షణమే లభిస్తుంది. ఈ యతివరేణ్యులు ముగ్గురూ... మధ్వ సిద్ధాంత సేవ చేయడానికి అవతరించిన దేవతాస్వరూపుల్లో ప్రముఖులు. జ్ఞాన సంపాదనకు, భక్తి ప్రబోధాలకు, జీవితాలను అంకితం చేసిన మహానుభావులు.

ఉడుపికి సమీపంలో ఆనేగుడ్డే అనే ప్రసిద్ధ గణపతి క్షేత్రం ఉంది. అక్కడికి దగ్గరలోని హూవినకెరెలో సామ వేద అధ్యయనం చేసిన వంశానికి చెందిన రామాచార్యులు, గౌరి అనే దంపతులు నివసించేవారు. వారు ఉత్తమమైన పుత్ర సంతానం కోసం తమ భక్తితో, జప తపాలతో భగవంతుణ్ణి మెప్పించే ప్రయత్నం చేశారు. సోణ్డా మఠానికి చెందిన శ్రీ వాగీశ తీర్థుల దగ్గరకు వెళ్ళి... తమ కోరికను విన్నవించుకున్నారు. వారికి పుత్ర సంతానం కలుగుతుందని ఆయన దీవిస్తూ... "ఇంటి బయట బిడ్డ జన్మిస్తే మా మఠానికి ఇవ్వాలి. ఇంటి లోపల జన్మిస్తే మీరే ఉంచుకోవచ్చు" అని ఆదేశించారు. 'బిడ్డ జన్మించేది ఇంట్లోనే. ప్రసవానికి బయటకు వెళ్ళేది లేదు కదా!" అని ఆ దంపతులు భావించారు. గౌరి గర్భం దాల్చిన తరువాత అన్ని జాగ్రత్తలనూ తీసుకొనేవారు. ఉడుపి ప్రాంతంలోని వారి ఇల్లు పొలాల మధ్య ఉంది. శార్వరి నామ సంవత్సరం మాఘ శుద్ధ ద్వాదశి రోజున... ముందురోజు ఉపవాసాన్ని విరమించిన రామాచార్యులు భోజనం చేస్తూ ఉండగా... ఒక ఆవు వచ్చి పంటను మేయడం మొదలుపెట్టింది. దాన్ని అదిలించి పంపేందుకు గౌరి బయట కాలు పెట్టింది. పది అడుగులు వేయగానే ఆమెకు ప్రసవవేదన ప్రారంభమై... ఇంటి బయట పొలంలో మగబిడ్డను ప్రసవించింది. తపోజ్ఞాని అయిన శ్రీవాగీశ తీర్థులు పంపిన బంగారు పళ్ళెంలో... ఆ బిడ్డను మంత్రసానులు ఉంచారు. తమ వాగ్దానం ప్రకారం ఆ బిడ్డను మఠానికి రామాచార్యుల దంపతులు ఇచ్చేశారు. ఆ బిడ్డే మహిమాన్వితుడైన శ్రీ వాదిరాజ తీర్థులు. ఆ మఠానికి భూ వరాహ ప్రతిమను శ్రీ మధ్వాచార్యులు ఇచ్చారు. దాన్ని గుర్తు చేసేలా ఆ బిడ్డకు 'భూ వరాహ' అని శ్రీ వాగీశతీర్థులు నామకరణం చేశారు. "అయిదేళ్ళు వచ్చేవరకూ మీ దగ్గరే అతణ్ణి పెంచండి. తరువాత మఠానికి అప్పగించండి" అని రామాచార్య దంపతులకు ఆ బిడ్డను ఆయన తిరిగి ఇచ్చారు.



శ్రీ వ్యాసరాజుల జననం కూడా దాదాపు ఇదే విధంగా ఉంటుంది. కర్ణాటకలోని మైసూరుకు సమీపంలో ఉన్న అబ్బూరుకు చెందిన రామాచార్యులు, లక్ష్మీ దేవి దంపతులు... సంతానం కోసం బదరీ యాత్రకు బయలుదేరారు. మార్గమధ్యంలో రామాచార్యులు ఆరోగ్యం క్షీణించి, మంచం పట్టారు. ఆయనపై అందరూ ఆశ వదిలేసుకున్నారు. ఈలోగా... బ్రహ్మణ్య తీర్థులు అనే యతి బదరీ యాత్ర ముగించి తిరుగు ప్రయాణంలో ఉన్నారనీ, తాము ఉన్న ఊరిలోనే ఆయన బస చేస్తారనీ లక్ష్మీ దేవికి తెలిసింది. ఆయనను ఆమె దర్శించుకోగా "దీర్ఘ సుమంగళీభవ అనీ, సుపుత్ర ప్రాప్తిరస్తు" అని దీవించారు. వాగీశ తీర్థుల మాదిరిగానే... ఇంట్లో బిడ్డ జన్మిస్తే మీరే ఉంచుకోవచ్చనీ, బయట జన్మిస్తే మఠానికి అందించాలనీ ఆయన ఆదేశించారు. కేవలం ఆయన మాటతో రామాచార్యులు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందారు. సత్యలోకంలో బ్రహ్మ దేవుని వద్ద ఉంటూ, పరమాత్ముని పూజకు రోజూ పూలను తెచ్చే శంఖుకర్ణుడు తన రెండవ జన్మగా... శ్రీ వ్యాసరాజులుగా వారి ఇంట పుట్టాడు. ఈ జననం కూడా ఇంటి బయటే జరిగింది. ఆ బిడ్డను బ్రహ్మణ్య తీర్థులే శుద్ధ జలంతో కడిగి, దేవుడికి అభిషేకించిన పాలను మొదటగా తాగించారు.

ఈ ఇద్దరు యతివరేణ్యుల జననం, ఇతర సంస్కార విషయాల్లో సారూప్యత మనకు కనిపిస్తుంది. ఇద్దరి జననం ఇంటి బయటే జరిగింది. వారి గురువులు పరమాత్మ సంకల్పాన్ని ఎరిగినవారై... వారు పుట్టగానే భూమిని స్పృశించకుండా బంగారు పళ్ళాలను పంపారు. ఇద్దరికీ ఎనిమిదేళ్ళ వయసులోనే సన్యాసాశ్రమ స్వీకారం జరిగింది. వారిద్దరూ తిరుమల శ్రీనివాసుడికి సేవలు అందిచారు. ఇరువురూ అద్వితీయమైన



మధ్వ సంప్రదాయంలో ఉన్నవారికి ఫాల్గుణ మాసం అత్యంత విశేషమైనది. ఈ మాసంలో విష్ణుప్రీతి కోసం వ్రతాలు చేస్తారు. అంతేకాకుండా... ఈ సంప్రదాయంలోని అనేకమంది యతుల ఆరాధనోత్సవాల సమాహారం ఈ మాసం. ఉత్తరాది మఠానికి చెందిన శ్రీ సత్య బోధ తీర్థులు, శ్రీ సత్యవ్రత తీర్థులు, శ్రీ సత్య సంతుష్ట తీర్థులు, సోణ్డా మఠానికి చెందిన శ్రీ వాదిరాజ తీర్థుల ఆరాధనలు ఈ మాసంలోనే వస్తాయి. అలాగే తుంగభద్ర నదీ తీరాన వెలసిన మంత్రాలయ మహాప్రభువు శ్రీ రాఘవేంద్ర స్వామి పట్టాభిషేక, ఆరాధన ఉత్సవాలూ ఈ మాసంలోనే జరుగుతాయి.

ఉద్గ్రంథాలను రచించారు. సుప్రసిద్ధమైన కీర్తనలు రాశారు. శ్రీ వ్యాసరాజుల వారి శిష్యులే శ్రీ వాదిరాజులు. ఇక సాక్షాత్తూ శ్రీ రాఘవేంద్రులకే గురువుగా ప్రసిద్ధికెక్కినవారు శ్రీ సుధీంద్రతీర్థులు. ఆ ముగ్గురి ఆరాధన ఒకే రోజు. ఆ మహిమాన్వితులైన చరిత్రలను సంపూర్ణంగా తెలుసుకొని, మననం చేసుకోవడం ద్వారా వారి అనుగ్రహం లభిస్తుంది. తద్వారా ఆ శ్రీహరి అనుగ్రహానికి పాత్రులం కాగలం.

• మధ్వ ప్రచార పరిషత్
9440258841

సందేశం

జకాత్ అంటే

ఇస్లాంలోని సమస్త ఆరాధనల్లో నమాజ్‌కు ఎంత ప్రాధాన్యం ఉందో జకాత్‌కు కూడా అంతే ప్రాముఖ్యత ఉంది. ఈ రెండిటిలో ఏ ఒక్కదాన్ని నిరాకరించినా.. అది ఇస్లాం పట్ల అవిశ్వాసంగానే పరిగణన పొందుతుంది. వీటిలో ఒకటి లేకపోతే రెండోదానికి ఏమాత్రం విలువ ఉండదు. "విశ్వాసి అయిన ముస్లిం నమాజ్ చేస్తున్నప్పటికీ... ఏటా జకాత్ చెల్లించకపోతే ఆ నమాజ్ వల్ల అతనికి ఎలాంటి ప్రయోజనం చేకూరదు. అలాగే ఏటా జకాత్ చెల్లిస్తున్నా.. జీవితాంతం నమాజ్ చెయ్యకపోతే... అతను చేసిన జకాత్ బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. సత్యాన్ని విశ్వసించి, సదాచార సంపన్నులై నమాజ్ నిర్వహిస్తూ, జకాత్ నెరవేర్చేవారికి పరలోకంలో ఎలాంటి భయం, దుఃఖం ఉండదు" అని అంతిమ దివ్యగ్రంథమైన ఖుర్ఆన్ స్పష్టం చేస్తోంది. "విశ్వాసులు ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు. వారు ప్రజలకు మంచి విషయాలు బోధిస్తారు. చెడ్డ విషయాల నుంచి వారిస్తారు. నమాజ్ చేస్తారు. జకాత్ చెల్లిస్తారు. అల్లాహ్ పట్ల, ఆయన ప్రవక్త పట్ల వినయవిధేయతలతో మసలుకుంటారు. వారిపై దైవ కారుణ్యం వర్షిస్తుంది" అని చెబుతోంది.

జకాత్ అంటే 'పవిత్రత, పరిశుద్ధత' అనే అర్థాలు ఉన్నాయి. రంజాన్ మాసానికి సంబంధించిన పరిభాషలో చెప్పాలంటే.. ధనికుడైన వ్యక్తి పవిత్రుడయ్యే ఉద్దేశంతో ఏడాదికి ఒకసారి తన సంపద నుంచి రెండున్నర శాతం చొప్పున పేదల కోసం, ధర్మకార్యాల కోసం చేసే ధన, కనక, వస్తు రూప దానాలను 'జకాత్' అంటారు. "జకాత్ చెల్లింపును ముస్లింలకు అల్లాహ్ విధిగా నిర్దేశించాడు. దీన్ని ధనికుల నుంచి వసూలు చేసి, నిరుపేదలకు అందజేయడం జరుగుతుంది" అని హదీస్ గ్రంథం పేర్కొంది. దివ్య ఖుర్ఆన్, హదీస్ గ్రంథాల ప్రకారం... జకాత్ పేద ప్రజల హక్కు అని స్పష్టంగా తెలుస్తోంది. ఇస్లాం సౌధానికి ఉండే అయిదు మూల స్తంభాలలో.. విశ్వాస ప్రకటన, నమాజ్ తరువాత మూడో స్తంభంగా జకాత్ పరిగణన పొందుతోంది. దివ్య ఖుర్ఆన్‌లో కనీసం 32 చోట్ల హదీస్ ప్రస్తావన ఉంది. ఇది కూడా జకాత్‌కు ఎంత ప్రాముఖ్యత ఉందో తెలియజేస్తోంది. జకాత్ చెల్లించనివారు ఋజు మార్గాన్ని (సక్రమమైన మార్గాన్ని) పొందలేరనీ, ఒక వేళ పొందినా అందులో స్థిరంగా ఉండలేరనీ కూడా ఖుర్ఆన్ బోధనలు చెబుతున్నాయి. జకాత్ చెల్లించని ముస్లింలపై ఖలీఫా హజ్రత్ అబూబకర్ యుద్ధానికి సిద్ధమయ్యారు. దీన్నిబట్టి జకాత్ ఎంత ముఖ్యమైన కార్యమో తెలుస్తోంది. సంపద నుంచి జకాత్ తియ్యకుండా... అందులోనే కలిపి ఉంచితే... అది ఆ సంపదను నాశనం చేస్తుందని దైవ ప్రవక్త మహమ్మద్ హెచ్చరించారు.

• మహమ్మద్ వహీదుద్దీన్



నోరు మంచిదైతే...

సద్బోధ



లోకంలో మంచీ ఉంటుంది, చెడూ ఉంటుంది. వ్యక్తుల బుద్ధిని బట్టి, మనసును బట్టి ఈ తాతరమ్యాలు. మా అమ్మమ్మ అంటూ ఉండేది... "కొందరిని చూస్తే కొట్ట బుద్ధవుతుంది, ఇంకొందరిని చూస్తే పెట్ట బుద్ధి అవుతుంది" అని. ఎందుకంటే.. కొందరు మాట్లాడితే హాయిగా ఉంటుంది. వారి మాటల్లో సౌహార్దం, సౌజన్యం, తీయదనం మనల్ని కదలనివ్వవు. ఎంతసేపైనా వినాలనిపిస్తుంది. ఇంకొందరు మాట్లాడితే నిప్పుల కొలిమి దగ్గర నిలబడ్డట్టు ఉంటుంది. సెగలూ, పొగలూ చిమ్ముతూ ఉంటాయి. మనసుకు ఖేదం కలిగిస్తాయి. వారి మాటల్లో ఆత్మస్తుతి, పరనింద తప్ప ఇంకేవీ ఉండవు. అలాంటివారికి దూరంగా ఉండాలి. 'చెడు వినకు, చెడు మాట్లాడకు, చెడు చేయకు' అన్నారు కదా పెద్దలు!

ఈ విషయంలో భారతం ఏం చెబుతోందో తెలుసా? ఎవడు మనస్సును, వాక్కును కట్టడి చేసుకుంటూ రక్షించుకుంటాడో... అతని అరచేతిలో సంతోషం, స్వర్గం ఉంటాయి. ఎదుటి వ్యక్తి మీద తిట్లతో దుమ్మెత్తి పోయగానే సంబరం కాదు. తిట్లు పడినవాడి పాపాలన్నీ తిట్టిన వాణ్ణి చేరుతాయి. కాబట్టి శత్రుత్వం సకారణమైనా, అకారణమైనా మాటల్లో విషం చిమ్మకూడదు. మాటలతో మలమల మాడ్చేయకూడదు. ఎదుటివాళ్ళు చెప్పింది మనకు నచ్చకపోవచ్చు. అందులో తప్పేం లేదు. "నువ్వు చెప్పింది సుతరామూ నాకు ఇష్టం లేదు" అనే స్వేచ్ఛ మనకు ఎప్పుడూ ఉంది. అలాకాకుండా నచ్చని మాట, గిట్టని మాట చెవిన పడగానే గంగవెర్రులెత్తుతూ, అసలు విషయం విడిచిపెట్టి... వ్యక్తిగత దూషణలకు దిగజారడం సబబు కాదు. ఒకరిని తిట్టి, తూలనాడి, నిందించి, పదిమందిలో పరిహారం చేసి... వాళ్ళ పాపాలను మనం ఎందుకు కొనితెచ్చుకోవాలి? దుష్టుడు, దుర్మార్గుడు, కోపిష్టి, నోటిని అదుపులో పెట్టుకోలేనివాడు పొరపాటున ఎప్పుడైనా ఒకటి రెండు సత్కార్యాలు చేసి ఉంటే... వాటిని యముడు అపహరించుకుపోతాడట.

మనిషికి మాట గొప్ప వరం. పలుకకపోవడం కన్నా పలకడం మేలు. కానీ పలికే మాట చల్లగా, కర్పూర చందనంలా ఉండాలి. సత్యమై ఉండాలి. ధర్మం తప్పకుండా, సర్వజన ప్రియంగా మాట్లాడాలి. దాన్ని 'వాఙ్మయ తపస్సు' అంది మహా భారతం. మంచి మాట మన దగ్గర ఉంటే... మరో తోడు కోసం చూడాల్సిన పని లేదు. మన మంచి మాటే పదిమందిని మన చుట్టూ చేరుస్తుంది. అదే మాట గండ్రగొడ్డలిలా మనిషిని నిట్టనిలువుగా చీల్చేలా ఉందనుకోండి... మన బతుకు ఎడారే! ఒంటరిగా ఏడవాల్సిందే. మనసులో ముళ్ళ కంపలు పేర్చుకొని... కనబడినవాడినల్లా నిందిస్తు, నొప్పించడమే పరమావధిగా పెట్టుకున్న వాళ్ళ దగ్గరకు ఎవరు పోతారు? కొరివితే ఎవరు తల గోక్కుంటారు?

ఒక ఆసామి వేరే ఊరు పొలిమేరలో నిలబడి "ఈ ఊరు మంచిదేనా?" అని దారిన పోయే దానయ్యను అడిగాడు. దానికి సమాధానంగా "నీ నోరు మంచిదేనా?" అని దానయ్య ఎదురడిగాడు. అలాగే 'నోరా! వీపుకి తేకే' అనే సామెత కూడా ఉంది. కాబట్టి నోరుంది కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడకూడదని మహా భారతం హెచ్చరిస్తోంది. ఎవరైతే మాటలతో, చేతలతో ఇతరులను నొప్పించకుండా ఉంటారో... వాళ్ళు ఉత్తములు. అందరూ నోటితో మాట్లాడతారు. కొందరే మనస్సుతో మాట్లాడతారు. వాళ్ళు ఉత్తమోత్తములు. మహామనీషులు.

• ప్రయాగ రామకృష్ణ

విద్యే మహా సంపద

హర్తుర్యాతి న గోచరం కిమపి శం పుష్ణాతి యత్సర్వదా
వ్యర్థిభ్యః ప్రతిపాద్యమాన మనిశం ప్రాప్నోతి వృద్ధిం పరామ్
కల్పాంతేష్వపి న ప్రయాతి నిధనం విద్యాఖ్యమంతర్ధనం
యేషాం తాన్ప్రతిమానముజ్ఝత నృపాః కస్తైః సహ స్పర్ధతే...

అంటూ పండితుల గొప్పతనాన్ని భర్తృహరి తన 'నీతి శతకం'లో వర్ణించాడు.

దాన్ని ఏనుగు లక్ష్మణకవి...

హర్తకు గాదు గోచర మహర్నిశమున్ సుఖపుష్టి సేయు న
ర్థీ ర్థిఘటించు విద్యయను దివ్యధనం బఖిలార్థ కోటికిం
బూర్తిగ నిచ్చినంబెరుంగు బోదు యుగాంతపు వేళనైన భూ
భర్తలు తద్ధనాధికుల పట్టున గర్వము మాను టొప్పగున్... అని

తెలుగులోకి అనువదించారు.

భావం: విద్య అనేది గొప్ప ధనం. అది మహా సంపద. దాన్ని దోచుకోవడం దొంగలకు సాధ్యం కాదు. విద్య వల్ల ఎల్లప్పుడూ సుఖం కలుగుతూ ఉంటుంది. దాన్ని ఇతరులకు పంచి ఇచ్చిన కొద్దీ పెరుగుతూ ఉంటుంది. ప్రళయకాలంలో కూడా అది నశించదు. అంత గొప్పదైన విద్యను కలిగి ఉన్న పండితుల పట్ల ఎంతటి సంపన్నులైనా గర్వాన్ని ప్రదర్శించకూడదు. పండితులను వినయంతో గౌరవించాలి, ఆదరించాలి.

సుభాషితం



ఉన్నది ఒక్కటే...

కర్ణుడు, అర్జునుడు... వీరిద్దరూ కుంతీదేవి కుమారులే. కానీ ప్రత్యర్థులుగా వేర్వేరు పక్షాల తరఫున పోరాడారు. కర్ణుడు శాపగ్రస్తుడు. ఆ శాపాల కారణంగా... అర్జునుడితో కీలకమైన యుద్ధం చేస్తున్న సమయంలో... కర్ణుడికి ఉన్న కౌశలం, అనుభవం అతణ్ణి కాపాడలేకపోయాయి. యుద్ధంలో ఓడిపోయాడు, మరణించాడు. ఈ పరిస్థితి మనందరికీ వర్తిస్తుంది. ఎందుకంటే మనం దరం కర్ణుడిలాంటి వాళ్ళమే. జీవితంలో మనం ఎన్నో నేర్చుకుంటాం, విజ్ఞానాన్నీ, అనుభవాన్నీ సంపాదిస్తాం. కానీ కీలకమైన సందర్భాల్లో... మన సహజ ప్రవృత్తికి అనుగుణంగా ఆలోచించి, వ్యవహరిస్తాం తప్ప, మన అవగాహనకు లేదా జ్ఞానానికి అనుగుణంగా కాదు. ఎందుకంటే, మన జ్ఞానం లోతు... మనకు అవసరమైన స్థాయి కన్నా తక్కువగా ఉంటుంది. దీన్ని సూచిస్తూ... 'భగవద్గీత'లో వాస్తవం, సత్యం గురించి అనేక కోణాల్లో శ్రీకృష్ణుడు పదేపదే వివరించాడు. మనలో అంతరాత్మ, బహిర్ ఆత్మ ఉంటాయనీ, అవి ఒకే నదికి రెండు తీరాల్లాంటివనీ భగవద్గీత చెబుతోంది. సత్యాన్ని గ్రహించి... అన్ని జీవులలోనూ ఉన్నది, శాశ్వతమైనదీ, ఎలాంటి మార్పూ లేనిదీ అయిన అంతరాత్మను నేనేనని తెలుసుకోవాలని శ్రీకృష్ణుడు తెలిపాడు. అంతరాత్మను... అంటే ఆవలి తీరాన్ని చేరిన తరువాత మాత్రమే... 'ఉన్నది ఒక్కటే తీరం' అనే జ్ఞానోదయం కలుగుతుంది. వంద పుస్తకాలు చదవడం కన్నా భగవద్గీతలోను... ముఖ్యంగా రెండో అధ్యాయాన్ని... అనేకసార్లు చదవడం ఉత్తమమంటారు పెద్దలు.. చదివిన ప్రతిసారీ భగవద్గీత ఒక భిన్నమైన అవగాహనను అందిస్తుంది. మనలో వివేచనను కలిగిస్తుంది. అప్పుడు 'నేను' అనే భావన క్రమంగా తొలగి, ఆనందం వెల్లివిరుస్తుంది.

గీతాసారం





కె. శివప్రసాద్
ఐఎఎస్

దైవాన్ని మెప్పించే గుణం

ఎవరికైనా ఆపత్కాలంలో చేసే సాయం, దానం... ఇవి మనం దాచుకొనే నిధులు. మనకు అవసరమైనప్పుడు సాయపడడానికి అవి సదా సిద్ధంగా ఉంటాయి. మనిషికి ఉండాల్సిన గొప్ప గుణం దానం. మంచి మనసుతో తలపెట్టే దానాన్ని చూసి దేవుడు తప్పకుండా దీవిస్తాడనీ, బీదల పట్ల ఎంత దయగా ప్రవర్తిస్తే... అంతటి దయ దేవుని నుంచి లభించగలదని బైబిల్ వాక్యాలు చెబుతున్నాయి. దానం అంటే కేవలం డబ్బే కానక్కరలేదు. చింతలో ఉన్న వారికి ఓదార్పు, చావు బతుకుల్లో ఉన్నవారికి రక్త దానం, ఆకలితో ఉన్నవారికి అన్నదానం... ఇవన్నీ దేవుని అనుగ్రహాన్ని కలిగించేవే. అలాగే అజ్ఞానంతో ఉన్నవారిని మంచి మార్గంలో నడిపించే మాట సాయం కూడా దేవుణ్ణి మెప్పిస్తుంది.

దానగుణం ఉన్నవారే భాగ్యవంతులని చాటిచెప్పిన కథ ఒకటి బైబిల్‌లో ఉంది. ఒక పేద వృద్ధురాలు తన చెంగు ముడికి కట్టిన కాసును విప్పి, కానుకల పెట్టెలో వేయడం ఏసు క్రీస్తు గమనించాడు. ఆమెను అభినందిస్తూ "ఇక్కడ ఉన్న ఎందరో ధనవంతుల కన్నా ఈమె మహా భాగ్యవంతురాలు. తనకు ఉన్నదాన్లోంచే దేవునికి ఇష్టపూర్వకంగా కానుక సమర్పించింది" అని అందరికీ చెబుతాడు. ఈ లోకానికి తన ఉపదేశాలతో మార్గాన్ని చూపిన ఏసు క్రీస్తు.... తన ప్రాణాలనే ఈ లోకానికి దానంగా సమర్పించాడు. భక్తిగా ఇచ్చేది ఏదైనా దేవుడు స్వీకరిస్తాడు. అయితే ఆపన్నులకు చేసే దానాన్ని అంతకన్నా ఇష్టపడతాడు. రాబోయే గుడ్‌ఫ్రైడే వరకూ.. ప్రస్తుతం క్రైస్తవులు పాటిస్తున్న శ్రమదీక్ష ఉపవాసాలతో పాటు... దానం చేయడం, సత్ప్రవర్తనతో మెలగడం దైవ కృపకు మరింతగా పాత్రుల్ని చేస్తుంది.

దైవమార్గం



• డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు, 9866755024

5,472 చీరలు సీజ్

- బాక్సులపై సీఎం జగన్ బొమ్మ
- ఓటర్లకు పంచేందుకు సత్తెనపల్లిలో దాచిన అధికార పార్టీ నేతలు!


అధికారులు స్వాధీనం చేసుకున్న చీరల బాక్సులు

సత్తెనపల్లి, మార్చి 21: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఎన్నికల అధికారులు భారీగా చీరలు సీజ్ చేశారు. గురువారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సత్తెనపల్లి పారిశ్రామికవాడలోని ఒక గోదాంలో తనిఖీలు నిర్వహించి 114 బాక్సులలో ఉన్న 5,472 చీరలను స్వాధీనం చేసుకున్నారు. మహిళా ఓటర్లకు పంపిణీ చేసేందుకు పెరుమళ్ల గోపాల్ గోదాంలో వైసీపీ నేతలు చీరలు నిల్వ చేశారనే సమాచారం అందడంతో నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి నరసింహారావు, వీఆర్ఓలు, పోలీసులు గోదాం వద్దకు చేరుకున్నారు. గోదాంకు తాళాలు వేసి ఉండడంతో గోదాం నిర్వాహకులకు ఫోన్ చేశారు. ఫోన్ స్విచాఫ్ రావడంతో తాళాలు పగులగొట్టి గోదాంలోకి వెళ్లారు. గోదాంలో 114 బాక్సులలో 5,472 చీరలు ఉన్నట్లు గుర్తించారు. బాక్సులన్నింటిపై సీఎం జగన్ ఫొటోలు ముద్రించి ఉన్నాయి. సరుకును సీజ్ చేసి పట్టణ పోలీసుస్టేషన్ తరలించారు. ఈ సమయంలో సౌందర్య సిల్క్ యజమాని, వైసీపీ నాయకుడు భవిరిశెట్టి సుబ్రహ్మణ్యం చీరలు తనవే అంటూ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారికి తెలిపారు. గోదాంను 3 రోజుల క్రితం లీజుకు తీసుకున్నామని, అగ్రిమెంటు పత్రాలు లేవని తెలిపారు. లోపల ఉన్న చీరల స్టాక్ వివరాలు ఆయన చెప్పలేకపోయారు. మొత్తం రూ.33లక్షల విలువైన స్టాక్ తీసుకువచ్చినట్లు తెలిపారు. దీనిపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

జగన్ బొమ్మతో ఉన్న వాచీలు స్వాధీనం

- కర్ణాటకలోని బాగేపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీలు



బాగేపల్లి/హిందూపురం, మార్చి 21: కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి చెక్‌పోస్టు వద్ద సీఎం జగన్ బొమ్మతో ఉన్న వాచీలు పట్టుబడ్డాయి. పోలీసు అధికారులు బుధవారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా అనంతపురం నుంచి బెంగళూరుకు వెళుతున్న కారులో వాచీలు బయటపడ్డాయి. జగన్ బొమ్మ, ఫ్యాన్ గుర్తుతో ఉన్న వాచీలను ఎన్నికల్లో ఓటర్లకు పంచేందుకు తీసుకువెళుతున్నట్లు గుర్తించారు. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గానికి చెందిన పలువురు బెంగళూరులో వలస కార్మికులుగా జీవిస్తున్నారు. వారికి పంచేందుకే వాచీలను తీసుకువెళుతున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించి శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కారు డ్రైవర్ బండి నాగేంద్ర, ఆమె భర్త, విద్యాశాఖ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి గన్‌మన్ బెస్త నాగేంద్రపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న 96 వాచీల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని చెప్పారు.

ఎమ్మెల్యే శ్రీదేవి కోడ్ ఉల్లంఘన!.. ఈసీ నోటీసులు


సీఎం సహాయ నిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ, మార్చి 21: కర్నూలు జిల్లా పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి 22మందికి బుధవారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ ఫొటోలు వైసీపీ సోషల్ మీడియా గ్రూపుల్లో, వాట్సప్ గ్రూపుల్లో హల్‌చల్ చేశాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఎమ్మెల్యే శ్రీదేవికి పత్తికొండ రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి గురువారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. కోడ్ ఉల్లంఘనపై 24గంటల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఈ నోటీసును రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే శ్రీదేవికి అందజేశారు.

ఎన్నికల్లో డబ్బులిస్తే తీసుకోండి: మంత్రి ధర్మాన

శ్రీకాకుళం క్రైం, మార్చి 21: ఓటుకు డబ్బులిస్తే తీసుకోండంటూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గురువారం శ్రీకాకుళంలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో సొంత పార్టీ నాయకులకే మళ్లీ కండువాలు కప్పి పార్టీలో చేరికల పేరిట హడావుడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'ఎన్నికలు వచ్చినప్పుడు డబ్బు ఖర్చుపెట్టి రాజ్యాధికారం పొందడానికి చూస్తారు. డబ్బులు తీసుకోండి. ఆశపెడితే ఏవైనా అందుకోవాలి. మన లక్ష్యం దిశగా నడిచి మన జీవితాలు బాగుచేసుకోవడానికి పునాదులు వేసుకోవాలి' అని అన్నారు.

మంత్రి దాడిశెట్టి రాజా వాహనాలు సీజ్


దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో మంత్రి దాడిశెట్టి రాజాకు చెందిన వాహనాలు

కూర్మన్నపాలెం (విశాఖపట్నం), మార్చి 21: ఎన్నికల నేపథ్యంలో అగనంపూడి టోల్ గేటు వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద గురువారం మంత్రి దాడిశెట్టి రాజాకు చెందిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కోడ్‌కు విరుద్ధంగా వాహనాల ముందు, వెనుక సీఎం జగన్ చిత్రంతోపాటు 'సిద్ధం' పోస్టర్, దాడిశెట్టి రాజా, ఫ్యాన్ గుర్తుతో కూడిన ఫ్లెక్సీ ఉన్నాయి. దీంతో వాహనాలను ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ సీజ్ చేసి దువ్వాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సీఎంసీవో లేఖల జారీపై స్పష్టత ఇవ్వండి

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సీఎంసీవో రిఫరల్ లేఖలపై ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో కదలిక వచ్చింది. పేద ప్రజలకు ఉపయోగపడే ఈ లేఖలను రెండు రోజుల నుంచి ట్రస్ట్ అధికారులు నిలిపివేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని 'రోగులతో చెలగాటం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' గురువారం వెలుగులోకి తేవడంతో కళ్లు తెరిచిన ట్రస్ట్ అధికారులు... ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాలని నిర్ణయించారు. సీఎంసీవో రిఫరల్ లేఖలు జారీ చేయాలో, లేదో స్పష్టత ఇవ్వాలని కోరుతూ గురువారం మధ్యాహ్నం ఈసీకి లేఖ రాశారు. ఈసీ వెంటనే స్పందించి, లేఖల జారీకి అనుమతిస్తే పేద రోగులకు ఇబ్బందులు తప్పుతాయి.

ఎన్నికల వేళ..

ఇంత అలక్ష్యమా?

- 3 జిల్లాల ఎస్పీలపై సీఈవో ఆగ్రహం
- హత్యలు, హింసపై వివరణ కోరిన వైనం
- మీనా ఎదుట హాజరైన నంద్యాల, ప్రకాశం, పల్నాడు ఎస్పీలు
- శాంతిభద్రతల అదనపు డీజీ బాగ్చీ కూడా..
- హింస జరగకూడదని స్పష్టంగా చెప్పాం
- అన్ని పార్టీలతో మాట్లాడాలన్నాం: సీఈవో



సీఈవో ఎదుట హాజరై వస్తున్న ఎస్పీలు రఘువీరా రెడ్డి, రవిశంకర్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముంగిట.. ఓపక్క ఎన్నికల కోడ్ అమలులో ఉండగా, శాంతిభద్రతలను ఎందుకు అలక్ష్యం చేశారని మూడు జిల్లాల ఎస్పీలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా ప్రశ్నించారు. ఏకంగా హత్యలు జరిగే వరకు పరిణామాలు దారి తీయడంపై వివరణ అడిగారు. నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో ఇటీవల జరిగిన రాజకీయ హింసాత్మక ఘటనలపై తన ఎదుట వ్యక్తిగతంగా హాజరవ్వాలన్న ఆయన ఆదేశాల మేరకు ఆయా జిల్లాల ఎస్పీలు రఘువీరారెడ్డి, పరమేశ్వరరెడ్డి, రవిశంకర్‌రెడ్డి గురువారం సాయంత్రం 4గంటలకు అమరావతి సచివాలయానికి వచ్చారు. సీఈవోను కలిసి వివరణలు, నివేదికలు ఇచ్చారు. వీరితో పాటు శాంతిభద్రతల అదనపు డీజీ శంకబ్రత బాగ్చీ సీఈవోను కలిశారు. ముగ్గురు ఎస్పీలను మీనా విడివిడిగా పిలిచి మాట్లాడారు. దాదాపు 75 నిమిషాల పాటు భేటీలు జరిగాయి. మాచర్ల చాలాకాలంగా సమస్యాత్మకంగా ఉండగా, శాంతిభద్రతలను ఎందుకు నియంత్రించలేకపోయారని పల్నాడు ఎస్పీని సీఈవో ప్రశ్నించినట్లు సమాచారం. నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో హత్యల వరకు జరిగే వరకు పరిస్థితులు దిగజారడంపై ఎస్పీల వివరణ తీసుకున్నారు. కోడ్ అమలులో ఉన్నందున శాంతిభద్రతల విషయంపై నేరుగా కేంద్ర ఎన్నికల సంఘం నిఘా పెట్టిందని చెప్పారు. ఎస్పీల వివరణలను ఈసీకి పంపుతామని చెప్పారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రకాశం జిల్లా గిద్దలూరులో హత్య రాజకీయ ప్రేరేపితమేనని ప్రాథమిక నివేదిక వచ్చినట్లు వెల్లడించారు. నంద్యాల జిల్లా చాగలమర్రి ఘటనలో రాజకీయ కారణాలు లేవని, కేవలం కుటుంబ కక్షలే కారణమని రిపోర్టులో ఉందన్నారు. పల్నాడు జిల్లా మాచర్లలో కారు దహనం కేసులో ఒక నిందితుడిని గుర్తించామని, గురువారం రాత్రికే అరెస్టు చేస్తామని ఎస్పీ చెప్పారని వివరించారు. 'మూడు జిల్లాల్లో జరిగిన ఘటనలపై ఎస్పీల వివరణ తీసుకున్నాం. వీటిని కేంద్ర ఎన్నికల సంఘానికి ఈ రోజే పంపుతున్నాం. ఎన్నికల కోడ్ వచ్చాక రాజకీయ హింస జరగడంపై ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీలో జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటోంది. హింసాత్మక ఘటనలు జరగకూడదని ఎస్పీలకు స్పష్టంగా చెప్పాం. రాజకీయ హింసను నిరోధించేందుకు అన్ని పార్టీల నేతలతో మాట్లాడాలని సూచించాం' అని చెప్పారు. రాయచోటిలో నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' కార్యక్రమంలో నగదు పంపిణీ చేయడంపై ఫిర్యాదు వచ్చిందని, కోడ్ అమల్లో ఉన్నప్పుడు పరామర్శలు చేసుకోవచ్చని, కానీ నగదు పంపిణీ చేయరాదని చెప్పారు. దీనిపై కలెక్టర్‌ను నివేదికలు కోరామని తెలిపారు.

ప్రధాని సభలో భద్రతా వైఫల్యంపై విచారణకు ఈసీ ఆదేశం

చిలకలూరిపేటలో ప్రధాని మోదీ పాల్గొన్న 'ప్రజాగళం' సభలో భద్రతా వైఫల్యంపై ఈసీఐ విచారణకు ఆదేశించినట్లు సీఈవో మీనా వెల్లడించారు. ప్రధాని సభలో పోలీసుల వైఫల్యంపై టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదుపై విచారణ జరిపి, వాస్తవాలతో వెంటనే నివేదిక ఇవ్వాలని ఈసీ ఆదేశించినట్లు గురువారం అమరావతి సచివాలయంలోని తన చాంబర్లో విలేకరులకు తెలిపారు. ఈ సభలో భద్రతా వైఫల్యానికి పల్నాడు జిల్లా ఎస్పీ కూడా కారణమేనని టీడీపీ ఆరోపిస్తున్న నేపథ్యంలో విచారణాధికారిగా ఎవరిని నియమిస్తారని ప్రశ్నించగా.. ఎవరిని నియమించాలనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన బదులిచ్చారు. విచారణాధికారిని నియమించి, ప్రధాని సభలో భద్రతా వైఫల్యంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి, కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపుతామని తెలిపారు.

ఐదేళ్లు కావస్తున్నా డబ్బులివ్వరా!

- కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు
- సీఎస్‌కు 'సబ్‌కా' కాంట్రాక్టర్ల మొర

విజయవాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్యత పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకూ ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవటంతో వారు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తోందని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్(సబ్‌కా) నేతృత్వంలో కాంట్రాక్టర్ల బృందం సీఎస్ జవహర్‌రెడ్డికి గురువారం మొరపెట్టుకుంది. తక్షణం డబ్బులు విడుదల చేయాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం ఏ విధమైన చెల్లింపులూ చేయకపోవటంతో కాంట్రాక్టర్లు దివాలా తీశారని, విపత్కర పరిస్థితుల్లో పలువురు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం బిల్లులు చెల్లింపుకు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవటాన్ని సబ్‌కా నేతృత్వంలో రాష్ట్ర ఎన్నికల అధికారికి లేఖ రాశారు. గత ఐదేళ్లుగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించటం లేదని తెలిపారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న డబ్బులను కాంట్రాక్టర్లందరికీ ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ విధానంలో చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌ఐను సన్మానించిన వైసీపీ నేత

- విమర్శలు రావడంతో ఆ ఫొటో ఇప్పటిది కాదంటున్న వైనం


ఎస్‌ఐ నాగశివారెడ్డిని సన్మానిస్తున్న వైసీపీ నేత వెంకటనారాయణ

బాపట్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా బల్లికురవ ఎస్‌ఐ శివనాగిరెడ్డి వైసీపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని టీడీపీ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం పోలీస్ స్టేషన్‌లోనే వైసీపీ నేతనుంచి ఎస్‌ఐ సత్కారం అందుకున్నారు. కొమ్మినేని వారిపాలేనికి చెందిన వైసీపీ నేత పూరేటి వెంకటనారాయణ ఎస్‌ఐను శాలువాతో సన్మానించడం విమర్శలకు తావిస్తోంది. ఎస్‌ఐను సన్మానిస్తున్న ఫొటోలు వైరల్ కావడంతో పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. దీంతో ఆ ఫొటోలు ఇప్పుడు దిగినవి కావని, ఫిబ్రవరిలోవని సదరు నేత చెబుతున్నారు. మరోవైపు మద్యం అమ్మకాలు సాగిస్తున్నాడంటూ టీడీపీ సానుభూతిపరుడైన శానంపూడి హనుమంతరావు అనే వృద్ధుడిపై ఎస్‌ఐ చేయి చేసుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎస్‌ఐ దాడితో అనారోగ్యానికి గురై ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వృద్ధుడు ఎస్‌ఐపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జగన్ పాలనలో బలవంతపు మత మార్పిడిలు

- నామినేటెడ్ పదవుల కోసం ఎత్తుగడలు: జోసఫ్ మోసిగంటి

చేబ్రోలు, మార్చి 21: సీఎం జగన్ పాలనలో బలవంతపు మతమార్పిడిలు ఎక్కువయ్యాయని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్, సెయింట్ మేరిస్ మాజీ డైరెక్టర్ జోసఫ్ మోసిగంటి గురువారం ఆరోపించారు. పాస్టర్లు, క్రైస్తవులు బలవంతపు మతమార్పిడిలు చేయరని, బైబిల్ ప్రకారం బలవంతపు మతమార్పిడిలు చేయకూడదని, మత ప్రచారం మాత్రమే చేయాలన్నారు. రాజకీయ క్రైస్తవ నామినేటెడ్ పదవుల కోసం బలవంతపు మతమార్పిడిలు జరుగుతున్నాయనేది వాస్తవమన్నారు. మండల స్థాయి నుంచి, రాష్ట్ర స్థాయి వరకు మైనార్టీలకు 800 నామినేటెడ్ పదవులు ఉన్నాయని, క్రైస్తవ మైనార్టీలకు వచ్చే పదవుల్లో చాలామంది మతం మారి క్రైస్తవ కోటాలో పదవులు పొందుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 12 వేల ఎయిడెడ్ స్కూళ్లకు ఎయిడ్ నిలిపివేసారని ఆరోపించారు. పీజీ కోర్సులకు ఫీజు రియింబర్స్‌మెంట్ లేక పేద క్రైస్తవులు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవులకు జరుగుతున్న అన్యాయలపై క్రైస్తవ సమాజం ప్రశ్నించాలని జోసఫ్ మోసిగంటి పిలుపునిచ్చారు.

ఇమామ్, మౌజన్లకు జగన్ ఝలక్

- 5 నెలలుగా అందని గౌరవ వేతనాలు
- గతేడాది 3 నెలలకు బిల్లు పెట్టినా నిధులివ్వని ఆర్థికశాఖ
- ఈ ఏడాది రెండు నెలలకు బిల్లు పెట్టే అవకాశమే కల్పించలేదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి): ఇమామ్, మౌజన్లకు జగన్ సర్కారు ఝలక్ ఇచ్చింది. గత ఐదు నెలలుగా వారికి గౌరవ వేతనాలు అందలేదు. ఆరవ నెల కూడా సగంపైబడింది. ఐదు నెలలుగా గౌరవ వేతనం చెల్లించకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. రంజాన్ మాసం కూడా కావడంతో పండుగ నెలలో ఖర్చులు పెరగడంతో ఇమామ్‌లు, మౌజన్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మరో 20 రోజుల్లో పండుగ కూడా రానుంది. ఇదేనా మైనార్టీల సంక్షేమంపై జగన్ సర్కార్‌కు ఉన్న ప్రేమ అంటూ ముస్లింలు విమర్శిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదాయం తక్కువగా ఉన్న ఐదు వేల మసీదుల్లో 10 వేల మంది ఇమామ్‌లు, మౌజన్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇమామ్‌కు నెలకు రూ.15 వేలు, మౌజన్‌కు రూ.10 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. ఏ నెలకు ఆ నెల చెల్లిస్తామంటూ ప్రభుత్వం జీవో ఇచ్చినా, అది ఐదేళ్లలో సక్రమంగా అమలు కాలేదనే విమర్శలు ఉన్నాయి. 2023 అక్టోబరు నుంచి 2024 ఫిబ్రవరి వరకు 5 నెలలుగా గౌరవ వేతనాల చెల్లింపులు జరగలేదు. గతేడాది అక్టోబరు, నవంబరు, డిసెంబరు(మూడు) నెలలకుగాను ఇమామ్‌లు, మౌజన్లకు రూ.22.50కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. బిల్లు పెట్టారు కానీ, ఆర్థికశాఖ చెల్లింపులు చేయలేదు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరికి బిల్లు పెట్టే అవకాశమే కల్పించ లేదు.

వెంటనే చెల్లించాలి: ఫారుఖ్ షిబ్లీ..

ఇమామ్, మౌజన్లకు వెంటనే గౌరవ వేతనం బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారుఖ్ షిబ్లీ డిమాండ్ చేశారు. పవిత్ర రంజాన్ నెల అయినా వారి సమస్యలపై పట్టించుకునే నాథుడే లేరన్నారు.

మేమింతే.. మారేదేలే!

- వేటు వేస్తున్నా యథేచ్ఛగా వలంటీర్ల కోడ్ బ్రేక్
- వైసీపీకి ప్రచారం చేసిన 63మంది సస్పెండ్

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)


నంద్యాల జిల్లా కామగానిగుంట్లలో వైసీపీ ర్యాలీలో ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్


వేమూరులోని బలిజేపల్లిలో ప్రచారంలో వలంటీర్ ఆర్.సత్యవర్మ


అన్నమయ్య జిల్లా కలికిరిలో మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ ప్రచారంలో వలంటీర్లు

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఎన్డీయే అభ్యర్థులు, నేతలు చేస్తున్న ఫిర్యాదులు, 'ఆంధ్రజ్యోతి' కథనాలతో వలంటీర్లపై వేటు పడుతూనే ఉంది. అయినా.. ఈసీ ఆదేశాలు వలంటీర్ల చెవికెక్కడం లేదు. నంద్యాల జిల్లా డోన్ మండలం కామగానిగుంట్ల గ్రామానికి చెందిన వలంటీర్ రవికల్యాణ్ తన బైక్‌కు వైసీపీ జెండాను కట్టుకుని ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మహేశ్ వైసీపీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నాడు. బాపట్ల జిల్లా వేమూరు మండలం బలిజేపల్లి గ్రామంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్ రాయపూడి సత్యవర్మ పాల్గొన్నారు. ఇదే జిల్లా కర్లపాలెం పంచాయతీకి చెందిన వలంటీరు టీ భారతి.. తన పరిధిలోని 50 కుటుంబాల గ్రూప్‌లో వైసీపీకి అనుకూలంగా ఉన్న వీడియోను పోస్ట్ చేశారు. విజయనగరంలోని 16వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం, వైసీపీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో వలంటీర్లు గురజాపు శేఖర్, గంగి మురళీ, కుప్ప గురుమూర్తి, రాజు పాల్గొన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఇంటింటికీ వైసీపీ పేరుతో నిర్వహించిన ప్రచారంలో వలంటీర్లు మున్ని, బంగి వనజ, సుమతి, విజయకుమారి, అలేఖ్య, కప్పల విజయ, చంద్రకళ, పార్వతి, వలి, చలమల శిరీష, షేక్ షబానాజ్, ఇండ్ల అజయ్ జాసన్, సుకన్య, అన్నపూర్ణ, శబనాజ్, సుజాత, కుళ్లాయమ్మ, అబ్బాస్ పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా వైపాలెంలో వైసీపీ కార్యక్రమంలో మురికిమల్లతాండ వలంటీరు ఆర్.వెంకటేశ్వరనాయక్ ఆ పార్టీ కండువా వేసుకున్నారు.

ఉల్లంఘనలపై కొరడా

ప్రకాశం జిల్లా సింగరాయకొండలో మంత్రి సురేశ్, వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు పొన్నూరి సురేశ్, సిరిమల్లె మణికంఠ, దేపూరి శివయ్యలను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో నగేశ్ కుమారి తెలిపారు. తూర్పుగంగవరం వలంటీర్ ఎస్.గోపి, రాజుపాలెం వీవోఏ బండారు శిరీష్‌ను విధుల నుంచి తొలగించారు. శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలం తుమ్మలకుంట్లపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆదినారాయణ, నరసింహులు అనే ఇద్దరు వలంటీర్లను అధికారులు విధుల నుంచి తొలగించారు. మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కొత్తచెరువు మండల కేంద్రంలో వలంటీర్లు గోరంట్లపల్లి హర్షద్, సాయి ప్రకాశ్‌ను విధుల నుంచి తొలగించామని ఇన్‌చార్జి ఎంపీడీఓ సిద్దారెడ్డి గురువారం తెలిపారు. రాజమహేంద్రవరంలో ఎంపీ భరత్‌రామ్ ఈ నెల 19న నిర్వహించిన రహస్య సమావేశంలో పాల్గొన్న 23 మంది వలంటీర్లను గురువారం సస్పెండ్ చేశారు. ఇదే ఘటనలో రేషన్ డీలర్‌ను కూడా సస్పెండ్ చేశారు. కృష్ణా జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఏడుగురు వలంటీర్లపై వేటు వేశారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలో 11 మంది వలంటీర్లను సస్పెండ్ చేస్తూ ఎంపీడీవో పి.లక్ష్మీకాంత్ ఆదేశాలు జారీ చేశారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో 12 మంది వలంటీర్లను విధుల నుంచి తప్పించారు.


విజయనగరంలో వైసీపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో వలంటీర్లు

వైసీపీ సేవకే వలంటీరు పోస్టు అట!

- అక్కడ పనిచేయలేనంటూ టీడీపీలో చేరిక

పెనుకొండ టౌన్ 21: అధికార పార్టీవారి అరాచకాలు భరించలేక టీడీపీలో చేరినట్టు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో ఓ గ్రామ వలంటీరు వెల్లడించారు. 'డిగ్రీ వరకూ చదువుకున్నా. ఉద్యోగం రాలేదు ప్రజలకు సేవ చేద్దామని గ్రామ వలంటీరుగా చేరాను. కానీ వైసీపీ కుటుంబాలకు సేవ చేయాలని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. అందుకోసమే నాకు పోస్టు ఇచ్చారట. ఆ పని ఇష్టం లేక టీడీపీలో చేరుతున్నా. ఈ దొంగ(జగన్) అధికారం నుంచి దిగిపోవాలి..' అని వలంటీర్ శ్రీకాంత్ వాపోయారు. టీడీపీ పెనుకొండ అభ్యర్థి సవిత సమక్షంలో ఆయన టీడీపీలో చేరారు.


మృతదేహాన్ని స్టేషన్ ఆవరణలో ఉంచి ఆందోళన చేస్తున్న బాధితులు

పోలీసులు కొట్టారని రైతు ఆత్మహత్య

వెదురుకుప్పం, మార్చి 21: పోలీసులు కొట్టారన్న అవమానంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చిత్తూరు జిల్లాలోని వెదురుకుప్పంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు..మాంబేడు గ్రామ పంచాయతీ మర్రిమాకుల కండ్రిగకు చెందిన చంద్రశేఖర్(58)కి ఆయన పెద్దన్న దేశయ్యకు మధ్య భూతగాదా ఉంది. దీనిపై దేశయ్య భార్య శారద చీటికిమాటికీ పోలీసులను తీసుకొచ్చి చంద్రశేఖర్‌ను వేధింపులకు గురిచేసేది. గురువారం కూడా ఇద్దరు పోలీసులను తీసుకురాగా, వారు చంద్రశేఖర్ చొక్కా పట్టుకుని లాక్కొని పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ ఆయనను పోలీసులు కొట్టడంతో అవమానం భరించలేక స్టేషన్ బయటకు వచ్చి పురుగుల మందు తాగేశాడు. విషయం తెలిసి తాము ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు చనిపోయాడని అతడి భార్య సంపూర్ణ తెలిపారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ మృతదేహాన్ని పోలీస్‌స్టేషన్ ముందు ఉంచి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీ, సీఐలు వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌కు వచ్చి బాధితులతో చర్చలు జరిపి, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆ ఉద్యోగులను తొలగించొద్దు

- '2018 గ్రూప్-1' కేసులో హైకోర్టు ఆదేశం
- మెయిన్స్ పరీక్ష రద్దును సవాల్ చేస్తూ.. దాఖలైన అప్పీళ్లపై విచారణ 27కి వాయిదా



అమరావతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేసి, తాజాగా నిర్వహించాలని పేర్కొంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుతో ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చిన 167 మంది ఉద్యోగులకు హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. 27 వరకు వారిని ఉద్యోగాల నుంచి తొలగించవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందినవారి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు పేర్కొంది. గ్రూప్-1 వ్యవహారంతో ముడిపడి ఉన్న అన్ని అప్పీళ్లపై విచారణను 27వ తేదీకి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులోని ఏ అంశం జోలికి ధర్మాసనం వెళ్లలేదు. 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఆ ప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. డిజిటల్ మూల్యాంకనంలో 326 మంది అభ్యర్థులను ఏపీపీఎస్సీ అర్హులుగా తేల్చిందని, ఆ తర్వాత నిర్వహించిన మాన్యువల్ మూల్యాంకనంలో తొలుత ఎంపికైన 326లో.. 202 మందిని అనర్హులుగా పేర్కొన్నారని అన్నారు. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు పలు దఫాలుగా విచారణ జరిపింది. మెయిన్స్‌లో ఎంపికైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక ప్రక్రియ కొనసాగించేందుకు ఏపీపీఎస్సీకి అనుమతిస్తూ 2022 జూన్ 24న హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఫలితాల ప్రకటన, పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చినట్లైతే.. అవి ప్రధాన వ్యాజ్యాలలో కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. ప్రధాన వ్యాజ్యాలపై తుది విచారణ జరిపిన సింగిల్ జడ్జి జవాబు పత్రాలను రెండోసారి, మూడోసారి మూల్యాంకనం చేయడం నిబంధనలకు విరుద్ధమని ప్రకటించారు. గ్రూప్-1 మెయిన్స్‌లో అర్హులుగా పేర్కొంటూ 2022 మే 26న ఏపీపీఎస్సీ ఇచ్చిన జాబితాను రద్దు చేశారు. తాజాగా మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని ఏపీపీఎస్సీని ఆదేశించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ, మరికొందరు హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. ఆ అప్పీళ్లు గురువారం విచారణకు రాగా సింగిల్ జడ్జి వద్ద పిటిషనర్ల తరఫున జంధ్యాల రవిశంకర్, జె.సుధీర్ వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి తీర్పుతో తాము కూడా నష్టపోయామన్నారు. తీర్పులోని కొంతభాగాన్ని సవాల్ చేస్తూ అప్పీళ్లు వేశామన్నారు. మొదటిసారి జరిపిన మాన్యువల్ మూల్యాంకనాన్ని సింగిల్ జడ్జి రద్దు చేయడంపై అభ్యంతరం తెలిపారు. మొదటిసారి చేసిన మాన్యువల్ మూల్యాంకనం ఫలితాల ఆధారంగా అర్హులను గుర్తించాలని కోరారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధిస్తే అప్పీళ్ల విచారణలో జాప్యం జరిగే అవకాశం ఉందన్నారు. ఏపీపీఎస్సీ, పిటిషనర్లు, ఇప్పటికే ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు దాఖలు చేసిన అప్పీళ్లు అన్నింటినీ సమగ్రంగా విచారించి నిర్ణయాన్ని వెల్లడించాలని కోరారు. తాము ఎలాంటి కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేయబోమని, ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని అభ్యర్థించారు. ఏపీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై ఏపీపీఎస్సీ, పిటిషనర్లు రెండు పక్షాలు అసంతృప్తిగా ఉన్నాయన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుతో ఇప్పటికే ఉద్యోగాలు పొందిన 167 మంది అభ్యర్థులు ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. వీరికి రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఉత్తర్వులతో ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారిపై తక్షణ ప్రభావం పడుతుందని గుర్తుచేసింది. అప్పీళ్లపై విచారణను ఈ నెల 27కు వాయిదా వేస్తున్న నేపథ్యంలో వీరి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అప్పటివరకు ఉద్యోగాల నుంచి తొలగించవద్దని ఆదేశాలిస్తున్నామని పేర్కొంది.

నిధుల్లేక టెండర్లు పిలవలేదు!

- అందుకే పాతవారికి విద్యాకానుక కాంట్రాక్టు
- పాఠశాల విద్యాశాఖ అడ్డగోలు వాదన

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'టెండర్లు పిలవలేదు కానీ.. కాంట్రాక్టులో నిబంధనలు పాటించాం'... ఇదీ విద్యాకానుకపై పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన వివరణ. అసలు టెండర్లే పిలవనప్పుడు ఏ నిబంధనలు పాటించారో, పారదర్శకత ఎక్కడినుంచి వస్తుందనే ప్రశ్నలతో సంబంధం లేకుండా అంతా సక్రమమే అంటూ అడ్డగోలు వాదనకు దిగింది. 'కమీషన్ల కానుక' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై సమగ్రశిక్ష కార్యాలయం వివరణ ఇచ్చింది. 'ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో అందకపోవడం వల్ల సరఫరాదారులకు చెల్లింపులు ఆలస్యమయ్యాయి. విద్యార్థులకు బడులు తెరిచేనాటికి విద్యాకానుక అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వ స్థాయిలో లోతుగా పరిశీలించి చర్చించిన తర్వాత పాత కాంట్రాక్టర్లకు పని కేటాయించాలనే నిర్ణయం జరిగింది. గతేడాది టెండర్ల ప్రక్రియ ద్వారా ఎంపికైన కాంట్రాక్టర్లకు అప్పటి రేట్లకు మించకుండా నిబంధనలను అనుసరించి ఆర్డర్లు ఇవ్వాలని నిర్ణయించాం. ఇందులో ఎవరికీ వ్యక్తిగతంగా మేలు కలిగించలేదు. నియమ, నిబంధనల్లో అతిక్రమణ జరగకుండా ఈ చర్యలు తీసుకున్నాం" అని పేర్కొంది. అయితే సకాలంలో నిధులు ఎందుకు చెల్లించలేదో ఎక్కడా స్పష్టత ఇవ్వలేదు. ఎంత బకాయిలున్నాయో కూడా వివరించలేదు. తొలుత పాత బిల్లులు ఇవ్వని ప్రభుత్వం అనూహ్యంగా కొద్దిరోజుల కిందట రూ.300 కోట్లు విడుదల చేసింది. ఈలోగా పాత కాంట్రాక్టర్లకే పనులు కట్టబెట్టారు. ఈ బకాయిలు ముందే చెల్లించి ఉంటే టెండర్లు పిలిచే అవకాశం ఉండేది. కానీ ఉద్దేశపూర్వకంగానే బిల్లులు ఆపేసిన ప్రభుత్వం, టెండర్లు పిలవకుండా ఉండేందుకు దీనిని సాకుగా చూపినట్లు అర్థమవుతోంది. నిధుల్లేకపోవడం నిజమైతే ఇప్పుడు హడావిడిగా రూ.300కోట్లు ఎందుకు చెల్లించారో ప్రభుత్వానికే తెలియాలి. పైగా ఇందులో ఎక్కడా అక్రమాలు లేవని, అంతా 'సదుద్దేశ'మేనని పాఠశాల విద్యాశాఖ బుకాయించే ప్రయత్నం చేసింది. అంత మంచి ఉద్దేశం ఉంటే రూ.650 కోట్ల కాంట్రాక్టును అప్పనంగా ఎలా కట్టబెడతారు? నిధుల్లేవనే కారణంతో ఇకపై అన్ని కాంట్రాక్టులు ఇలాగే టెండర్లు లేకుండా అప్పగిస్తారా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి.



విశాఖలో కొకైన్ కలకలం



పట్టుబడింది కొకైనే
నిర్ధారించిన సీబీఐ



అక్కడ చెత్త... ఇక్కడ రొయ్యలకు మేత..!

కాంగ్రెస్‌ను కుప్పకూల్చే కుట్ర



నేడు టీడీపీ మూడో జాబితా



చర్చలు

అధిష్ఠానం ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా పోటీ!



రిసోజెట్‌తో అంబర్ గ్రూప్ జేవీ

హైదరాబాద్: కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, హెవీఏసీ కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ అంబర్ గ్రూప్ వాషింగ్ మెషీన్ల విభాగంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే రేడియంట్ గ్రూప్ కంపెనీ రిసోజెట్‌తో కలిసి జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీ ఏర్పాటు చేస్తోంది. ఈ జేవీలో రెండు కంపెనీలకు సమాన వాటా ఉంటుందని అంబర్ గ్రూప్ తెలిపింది. రిసోజెట్‌లో 50 శాతం వాటా కొనుగోలుకు అంబర్ గ్రూప్ రూ.35 కోట్లు వెచ్చించనుంది. అంబర్ గ్రూప్ ఇప్పటికే హీటింగ్, వెంటిలేటర్, ఏసీల తయారీ రంగంలో ఉంది.

ఏప్రిల్ 1 నుంచి కియా కార్ల ధరలు పెంపు

న్యూఢిల్లీ: కియా ఇండియా.. తన వాహన శ్రేణిలోని అన్ని మోడళ్ల ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెంచిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. కమోడిటీ ధరలతో పాటు సప్లయ్ చెయిన్ సంబంధింత ఇన్‌పుట్ వ్యయాలు పెరిగిపోవటంతో ధరలు పెంచాల్సి వచ్చిందని పేర్కొంది.

పసిడి పరుగులు

10 గ్రాములు రూ.67,450 స్థాయికి

రూ.81,000 దాటిన కిలో వెండి ధర

మరో ఆల్‌టైమ్ హైలో బంగారం ధర



న్యూఢిల్లీ: పసిడి ధర రేసు గుర్రంలా పరుగెత్తుతోంది. గురువారం 10 గ్రాముల మేలిమి బంగారం (24 కేరట్స్) రికార్డు స్థాయిలో రూ.67,450కి చేరింది. బుధవారం నాటి ధరతో పోలిస్తే ఇది రూ.1,130 ఎక్కువ. కిలో వెండి ధర కూడా రూ.1,100 లాభంతో రూ.77,750కి చేరింది. న్యూయార్క్‌లోని స్పాట్ గోల్డ్ మార్కెట్ 'కామెక్స్' లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర ఒకే రోజు 48 డాలర్లు పెరిగి 2,202 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. త్వరలోనే ఔన్స్ బంగారం ధర 2,248 డాలర్లకు పెరుగుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి.

ధరల పెరుగుదలకు కారణాలివే...

- డిసెంబరులోగా మూడు విడతలుగా వడ్డీ రేట్లు 0.75 శాతం తగ్గిస్తామని అమెరికా కేంద్ర బ్యాంక్ 'ఫెడ్ రిజర్వ్' ప్రకటించడం.
- ఫెడ్ రిజర్వ్ ప్రకటనతో ఫ్యూచర్స్ మార్కెట్లో డాలర్ల అమ్మకం
- కొన్ని దేశాల కేంద్ర బ్యాంకులు పసిడి కొనుగోళ్లకు దిగడం
- డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.83 మించిపోవడం
- స్టాక్ మార్కెట్లలో దిద్దుబాటు తప్పదనే భయాలు
- కొనసాగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు
- ఈయూ దేశాల్లో కొనసాగుతున్న ఆర్థిక అనిశ్చితి

హైదరాబాద్‌లోనూ అదే జోరు

హైదరాబాద్ బులియన్ మార్కెట్లోనూ బంగారం, వెండి ధరలు చుక్కలంటాయి. 10 గ్రాముల మేలిమి బంగారం గురువారం రూ.1,080 లాభంతో రూ.67,420కి చేరింది. పది గ్రాముల 22 కేరట్స్ పసిడి ధర రూ.990 లాభంతో రూ.61,800కు చేరింది. కిలో వెండి ధరా రూ.1,500 పెరిగి రూ.81,500కు చేరింది.

టీ హబ్‌తో వెంచర్‌బ్లిక్ ఒప్పందం

హైదరాబాద్: ఆరోగ్య సంరక్షణ రంగానికి విప్లవాత్మకమైన సొల్యూషన్లు అందించే లక్ష్యంతో హెల్త్‌కేర్ ఇన్నోవేషన్ రంగంలోని వెంచర్‌బ్లిక్ కంపెనీ.. టెక్నాలజీ ఇంక్యుబేటర్ టీ-హబ్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఉభయ సంస్థలు ఒక ఉమ్మడి ప్రకటనలో ఈ విషయం ప్రకటించాయి. వెంచర్ బ్లిక్ దక్షిణాసియా విభాగం హెడ్ డాక్టర్ కైలాస్ జైల్‌దాసానీ, వ్యవస్థాపక సీఈఓ క్రిస్ లీ, తెలంగాణ ప్రభుత్వ ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హెల్త్‌కేర్ స్టార్టప్‌ల మధ్య ఇన్నోవేషన్, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం, వాటికి డిస్ట్రిబ్యూషన్, మార్కెటింగ్ మద్దతు అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యమని కంపెనీ పేర్కొంది.

తెలంగాణలో ష్నైడర్ ప్లాంట్

బెంగళూరు: ఎనర్జీ మేనేజ్‌మెంట్ సర్వీసుల రంగంలోని ష్నైడర్ ఎలక్ట్రిక్ దేశంలోని విభిన్న రాష్ట్రాల్లో కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేసే ప్రయత్నంలో ఉంది. వాటిలో ఒక ప్లాంట్ తెలంగాణలో కూడా ఏర్పాటు కానుంది. గురువారం బెంగళూరులో డేటా సెంటర్లకు శీతలీకరణ పరికరాలను అందించే ప్లాంట్ ప్రారంభించిన సందర్భంగా కంపెనీ ఎండీ, సీఈఓ దీపక్ శర్మ ఈ విషయం ప్రకటించారు. బెంగళూరు ప్లాంట్‌పై రూ.100 కోట్లు ఇన్వెస్ట్ చేశామని, 2026 నాటికి వివిధ రాష్ట్రాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు రూ.3,200 కోట్ల పెట్టుబడి ప్రణాళికలో ఇది భాగమని ఆయన చెప్పారు. ష్నైడర్ గ్రూప్‌నకు భారత్‌ను తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడం తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రస్తుతం తమకు తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా 30 తయారీ ప్లాంట్లున్నాయని ఆయన చెప్పారు. 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన బెంగళూరు ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే ఉత్పత్తుల్లో 85 శాతం ఎగుమతి చేయనున్నట్టు శర్మ తెలిపారు. దేశ విదేశాల్లోని డేటా సెంటర్లు, టెలికాం, కమర్షియల్, పారిశ్రామిక విభాగాలకు అవసరమైన ప్రత్యేక అప్లికేషన్లను ఈ ఫ్యాక్టరీ అందిస్తుందని ఆయన చెప్పారు.

ఎన్ఎండీసీ ఇనుప ఖనిజం ధరలు తగ్గింపు

హైదరాబాద్: ఇనుప ఖనిజం, ఫైన్స్ ధరలు టన్నుకు రూ.200 నుంచి రూ.250 మేరకు తగ్గిస్తున్నట్టు ఎన్ఎండీసీ ప్రకటించింది. దీని ప్రకారం టన్ను ఇనుప ఖనిజం ధర రూ.5,800కి తగ్గితే ఫైన్స్ ధర టన్ను రూ.5,060కి తగ్గుతుంది. గురువారం నుంచే ఈ కొత్త ధరలు అమలులోకి వచ్చినట్టు కంపెనీ తెలిపింది.

రీట్స్, ఇన్విట్స్‌కు మంచి భవిష్యత్

- 15 ఏళ్లలో ఈక్విటీ మార్కెట్ స్థాయికి..
- సెబీ చీఫ్ మాధవి పురి బుచ్



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (రీట్స్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (ఇన్విట్స్), మున్సిపల్ బాండ్స్‌కు మంచి భవిష్యత్ ఉందని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ తెలిపారు. న్యూస్18 వార్తా సంస్థ నిర్వహించిన రైజింగ్ భారత్ సదస్సులో ఆమె ఈ విషయం చెప్పారు. వచ్చే 10-15 సంవత్సరాల్లో ఈ మూడు పథకాల పెట్టుబడులు.. ఈక్విటీ మార్కెట్లతో సమాన స్థాయికి చేరుకుంటాయన్నారు. ఈ మూడు పెట్టుబడుల్లో రీట్స్‌ను తాను ఎక్కువగా అభిమానిస్తానని చెప్పారు. రీట్స్ పెట్టుబడులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఈ పెట్టుబడులపై రాబడులను ద్రవ్యోల్బణాన్ని మించి ఉండే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే చిన్న, మధ్య స్థాయి రియల్ ఎస్టేట్ కంపెనీల రీట్స్‌లో రిటైల్ మదుపరులు కూడా పాల్గొనేందుకు వీలుగా రీట్స్ కనిష్ఠ జారీని రూ.500 కోట్ల నుంచి రూ.50 కోట్లకు కుదించినట్టు మాధవి తెలిపారు. 'రీట్స్'తో చిన్న మదుపరులు కూడా రియల్ ఎస్టేట్ కంపెనీల యాజమాన్యంలో పాల్గొనే అవకాశం ఏర్పడిందన్నారు. అలాగే భారత రుణ పత్రాల (బాండ్స్) మార్కెట్‌కూ మంచి భవిష్యత్ ఉందని తెలిపారు.

28 నుంచి టీ+0 సెటిల్‌మెంట్

25 కంపెనీల షేర్లకు అనుమతి

దేశీయ క్యాపిటల్ మార్కెట్లలో మరో ప్రధాన మార్పునకు సెబీ శ్రీకారం చుడుతోంది. ఈ నెల 28 నుంచి 25 కంపెనీల షేర్లలో ప్రయోగాత్మకంగా బీటా వెర్షన్‌లో టీ+0 సెటిల్‌మెంట్‌ను ప్రవేశపెడుతోంది. దీంతో ఈ కంపెనీల షేర్ల కొనుగోలు, అమ్మకాలు, నగదు బదిలీ అదే రోజు పూర్తవుతుంది. అంటే టీ+0 సెటిల్‌మెంట్ జాబితాలోని కంపెనీల షేర్లు కొనుగోలు మదుపరుల ఖాతాలో అదే రోజు జమ అవుతాయి. ఆ షేర్లు అమ్మిన మదుపరుల ఖాతాలోనూ నగదు అదే రోజు జమ అవుతుంది. టీ+0 సెటిల్‌మెంట్‌ను సెబీ ఐచ్ఛికంగా (ఆప్షనల్) ప్రవేశపెడుతోంది. ఇవే కంపెనీల షేర్లు కొనుగోలు లేదా అమ్మకం చేయాలనుకునే మదుపరులు ప్రస్తుత టీ+1 ఆప్షన్‌ను కూడా ఎంచుకోవచ్చు. టీ+0 సెటిల్‌మెంట్‌ను ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు. ఈ ప్రయోగం విజయవంతమైతే అన్ని కంపెనీల షేర్లలో టీ+0 సెటిల్‌మెంట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

1:2 నిష్పత్తిలో బీడీఎల్ షేర్ల విభజన

హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) రూ.10 ముఖ విలువ ఉన్న తన షేర్లను రూ.5 ముఖ విలువ ఉండే రెండు షేర్లుగా విభజించాలని నిర్ణయించింది. గురువారం సమావేశమైన కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. పోస్టల్ బ్యాలెట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ ద్వారా వాటాదారుల ఆమోదంతో ఈ విభజన జరుగుతుందని కంపెనీ తెలిపింది. దీనికి తోడు ఒక్కో షేరుపై రూ.8.85 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకూ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. 2024 ఏప్రిల్ 2 నాటికి కంపెనీ రికార్డుల్లో వాటాదారులగా ఉన్న వారందరికి ఏప్రిల్ 18 నాటికి ఈ డివిడెండ్ అందుతుంది.

మార్కెట్‌కు ఫెడ్ కిక్

సెన్సెక్స్ 540 పాయింట్లు అప్

ముంబై: ఈ ఏడాది మూడు విడతలుగా వడ్డీ రేట్లు తగ్గించనున్నట్టు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ప్రకటించడం భారత్ సహా పలు గ్లోబల్ మార్కెట్లలో కొత్త ఉత్తేజం నింపింది. ఫెడ్ నిర్ణయంతో గురువారం అంతర్జాతీయ మార్కెట్లతో పాటు భారత మార్కెట్లు దూకుడును ప్రదర్శించాయి. భారత ఇన్వెస్టర్లు మెటల్, పవర్, ఎనర్జీ షేర్ల కొనుగోళ్లపై మక్కువ ప్రదర్శించారు. ఫలితంగా ఈక్విటీ సూచీలు రోజంతా లాభాల్లో ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో 781 పాయింట్ల మేరకు లాభపడిన సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 539.50 పాయింట్ల లాభంతో 72,641.19 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 172.85 పాయింట్ల లాభంతో 22,011.95 వద్ద ముగిసింది. ఈ ర్యాలీతో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.5,72,752.70 కోట్లు పెరిగి రూ.3,79,85,669.12 కోట్లకు (4.57 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

- సెన్సెక్స్ షేర్లలో ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టెక్ మహీంద్రా, ఎల్ అండ్ టీ విశేషంగా లాభపడ్డాయి. ఇంత ఉత్సాహపూరిత వాతావరణంలో కూడా భారతి ఎయిర్‌టెల్, మారుతి, ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ నష్టాల్లో ముగిశాయి.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ (2.36 శాతం), స్మాల్‌క్యాప్ (2.01 శాతం) సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. ఇతర సెక్టోరల్ సూచీలు కూడా లాభాల్లోనే క్లోజయ్యాయి.

నష్టాల్లో క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్: ఇటీవల ఐపీఓ ముగించుకున్న క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ షేర్లు గురువారం 11.18 శాతం ప్రీమియంతో రూ.795 వద్ద లిస్టయినా చివరికి స్వల్ప నష్టాలతో ముగిసింది. ఈ షేరు బీఎస్ఈలో 0.38 శాతం నష్టంతో రూ.712.30 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా ఈ షేరు 9.7 శాతం ప్రీమియంతో రూ.785 వద్ద లిస్టింగ్ అయినా చివరికి 0.27 శాతం నష్టంతో రూ.713 వద్ద ముగిసింది.

టీఏసీ షేరు ధర శ్రేణి రూ.100-106: రిస్క్ మేనేజ్‌మెంట్ సర్వీసుల రంగంలోని టీఏసీ ఇన్ఫోటెక్ లిమిటెడ్ ఇష్యూ ఈ నెల 27న ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీన ముగియనుంది. షేరు ధర శ్రేణిని రూ.100-106గా కంపెనీ ప్రకటించింది. ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ఎమర్జ్‌పై షేర్లు లిస్టింగ్ అవుతాయి.

ఎగవేతదారులుగా ప్రకటించే ముందు కారణాలు చెప్పాల్సిందే

బ్యాంకులకు బాంబే హైకోర్టు ఆదేశం

ముంబై: రుణాలు ఎగవేసే కంపెనీలు, వ్యక్తులను ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా ప్రకటించడంపై బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఏదైనా కంపెనీ లేదా వ్యక్తులను ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా ప్రకటించేటప్పుడు.. ఏ కారణం చేత వారిని ఎగవేతదారులగా ప్రకటిస్తున్నారో స్పష్టం చేయాలని కోరింది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ మాజీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మిలింద్ పటేల్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ విషయం స్పష్టం చేసింది. ఈ విషయంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థల ఆదేశాలు.. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) జారీ చేసిన మాస్టర్ సర్క్యులర్‌కు అనుగుణంగా ఉండాలని కోర్టు స్పష్టం చేసింది. ఒక వ్యక్తి లేదా సంస్థను ఉద్దేశపూర్వక ఎగవేతదారులగా ప్రకటించేటప్పుడు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ విచక్షణాధికారాన్ని జాగ్రత్తగా ఉపయోగించాలని కోరింది. జస్టిస్ కొలబావాలా, జస్టిస్ సోమశేఖర్ సుందరేశన్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయం స్పష్టం చేసింది.

ఈ ఏడాదే భారత మార్కెట్లోకి ఫోక్స్‌వ్యాగన్ ఎలక్ట్రిక్ కారు ఐడి.4

న్యూఢిల్లీ: విద్యుత్ కారు ఐడి.4ను ఈ ఏడాది ద్వితీయార్ధంలో భారత మార్కెట్లో ప్రవేశపెట్టడంతో దేశంలో తన ఎలక్ట్రిక్ కార్ల ప్రయాణాన్ని ప్రారంభించనున్నట్లు ఫోక్స్‌వ్యాగన్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ కార్లు ప్రాచుర్యంలోకి తెచ్చే ప్రయత్నాల్లో భాగంగా ఈ అడుగేసింది. గురువారం కంపెనీ ఐడి.4 కారును ఆవిష్కరించింది. ప్రపంచ మార్కెట్లో ఐడి.2 నుంచి ఐడి బజ్ వరకు వివిధ కార్లను ఫోక్స్‌వ్యాగన్ విక్రయిస్తోంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	67,420 ▲	61,800 ▲	81,500 ▲
ముంబై	66,914 ▲	61,293 ▲	75,045 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ		విజయవాడ	425
హైదరాబాద్	415	విశాఖపట్నం	435
22వ తేదీ		వరంగల్	417
చిత్తూరు	478	డజను గుడ్లు రూ.72	
గోదావరి	425		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	108	గోదావరి	106
వరంగల్	108	విజయవాడ	106
కరీంనగర్	108	గుంటూరు	107
మహబూబ్‌నగర్	108	ఒంగోలు	107
కర్నూలు	108	చిత్తూరు	98
విశాఖపట్నం	100		

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఐఐటీ ఢిల్లీలో పీజీ, పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఎంటెక్ విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- అప్లయిడ్ మెకానిక్స్: ఇంజనీరింగ్ అనాలిసిస్ అండ్ డిజైన్
- బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయో టెక్నాలజీ: బయో మాలిక్యులర్ అండ్ బయో ప్రాసెస్ ఇంజనీరింగ్
- కెమికల్ ఇంజనీరింగ్
- కెమిస్ట్రీ: మాలిక్యులర్ ఇంజనీరింగ్, కెమికల్ సింథసిస్ అండ్ అనాలిసిస్
- సివిల్ ఇంజనీరింగ్: కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, రాక్ ఇంజనీరింగ్ అండ్ అండర్ గ్రౌండ్ స్ట్రక్చర్స్, జియో టెక్నికల్ అండ్ జియో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
- ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్: కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ టెక్నాలజీ, కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఎలక్ట్రో సర్క్యూట్స్, పవర్ ఎలక్ట్రో - మెషిన్ డ్రైవ్స్, పవర్ సిస్టమ్స్
- ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, రెన్యూవబుల్ ఎనర్జీ టెక్నాలజీస్ అండ్ మేనేజ్‌మెంట్
- మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: మెటీరియల్స్ ఇంజనీరింగ్, పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- మెకానికల్ ఇంజనీరింగ్: మెకానికల్ డిజైన్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, థర్మల్ ఇంజనీరింగ్
- ఫిజిక్స్: అప్లయిడ్ ఆప్టిక్స్, సాలిడ్ స్టేట్ మెటీరియల్స్
- టెక్స్‌టైల్ అండ్ ఫైబర్ ఇంజనీరింగ్: ఫైబర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ కెమికల్ ప్రాసెసింగ్
- సీఏఆర్ఈ: రేడియో ఫ్రీక్వెన్సీ డిజైన్ అండ్ టెక్నాలజీ
- సీఏఎస్: అట్మాస్ఫిరిక్ ఓషనిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- సీబీఎంఈ: బయో మెడికల్ ఇంజనీరింగ్
- సీఏఆర్‌టీ: ఎలక్ట్రిక్ మొబిలిటీ
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్: మెషిన్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్



ఇంటర్ డిసిప్లినరీ ఎంటెక్ స్పెషలైజేషన్‌లు

- సైబర్ సెక్యూరిటీ, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ, ఆప్టో ఎలక్ట్రానిక్స్ అండ్ ఆప్టో కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ డిజైన్ టూల్స్ అండ్ టెక్నాలజీ, టెలీ కమ్యూనికేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, రోబోటిక్స్

ఇతర కోర్సులు

- ఎం డిజైన్: ఇండస్ట్రియల్ డిజైన్
- ఎమ్మెస్సీ-హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్: కాగ్నిటివ్ సైన్స్, ఎకనామిక్స్
- ఎంపీపీ: మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ
- ఎంఏ-హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్: కల్చర్, సొసైటీ, థాట్

పీహెచ్‌డీ విభాగాలు

- అప్లయిడ్ మెకానిక్స్, బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్, మేథమెటిక్స్, మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, టెక్స్‌టైల్ అండ్ ఫైబర్ ఇంజనీరింగ్
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 4
- **వెబ్‌సైట్:** iitd.ac.in

ఎంఎస్ రీసెర్చ్ స్పెషలైజేషన్‌లు

- అప్లయిడ్ మెకానిక్స్, ఆటోమోటివ్ రీసెర్చ్ అండ్ ట్రైబాలజీ, బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సెన్సర్స్-ఇన్‌స్ట్రుమెంటేషన్-సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, మెషిన్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, వీఎల్ఎస్ఐ డిజైన్ టూల్స్ అండ్ టెక్నాలజీ, ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ అండ్ ఇన్‌జ్యూరీ ప్రివెన్షన్

దిక్సూచి
DIKSUCHI

ఎండీఎన్ఐవైలో యోగ కోర్సులు

కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగ(ఎండీఎన్ఐవై)- స్వల్పకాలిక యోగ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తారు. ఏప్రిల్ 1 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

ఫౌండేషన్ కోర్స్ ఇన్ యోగ సైన్స్ ఫర్ వెల్‌నెస్

ప్రోగ్రామ్ వ్యవధి ఒక నెల. న్యూఢిల్లీలోని లజ్‌పత్ భవన్‌లో ఉదయం రెండు బ్యాచ్‌లు, సాయంత్రం రెండు బ్యాచ్‌లను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొరార్జీ దేశాయ్ సంస్థలో సాయంత్రం బ్యాచ్ ఆఫ్‌లైన్ మోడ్‌లో ఉంటుంది.

అర్హత: కనీసం 15 ఏళ్లు నిండినవారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.3000

సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగ ఫర్ ప్రొటోకాల్ ఇన్‌స్ట్రక్టర్

ప్రోగ్రామ్ వ్యవధి మూడు నెలలు. మొరార్జీ దేశాయ్ సంస్థలో ఉదయం రెండు బ్యాచ్‌లను ఆన్‌లైన్ విధానంలో; సాయంత్రం రెండు బ్యాచ్‌లను ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 30 మంది అభ్యర్థులు ఉంటారు.

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఫౌండేషన్ కోర్స్ ఇన్ యోగ సైన్స్ ఫర్ వెల్‌నెస్/ఒక నెల వ్యవధి గల తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** yogamdniy.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ofW28sYలో చదవండి.

ఏపీ కస్తూర్బా విద్యాలయాల్లో అడ్మిషన్స్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష పథకం కింద కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో మొత్తం 352 విద్యాలయాలు ఉన్నాయి. ఆరోతరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం(పదకొండో తరగతి)లో చేరేందుకు బాలికలకు ప్రవేశ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకోసం కూడా దరఖాస్తులు కోరుతున్నారు. అనాథలు, వీధి బాలలు, బడి మానేసిన పిల్లలు సహా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ వర్గాలకు చెందిన ఆడపిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: ఆరోతరగతిలో ప్రవేశానికి అయిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం(పదకొండో తరగతి) ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో ప్రవేశానికి ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు పాసై ఉండాలి. ప్రస్తుతం కేజీబీవీల్లో పదోతరగతి చదివిన బాలికలు కూడా పదకొండో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లోరూ.1,20,000; పట్టణాల్లో రూ.1,40,000 మించకూడదు.

ఎంపిక: ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. వీటిని పరిశీలించి లిస్టు రూపొందిస్తారు. ఎంపికైనవారికి ఫోన్ ద్వారా సమాచారమిస్తారు. సంబంధిత పాఠశాల నోటీస్ బోర్డులో కూడా చూడవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 11
- **ప్రిపరేషన్ ఆఫ్ సెలెక్షన్ లిస్ట్:** ఏప్రిల్ 15న
- **సెలెక్షన్‌లిస్ట్ వెరిఫికేషన్:** ఏప్రిల్ 16 నుంచి 18 వరకు
- **వెబ్‌సైట్:** apkgbv.apcfss.in

జాబ్ కార్నర్

ఎన్ఎల్‌సీలో ఇండస్ట్రియల్ ట్రైయినీలు

నైవేలీ(తమిళనాడు)లోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్.. 239 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓఅండ్ఎం): **100 పోస్టులు**
2. ఇండస్ట్రియల్ ట్రెయినీ(ఫైనాన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్): **139 పోస్టులు**

అర్హత: పదో తరగతి, ఐటీఐ, సంబంధిత ట్రేడ్‌లో డిప్లొమా

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 19

వెబ్‌సైట్: https://www.nlcindia.in

ఓరియంటల్ ఇన్సూరెన్స్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్



న్యూఢిల్లీలోని ద ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 100 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్-1)

విభాగాలు: అకౌంట్స్, యాక్చురియల్, ఇంజనీరింగ్, ఇంజనీరింగ్(ఐటీ), మెడికల్ ఆఫీసర్, లీగల్. **అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/బీడీఎస్, డిగ్రీ(లా), ఐసీఏఐ/ఐసీడబ్ల్యూఏఐ/బీకాం, ఎంబీఏ(ఫైనాన్స్), బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత.

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలు.

దరఖాస్తు రుసుము: రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.250.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: మార్చి 21 **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 12

రాత పరీక్ష: మే/జూన్‌లో.

వెబ్‌సైట్: https://orientalinsurance.org.in/



హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ఫాంటసీ అడ్వెంచర్ 'విశ్వంభర' షూటింగ్ శరవేగంతో హైదరాబాద్‌లో జరుగుతోంది. చిరంజీవి, హీరోయిన్ త్రిష తదితరులు పాల్గొనగా కొన్ని సీన్లు, ఓ పాట, యాక్షన్ బ్లాక్‌ను చిత్రీకరించారు. ఇవన్నీ సినిమాలో కీలక సన్నివేశాలు కావడం గమనార్హం. ఈ షెడ్యూల్ పూర్తయినట్లు గురువారం చిత్ర నిర్మాతలు ప్రకటించారు. అలాగే చిరంజీవి నివాసంలో సంగీత దర్శకుడు కీరవాణి, దర్శకుడు వశిష్ట, ఛాయాగ్రాహకుడు చోటా కె నాయుడు, నిర్మాతలు వంశీ, విక్రమ్ తదితరులతో కలసి ఉన్న ఫొటోలను త్రిష సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అలాగే మరో పోస్టర్‌ను నిర్మాతలు విడుదల చేశారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న 'విశ్వంభర' చిత్రాన్ని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు, వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10న ఈ సినిమా విడుదలవుతుంది.

కొత్త అనుభూతిని పంచే టిల్లు స్క్వేర్

యువతలో విపరీతమైన కల్ట్ ఫాలోయింగ్ సంపాదించుకున్న సినిమాలలో 'డీజే టిల్లు' ఒకటి. టిల్లుగా సిద్ధు జొన్నలగడ్డ పంచిన వినోదాన్ని ప్రేక్షకులు అంత తేలికగా మరిచిపోలేరు. టిల్లు మాటలు, చేష్టలు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఇప్పుడు 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' ఈ నెల 29న వస్తోంది. ఈ సందర్భంగా గురువారం చిత్ర దర్శకుడు మల్లిక్ రామ్ మీడియాతో ముచ్చటించారు.



టిల్లు స్క్వేర్ ప్రాజెక్ట్ లోకి ఎలా వచ్చారు?

డీజే టిల్లు, నేను దర్శకత్వం వహించిన 'అద్భుతం' సినిమాలు ఇంచుమించు ఒకే సమయంలో వచ్చాయి. ఆ తర్వాత నేను, సిద్ధు కలసి ఒక సినిమా చేయాలి అనుకున్నాం. అదే సమయంలో నాగవంశీ గారు 'టిల్లు స్క్వేర్' చేస్తే బాగుంటుందని చెప్పడం, డీజే టిల్లు దర్శకుడు విమల్ కృష్ణ ఇతర కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉండటంతో నేను ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చాను. మొదట కాస్త సంకోచించాను కానీ కథ బాగా వచ్చేసరికి ఇక వెనకడుగు వేయలేదు.

సినిమాలో సిద్ధు ప్రమేయం ఎంతవరకు ఉంటుంది?

సిద్ధు ఒక రచయితగా, నటుడిగా ఎంతవరకు ఇన్వాల్వ్ అవ్వాలో.. అంతవరకే ఇన్వాల్వ్ అవుతాడు. డైరెక్టర్‌కు స్వేచ్ఛను ఇస్తాడు.

టిలు స్క్వేర్ ఎలా ఉండబోతుంది?

డీజే టిల్లు, టిల్లు స్క్వేర్‌కి ఎంతో వ్యత్యాసం ఉంటుంది. డీజే టిల్లు డెడ్ బాడీ నేపథ్యంలో సాగే బ్లాక్ కామెడీ. కానీ టిల్లు స్క్వేర్ ఒక కమర్షియల్ సినిమాలా ఉంటుంది. టిల్లు పాత్ర తీరు అలాగే ఉంటుంది. రాధిక పాత్ర ప్రస్తావన ఉంటుంది. మొదటి భాగాన్ని ముడిపెడుతూ కొన్ని సన్నివేశాలు ఉంటాయి. డీజే టిల్లుని గుర్తు చేస్తూనే టిల్లుస్క్వేర్ అందరికీ కొత్త అనుభూతిని ఇస్తుంది.

అనుపమానే ఎన్నుకోవడానికి కారణం?

ఈ సినిమాలో లిల్లీ పాత్ర చాలెంజింగ్ రోల్. ఆ పాత్ర కోసం ఎందరో పేర్లను పరిశీలించాం. కానీ అనుపమానే పర్ఫెక్ట్ చాయిస్ అనిపించింది. అనుపమాని బోల్డ్‌గా చూపించాలనే ఉద్దేశంతో లిల్లీ పాత్రను రాసుకోలేదు. లిల్లీ పాత్ర తీరే అలా ఉంటుంది.

రీ షూట్‌కి వెళ్ళడానికి కారణం ఏంటి?

ఇంటర్వెల్ తర్వాత ద్వితీయార్థం ప్రారంభ సన్నివేశాలు చాలా సినిమాల్లో తేలిపోతుంటాయి. ఫస్టాఫ్ బాగుంటుంది. క్లైమాక్స్ కూడా బాగుంటుంది. కానీ ఆ 15-20 నిమిషాలు ఆశించిన స్థాయిలో ఉండదు. టిల్లుస్క్వేర్ విషయంలో అలా జరగకూడదన్న ఉద్దేశంతో.. ఆ కొన్ని సన్నివేశాలు మరింత మెరుగ్గా రాసుకొని రీ షూట్ చేశాం.

విజయవంతమైన చిత్రానికి సీక్వెల్ కదా.. ఒత్తిడికి లోనయ్యారా?

ఒత్తిడి ఉండటం సహజం. కానీ కథ బాగా రాసుకోవడంతో.. చిత్రీకరణ సమయంలో పెద్దగా ఒత్తిడి అనిపించలేదు.

ఆయ్.. పాట విడుదలైందండీ!



నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటిస్తున్న 'ఆయ్' చిత్రంలోని 'సూఫియానా' అంటూ సాగే మెలోడీ సాంగ్‌ను తాజాగా విడుదల చేశారు. శ్రీమణి రాసిన పాటను భరద్వాజ్, రమ్యశ్రీ పాడారు. ప్రస్తుతం సూపర్‌హిట్ సాంగ్స్‌కు కేరాఫ్‌గా మారిన రామ్ మిర్యాల ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. అంజి కంచిపల్లి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అల్లు అరవింద్ సమర్పకులు. బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మాతలు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

కశ్మీర్ యాపిల్ కాదు.. మిర్చి



అప్సరారాణి ప్రధాన పాత్ర పోషించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'తలకోన'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో దేవర శ్రీధర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 29న సినిమా విడుదల అవుతున్న సందర్భంగా బుధవారం రాత్రి ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో నిర్మాత మాట్లాడుతూ 'మా హీరోయిన్ అప్సరా రాణి ఇంతవరకూ చేయని సినిమా ఇది. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్. అడవి అనగానే కేవలం ప్రకృతి అందాలే కాకుండా ఇంకో కోణం ఉంటుదని చూపించా' అన్నారు. 'మా హీరోయిన్ అప్సరా రాణి చూడడానికి కశ్మీర్ యాపిల్‌లా కనిపిస్తుంది కానీ ఇందులో కశ్మీర్ మిర్చిలా నటించింది. చాలా వెరైటీ స్టోరీ ఇది' అని చెప్పారు దర్శకుడు నగేశ్. ఈ సినిమాలో ఫైట్స్ కూడా చేసినట్లు అప్సరా రాణి చెప్పారు. తన కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

భూకంపం చూసి భయపడ్డా

కార్తికేయ





దర్శకుడు రాజమౌళి కుటుంబంతో కలసి ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తున్నారు. ఆ దేశం తరచూ భూకంపాల బారిన పడుతుందనే విషయం తెలిసిందే. గురువారం రాజమౌళి కుటుంబం ఉన్న స్టార్ హోటల్ పరిసరాల్లోనూ స్వల్పంగా భూమి కంపించింది. ఎవరికీ ప్రమాదం జరగలేదు. ఈ విషయాన్ని రాజమౌళి తనయుడు కార్తికేయ గురువారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. తన స్మార్ట్ వాచ్‌కు వచ్చిన భూకంపం హెచ్చరిక సందేశాన్ని షేర్ చేస్తూ 'హోటల్ భవనం కదులుతున్నట్లనిపించింది, అది భూకంపం వల్ల అని తెలుసుకొని భయపడ్డా' అని తెలిపారు. 'మహేశ్‌బాబు-రాజమౌళి సినిమా 'ఎస్ఎస్ఎంబీ 29 (వర్కింగ్ టైటిల్) ప్రభావం జపాన్‌లో ఎలా ఉండబోతోందో రిహార్సల్స్ చేస్తున్నారా' అని కార్తికేయను ఓ నెటిజన్ సరదాగా అడిగారు. ఆ సినిమా ప్రభావం జపాన్‌కే పరిమితం కాదు, ప్రపంచమంతా ఉంటుంది అని కార్తికేయ సినిమాపై మరింత అంచనాలు పెంచేలా బదులిచ్చారు.



పలాస కన్నా పెద్ద హిట్ అవ్వాలి

'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'శశివదనే'. గోదావరి నేపథ్యంలో లవ్, యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాకు సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించారు. అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించారు. ఏప్రిల్ 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సాయి మోహన్ ఉబ్బన మాట్లాడుతూ "ఇది హార్ట్ హిట్టింగ్ మూవీ. క్లైమాక్స్ ఈ సినిమాకు ప్రాణం. సినిమా ముగిశాక ప్రేక్షకులు ఎన్నో భావోద్వేగాలతో బయటికి వస్తారు" అని చెప్పారు. నిర్మాత అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ "రక్షిత్ అట్లూరి, కోమలి వారి నటనతో ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లారు" అని ప్రశంసించారు. హీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ "పలాస' కంటే 'శశివదనే' పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. అవుతుందని నమ్మకంగా ఉన్నాను" అని తెలిపారు. నిర్మాత అహితేజ మాట్లాడుతూ "ఈ సినిమాలో ప్రేక్షకులను అలరించే అన్ని అంశాలు ఉన్నాయి. కొత్త తరహా అనుభూతిని ఇచ్చే చిత్రమిది. క్లైమాక్స్ మా సినిమాకు ప్రత్యేక ఆకర్షణ" అని అన్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Sz2IoN1 లో చదవండి.

నిత్య జీవితంలో కామర్స్ ఒక భాగం

మొగల్రాజపురం: కామర్స్ అనేది నిత్య జీవితంలో ఒక భాగమని అది లేని వ్యవహారం ఉండదని వక్తలు చెప్పారు. కామర్స్ విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ఇన్‌కెండో 2024 పోటీలను పీబీ సిద్ధార్థ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, ఫ్లోర్ క్రాసింగ్, దలాల్ స్ట్రీట్, మైండ్ ఇట్, ఫైనాన్షియల్ ఎనలిస్టు, ఐపీఎల్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వాణిజ్య శాఖ అధికారి కె.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్,డైరెక్టర్ వేమూరి బాబురావు, సిద్ధార్థ అకాడమీ సభ్యుడు ఎన్. లలిత్ ప్రసాద్ పాల్గొన్నారు. సాయంత్రం బహుమతులందించారు.

మృతిచెందిన ఆర్టీసీ పెన్షనర్లకు దహన ఖర్చుల కింద రూ.25వేలు

బస్టేషన్: ఆర్టీసీలో పెన్షనర్లు మరణిస్తే దహన ఖర్చుల కింద రూ.25వేలు ఇవ్వడానికి ఆర్టీసీ ఎండీ అంగీకరించడంపై ఎంప్లాయీస్ యూనియన్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చింది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే రూ. 25వేలివ్వడానికి ఎండీ ద్వారకా తిరుమలరావు అంగీకరించారని త్వరలో ఆదేశాలిస్తామని ప్రకటించారన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

24న స్టేట్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్సు: స్టార్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 24న స్థానిక నిడమానూరులోని తమ అకాడమీలో శీలం రాజయ్య మెమోరియల్ ఏపీ స్టేట్ ఓపెన్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ కేడీ గోపాలరావు తెలిపారు. మిక్స్‌డ్ సింగిల్స్ కేటగిరీలతో పాటు ఓపెన్ డబుల్స్ పోటీలు జరుగుతాయన్నారు.

రైతుల ఆర్థిక స్వావలంబనకు

ప్రైవేట్ బ్యాంకులు సహకరించాలి

● సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి

పాయకాపురం, మార్చి 21: బ్యాంకర్లు ఖా తాదారులకు శ్రద్ధతో సేవలందించాలని సాంకేతిక వి ద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగమణి అన్నారు. విశాలాంధ్ర రోడ్డులో కరూర్ వైశ్యా బ్యాంక్ 836వ బ్రాంచ్‌ను ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నాగమణి నూతన బ్రాం చ్‌ను ప్రారంభించారు. ఆంజనేయ జ్యూవెలరీ సంస్థ ప్రతినిధి వడ్లమూడి వెంకటరావు, మోడ ల్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ పిన్నమనేని ధన ప్రకాష్, బ్యాంక్ జీఎం నితిన్ ఆర్కాట్ రంగస్వామి, క్లస్టర్ హెడ్ సూర్య శ్రీరామ్టేకె, బీఎం కేవీఎల్‌వీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ వద్ద ప్రార్థన మందిరం

● తొలగించాలని అధికారుల ఆదేశం



అజిత్‌సింగ్‌నగర్, మార్చి 21: వాంబేకాలనీలో ఎన్నికల బూత్‌కు కేటాయించిన భవనం పరిధిలో ఉన్న ఓ ప్రార్థనా మందిరం ఎన్నికల ని ర్వహణకు ఆటంకంగా మారింది. పూర్తిగా వీఎంసీ స్థలం ఆక్రమించి నిర్మాణం చేపట్టిన ప్రార్థనా మందిరాన్ని ఎట్టి పరిస్థితుల్లో తొలగించాలని అధికారులు గురువారం ఆదేశాలు జారీ చేశారు. స్థానిక వాంబేకాలనీ హెచ్ బ్లాక్‌లో 262 సచివాలయం ఉంది. ఇందులో అధికారులు ఎన్నికల నిర్వహణకు 60వ నెంబరు పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. బూత్‌ల పరిశీలనలో భాగంగా గురువారం అక్కడికి వచ్చిన అధికారులు ఓ ప్రార్థన మందిరం అడ్డంగా ఉండటాన్ని గుర్తించారు. వీఎంసీ స్థలం ఆక్రమించి వేసిన పాకను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణదారులకు ఆదేశాలిచ్చారు. తాము అక్కడి నుంచి వెళ్లేది లేదంటూ పట్టుపట్టడంతో నున్న రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని పోలింగ్ బూత్ పరిధిలో ప్రైవేట్ నిర్మాణాలు ఉండకూడదని 24 గంటల్లో తొలగించాలని ఆదేశాలిచ్చారు.

30న నగరంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ

మొగల్రాజపురం, మార్చి 21: ఈస్టర్ సందర్భంగా నగరంలో క్రైస్తవ సంఘాల ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చెస్ హెడ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 30న రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు విజయవాడ కతోలిక పీఠం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ చెప్పారు. గురువారం మరనాత దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

టీడీపీ తరపున నేనే పోటీలో ఉంటా: బోడె



పెనమలూరు, మార్చి 21: నియోజకవర్గ టీడీ పీ అభ్యర్థిగా పోటీలో తానే ఉంటానని మాజీ ఎ మ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. గురువారం ఇందిరానగర్ కాల్వకట్టపై జరిగిన పాదయాత్రలో పాల్గొని బోడె మాట్లాడారు. తనకే టీడీపీ టికెట్ వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మైలవరంలో చెల్లక పెడనకు, అక్కడ కూడా చెల్లక పెనమలూరుకు విసిరేసినట్టు వలస వచ్చిన మంత్రికి నియోజకవర్గ సమస్యలు తెలుసుకునేటప్పటికే ఐదేళ్లు పూర్తయిపోతాయన్నారు. అలాగే గురువారం ఉదయం టీడీపీ పోరంకి కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో బోడె ప్రసాద్ మాట్లాడుతూ సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం అవుతున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. కొడాలి నాని, వల్లభనేని వంశీతో తనకేంపనని, సర్వస్వం కోల్పోయావని వంశీని తిట్టానన్నారు. వారిద్దరినీ శత్రువులుగానే భావిస్తానన్నారు.

ప్రయాణికుల ఫిర్యాదుల పరిష్కారానికి త్రిముఖ వ్యూహం

రైల్వేస్టేషన్, మార్చి 21: రైలు ప్రయాణికుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు త్రిముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్టు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో ప్రయాణ సమయంలో ప్రయాణికులకు సాయం కోసం రూపొందించిన మొబైల్ అప్లికేషన్ ఇతర ఫిర్యాదులపై సమీక్ష చేశారు. ఫిర్యాదుల సంఖ్యను తగ్గించేందుకు సేవలను మెరుగుపరచాలన్నారు. మౌలిక సదుపాయాల ఏడీఆర్ఎం పీ ఈ ఎడ్విన్, ఆపరేషన్స్ ఏడీఆర్ఎం ఎం.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రయాణీకుల సంతృప్తి, సమయపాలన చాలా అవసరమని పేర్కొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు కేబీఎన్ విద్యార్థి

వన్‌టౌన్, మార్చి 21: త్వరలో జరగనున్న అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు కేబీఎన్ కళాశాల విద్యార్థి పి.భరత్‌కుమార్ హాజరుకానున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. గురువారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ మే 5 నుంచి 11 వరకు హాంకాంగ్‌లో జరగనున్న ఏషియన్ వర్సిటీస్ పవర్‌లిఫ్టింగ్ కప్ చాంపియన్‌షిప్ పోటీలకు భరత్‌కుమార్ వెళ్లనున్నట్లు తెలిపారు. భరత్‌కుమార్ వెళ్లేందుకయ్యే ఖర్చు సుమారు రూ.1.50లక్షల వ్యయాన్ని కళాశాల ఖర్చు పెడుతుందని, ఆ మొత్తం నగదును చెక్కురూపంలో కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, అధ్యాపకులు కే.రామకృష్ణ, క్రీడావిభాగాధిపతి బి.హేమచంద్రారావు పాల్గొన్నారు.

వలంటీర్ల ఫోన్లను స్వాధీనం చేసుకోవాలి

● వీఎంసీకి టీడీపీ ఫ్లోర్‌లీడర్ లేఖ

చిట్టినగర్: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి వలంటీర్లు వ్యవహరిస్తున్నారని టీడీపీ ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలాస్వామి వీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈలేఖను మీడియాకు గురువారం విడుదల చేశారు. ప్రతి డివిజన్‌లో వలంటీర్లు క్లస్టర్లలో సెల్‌ఫోన్ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారని, వాటి ద్వారా ప్రజలకు ప్రభుత్వానికి అనుకూలంగా మెసేజ్‌లు పంపుతూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని తెలిపారు. అధికారులు వలంటీర్ల వద్ద ఉన్న ఫోన్లలను స్వాధీనం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. పించన్లు పంపిణీ చేసే ఒకటో తేదీన వారికి అందజేయాలని సూచించారు.

నేటి నుంచి జీఐ ఫెస్టివల్

ధర్నాచౌక్: దక్షిణ భారతదేశంలో మొదటిసారిగా విజయవాడలో కేంద్ర ప్రభుత్వం, ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో జియోగ్రాఫిక్ ఇండికేటర్ (జీఐ) ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు కేఎల్ వర్సిటీ డీన్ కే రాఘవరావు తెలిపారు. ఈ మేరకు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 22, 23, 24న స్థానిక సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజ్ గ్రౌండ్‌లో జరుగుతుందన్నారు. జీఐ ట్యాగున్న న్యాణ్యత కలిగిన వస్తువులు మాత్రమే ప్రదర్శనలో ఉంటాయన్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 70 స్టాల్స్‌లో వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ప్రదర్శన దేశవాప్తంగా 10 నగరాల్లో జరిగిందన్నారు. విదేశాల్లోని భారతీయులు జీఐ ట్యాగ్ వస్తువులనే వాడుతున్నారని మనదేశంలోనూ వీటి ప్రాధాన్యత తెలుసుకోవాలన్నారు. జిజ్ఞాస ఫౌండర్ భార్గవ్ మాట్లాడుతూ ఈ జీఐమ హోత్సవ్ అత్యంత పెద్ద నగరాల్లో ఒకటైన విజయవాడలో జరగడం అదృష్టమన్నారు. సంగీతం, బృందగానం, స్టోరీ టెల్లింగ్, ఆర్ట్ పోటీలు సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ గ్రౌండ్స్‌లో జరుగుతాయని పి.హిమబిందు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలకు సిద్ధం

» లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

వరంగల్/చర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో తాము శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని, కానీ రాష్ట్ర ప్రభుత్వమే ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనుకూల వాతావరణం కల్పిస్తే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో శాంతి చర్చలకు ముందుకు వస్తామని వికల్ప్ ప్రకటించారు. మావోయిస్టులతో చర్చలకు సిద్ధమని ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ ప్రకటనలు చేస్తున్నారని, కానీ చర్చలపై తమ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రకటనపై నేరుగా సమాధానం ఇవ్వడం లేదని అన్నారు. ఇది కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర అని ఆరోపించారు. దోపిడీకి గురవుతున్న ప్రజల ప్రయోజనాల కోసం శాశ్వతంగా శాంతిని నెలకొల్పేందుకు చర్చలకు సిద్ధమని ఆయన ప్రకటించారు. సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వానికి పెద్దగా డిమాండ్లు, షరతులు పెట్టడం లేదని తెలిపారు. ఎన్‌కౌంటర్లు, క్రాస్ ఫైరింగ్‌తో ఆదివాసీలపై జరుగుతున్న దారుణహత్యలను అరికట్టాలని, సాయుధ బలగాలన్నింటినీ ఆరు నెలల పాటు శిబిరాలకే పరిమితం చేయాలని కోరారు. కొత్త క్యాంపులను ఏర్పాటు చేయటం ఆపాలన్నారు. ప్రభుత్వం అంగీకరిస్తే నేరుగా లేదా, వర్చువల్‌గా శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

కోర్టు నిబంధనలను ఉల్లంఘించలేదు

» 'రెడ్‌బుక్' కేసులో లోకేశ్ కౌంటర్

విజయవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ రెడ్‌బుక్ పేరుతో దర్యాప్తు అధికారులను బెదిరిస్తున్నారని సీఐడీ వేసిన పిటిషన్‌పై ఆయన కౌంటర్ దాఖలు చేశారు. గురువారం విజయవాడ ఏసీబీ కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కాగానే న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ ఈ కౌంటర్ అఫిడవిట్ వేశారు. న్యాయస్థానం విధించిన నిబంధనలను లోకేశ్ ఎక్కడా ఉల్లంఘించలేదని.. యువగళం ముగింపు సభలో ఆయన ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలూ చేయలేదని కోర్టుకు వివరించారు. కౌంటర్‌ను స్వీకరించిన న్యాయస్థానం తదుపరి విచారణను వచ్చే నెల 15వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో అప్రూవర్‌గా మారిన సుధీష్ చంద్రకాంత్ షా వాంగ్మూలం నమోదును ఏసీబీ కోర్టు వచ్చే నెల 1కి వాయిదా వేసింది.

జగన్ నిర్లక్ష్యంతో ఆరోగ్య విపత్తు: ఆలపాటి

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జగన్ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో వైద్య విపత్తు తలెత్తిందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కింద ఇంటింటికీ వైద్యం కేవలం ఎన్నికల స్టంట్‌గానే మిగిలిపోయిందన్నారు. పీహెచ్‌సీల్లో సిబ్బంది లేరని, జ్వరం బిళ్లలు కూడా దొరకడం లేదన్నారు. ప్రమాదంలో మరణించిన వారికి అందించే చంద్రన్న బీమా, మట్టి ఖర్చులను రద్దు చేశారని తెలిపారు. కరోనా మృతుల కుటుంబాలకు ఇవ్వాల్సిన నిధులనూ స్వాహా చేసిన దుర్మార్గుడు జగన్ అని విమర్శించారు.

నిరాధార ఆరోపణలతో బాబుపై పుస్తకం

» విజయబాబు, సజ్జలపై చర్యలు తీసుకోవాలి: నక్కా ఆనంద్

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రజాధనంతో జీతం తీసుకుంటున్న అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు.. చంద్రబాబుపై అసత్య ఆరోపణలతో పుస్తకం రాయడం, దాన్ని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి విడుదల చేయడం సిగ్గుచేటని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు గురువారం విమర్శించారు. చంద్రబాబుపై నిరాధార నిందలతో పుస్తకం రాయడంపై మండిపడ్డారు. రూ.లక్ష కోట్లు దోపిడీ చేసి కిరాయి మనుషులతో చంద్రబాబుపై జగన్ అసత్య ప్రచారం చేయిస్తున్నారని, ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తూ ప్రతిపక్ష నేతపై అసత్య ఆరోపణలు చేసినందుకు వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. వారి ప్రభుత్వ పదవులను వెంటనే తొలగించాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు.

సహకార బ్యాంకులకు ఎన్నికల మార్గదర్శకాలు

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సహకార బ్యాంకులు అనుసరించాల్సిన మార్గదర్శకాలను ఆప్కాబ్ తాజాగా విడుదల చేసింది. ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు బ్యాంకులు సాధారణ వ్యాపార లావాదేవీలు మినహా, సవరణలు, కొత్త పథకాలు అమలు చేయరాదని, పాలకవర్గాలు విధాన నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేసింది. 'ఆప్కాబ్, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిలు, డైరెక్టర్లు బ్యాంక్ వాహనాలను వాడకూడదు. బ్యాంక్ ప్రాంగణాలను, వసతిని రాజకీయ సమావేశాలకు ఉపయోగించరాదు. బ్యాంక్ వెబ్‌సైట్, వెబ్ అప్లికేషన్లలో ప్రధాని, సీఎం, మంత్రులు, రాజకీయ నాయకుల ఫొటోలను తక్షణమే తొలగించాలి. బ్యాంకు ఉద్యోగులు ఏ పార్టీకి, అభ్యర్థికీ అనుకూలంగా వ్యవరించరాదు' అని మెమోలో పేర్కొంది.

తూనికలు, కొలతలశాఖ దాడుల్లో 172 కేసులు

అమరావతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తూనికలు, కొలతలశాఖ అధికారులు గురువారం వివిధ జిల్లాల్లోని రైతు బజార్లు, కూరగాయల మార్కెట్లు, ఎంఎల్ఎస్ పాయింట్లు, మార్కెట్ యార్డులు, కమీషన్ ఏజెంట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దాడులు నిర్వహించారు. విశాఖపట్నం రీజియన్‌లో రాజాం, పాలకొండ, అనకాపల్లి, ఏలూరు రీజియన్‌లో మచిలీపట్నం, భీమవరం, గుంటూరు రీజియన్‌లో బాపట్ల, చీరాల, చిలకలూరిపేట, కర్నూలు రీజియన్‌లో పొద్దుటూరు, ఆదోనిలో మొత్తం 533 చోట్ల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించి తక్కువ తూకాలతో ప్యాకేజీలు, ఎంఆర్‌పీ కంటే ఎక్కువ వసూళ్లు తదితర లోపాలను గుర్తించిన అధికారులు 172 కేంద్రాలపై కేసులు నమోదు చేశారు.

మే 2 నుంచి ఏపీఆర్ సెట్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్ల భర్తీకి చేపట్టే ఏపీఆర్‌సెట్ మే 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగిసిందని.. అయితే రూ.రెండు వేల అపరాధ రుసుంతో ఈ నెల 29వ తేదీ వరకు, రూ.ఐదు వేల అపరాధ రుసుంతో ఏప్రిల్ 6వ తేదీ దాకా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఏప్రిల్ 10వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

పేదలకు డొక్కు బస్సులే!

జగన్‌కు మాత్రం అధునాతన హంగులతో కొత్త వాహనాలు

» రూ.25 లక్షల పల్లె వెలుగుకు డబ్బుల్లేవ్

» సీఎం కోసమేమో 35 కోట్లతో 5 బస్సులు

» ఐదేళ్లలో ఒక్క కొత్త బస్సూ కొనని ఆర్టీసీ

» పనికిమాలిన వాటిలోనే జనం ప్రయాణం

» కొత్త బస్సులు 1,500 వస్తాయంటూ ఏడాదిగా చెబుతున్న ఎండీ, చైర్మన్

» ఒక్కదానికీ అతీగతీ లేదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పేదల ప్రభుత్వమంటూ గొప్పలు చెబుతారు.. పేదోడు ప్రయాణించే ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచుతారు.. డొక్కు బస్సులు మార్చరు.. కొత్త బస్సులు కొనరు.. కనీసం పాతవాటికి మరమ్మతులు కూడా సరిగా చేయరు.. కానీ పేదల పక్షపాతి సీఎం కోసం కోట్లాది రూపాయల ఖర్చుతో అత్యాధునిక వసతులతో బుల్లెట్ ప్రూఫ్ బస్సులు కొంటారు. గత ఐదేళ్లలో పేదలు ప్రయాణించే పల్లె వెలుగు బస్సు ఒక్కటి కూడా కొనుగోలు చేయని సీఎం జగన్మోహన్‌రెడ్డి తన ఎన్నికల ప్రచారం కోసం రూ.35 కోట్ల వ్యయంతో ఏపీఎస్ఆర్టీసీతో ఐదు బస్సులు కొనుగోలు చేయించారు. అందులో రెండు బుల్లెట్ ప్రూఫ్ కాగా మరో మూడు ఆయన సేద తీరేందుకు క్యారవాన్లు.. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయాణ అవసరాలు తీర్చి గమ్యం చేర్చే ప్రజా రవాణా సంస్థకు ఉన్న బస్సుల్లో 53 శాతం కాలం చెల్లినవే. గతంలో ఏ ప్రభుత్వమూ పెంచనంతగా ప్రయాణ చార్జీలు పెంచి ఏడాదికి రెండు వేల కోట్ల భారం మోపిన జగన్.. ఈ ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క కొత్త బస్సు కూడా కొనుగోలు చేయలేదు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎండీ ద్వారకా తిరుమలరావు కొత్త బస్సులు అవిగో ఇవిగో అని చెబుతూ వచ్చారు. ఇప్పటికే 1,500 బస్సులు కొన్నామని.. వాటికి బాడీ నిర్మాణం పూర్తయ్యాక జనవరిలో రోడ్డెక్కుతాయని పలుమార్లు చెప్పారు. జనవరి కాదు కదా మార్చి వెళ్లిపోతున్నా అతీగతీ లేదు. ఒక్కో పల్లెవెలుగు బస్సును కేవలం రూ.25 లక్షలతో కొనుగోలు చేయవచ్చని చెబుతున్నారు.



బుల్లెట్ ప్రూఫ్ బస్

సీఎంవో ఆదేశాలు రాగానే..

ఎన్నికల ప్రచారాన్ని దృష్టిలో పెట్టుకుని మూడు నెలల క్రితం ముఖ్యమంత్రికి మూడు బస్సులు కొనుగోలు చేయాలంటూ ఆర్టీసీకి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలొచ్చాయి. వెంటనే ఎండీ ద్వారకాతిరుమల రావు చండీగఢ్ వెళ్లి రూ.15 కోట్ల ఖర్చుతో మూడు క్యారవాన్ బస్సులకు ఆర్డర్ ఇచ్చి వచ్చారు. అంతలోనే మరో రెండు బుల్లెట్ ప్రూఫ్ వోల్వో బస్సులు కావాలని చెప్పడంతో నిఘా విభాగం ఉన్నతాధికారులతో చర్చించి ఏకంగా 20 కోట్లు ఖర్చు చేసి వాటిని కొన్నారు. జనవరిలో ఆర్డర్ ఇచ్చిన బస్సులు కేవలం రెండు నెలల్లో అత్యాధునిక హంగులతో విజయవాడ చేరుకున్నాయి. పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలపై చార్జీల బాదుడుతో వసూలు చేసిన సొమ్మును వీటికి వ్యయం చేశారన్న మాట. బుల్లెట్ ప్రూఫ్ బస్సులు కొనడంపై నిరసన వెల్లువెత్తడంతో వాటిని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా కోసం కొనుగోలు చేయించినట్టుగా వైసీపీ పేటీఎం బ్యాచ్ ప్రచారం చేసింది. కానీ ప్రధాని మోదీ చిలకలూరిపేటకు వచ్చినప్పుడు ఆ బస్సు విజయవాడ దాటి వెళ్లలేదు. ముఖ్యమంత్రి పర్యటనలు, బహిరంగ సభల ఏర్పాట్లను పర్యవేక్షించే వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం ప్రస్తుతం ఈ బస్సులను పర్యవేక్షిస్తున్నారు. బుల్లెట్ ప్రూఫ్ బస్సుల్లో బెడ్‌రూమ్, టాయ్‌లెట్స్, మినీ కాన్ఫరెన్స్ హాల్, ఎల్ఈడీ టీవీ, వైఫై, మినీ ఆఫీసు, సీసీ కెమెరాలు, బస్సు చుట్టూ సౌండ్ సిస్టమ్, జగన్ బస్సు పైకి ఎక్కటానికి వీలుగా స్టెయిర్స్, బస్సెక్కిన తర్వాత ప్రసంగించడానికి మినీ డయాస్ వంటివి ఉన్నాయి.

ఆ రెంటినీ వాడకుండా..

ఆర్టీసీ వద్ద ఇప్పటికే రెండు బుల్లెట్ ప్రూఫ్ బస్సులు ఉన్నా వాటిని ముఖ్యమంత్రి జగన్ పక్కన పెట్టేశారు. ఇటీవల వాటికి మూడున్నర కోట్లతో మరమ్మతులు కూడా చేయించారు. అయినప్పటికీ వాటిని వాడేందుకు జగన్ నిరాకరించడంతో 38 కోట్లు వెచ్చించి మరీ ఐదు కొత్త బస్సులను కొనుగోలు చేశారు. వోల్వో బుల్లెట్ ప్రూఫ్ బస్సులు బయట అద్దెకు తీసుకోవాలంటే ప్రభుత్వం మీద చాలా భారం పడుతుంది. అదే ఆర్టీసీ వద్దయితే తక్కువ అద్దె ఇవ్వొచ్చని వైసీపీ పెద్దలు భావించినట్లు ఉన్నారు. అందుకే దానితో కొనుగోలు చేయించారు. అందుబాటులో ఉన్న వాటినే వాడి ఉంటే ఆర్టీసీపై భారం తగ్గేది. కనీసం వంద పల్లె వెలుగు బస్సులు వచ్చినా కొన్ని పాత డొక్కు బస్సులను పక్కనపెట్టేయడానికి అవకాశం ఉండేది.

ఇతర విరాళాల్లోనూ బీజేపీనే టాప్

న్యూఢిల్లీ, మార్చి 21: ఎన్నికల బాండ్ల రూపంలో కాకుండా.. దేశవ్యాప్తంగా వివిధ పార్టీలకు 2013-2023 నడుమ అందిన నిధులు రూ.7,726 కోట్లు. అందులో సింహభాగం.. దాదాపు రూ.5000 కోట్లు (ఇంచుమించుగా 64.7%) బీజేపీకే అందాయని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సమాచారం ఆధారంగా బిజినెస్‌లైన్ వార్తా సంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. దాని ప్రకారం.. 10.7% నిధులతో కాంగ్రెస్.. 3.3% నిధులతో బీఆర్ఎస్, 3.1% నిధులతో ఆప్ బీజేపీ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మోదీ సర్కారు రూపొందించిన ఎలక్టోరల్ బాండ్ల పథకం 2018లో అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. అంతకు ముందున్న విధానంలో.. రూ.20 వేల కంటే ఎక్కువ మొత్తంలో వచ్చే విరాళాల వివరాలను పార్టీలు ప్రకటించాల్సి ఉంటుంది. 2014 నాటికి ఇలాంటి విరాళాల విలువ రూ.309 కోట్లుగా ఉండగా.. 2020 నాటికి రూ.1,247 కోట్లకు చేరింది. 2023లో అలాంటి విరాళాలు రూ.1,101 కోట్లకు తగ్గడం గమనార్హం.

బాండ్లు.. అతి పెద్ద స్కాం: ఏచూరి

న్యూఢిల్లీ, మార్చి 21: దేశ చరిత్రలో ఎలక్టోరల్ బాండ్ల స్కీం అతి పెద్ద కుంభకోణమని.. ఇది మాఫియా తరహా దోపిడీలకు దారితీసిందని సీపీఎం నేత సీతారాం ఏచూరి అన్నారు. ఎలక్టోరల్ బాండ్లను రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన వారిలో ఏచూరి కూడా ఉన్నారు. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.. 'నల్లధనాన్ని అరికట్టడానికి బదులుగా మనీ లాండరింగ్‌కు అనుమతిస్తున్నారు. చాలా కంపెనీలు తమ వార్షిక లాభాల కంటే అనేక రెట్లు ఎక్కువగా ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేశాయి. సుప్రీం కోర్టు ఈ బాండ్ల విధానాన్ని రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. కార్పొరేట్ కంపెనీలు నేరుగా పార్టీలకు నిధులివ్వకూడదు. ప్రభుత్వానికి ఆ నిధులు అందజేస్తే.. ఎన్నికల కోసం వాటిని ఖర్చుచేస్తే బాగుంటుంది. అధికార బీజేపీ చర్యలు దేశంలో దారుణమైన రాజకీయ అవినీతికి దోహదం చేస్తున్నాయి' అని మండిపడ్డారు.

ఉద్యోగుల నిరవధిక సమ్మె వాయిదా

» మే 1 నుంచి నిరవధిక సమ్మెకు గతంలో పిలుపు

» ప్రభుత్వం గడువు కోరడంతో అంగీకరించిన జేఎఫ్ఆర్‌వోపీఎస్

న్యూఢిల్లీ, మార్చి 21: పాత పింఛన్ పథకం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ప్రభుత్వ, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు మే 1 నుంచి చేపడతామని ప్రకటించిన నిరవధిక సమ్మెను వాయిదా వేశారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ, కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ సహా ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు జేఎఫ్ఆర్‌వోపీఎస్ (ది జాయింట్ ఫోరం ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్) గురువారం వెల్లడించింది. ఓపీఎస్ పునరుద్ధరణపై నిర్ణయం తీసుకునేందుకు మరింత సమయం కావాలని ప్రభుత్వం కోరిన నేపథ్యంలో సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించామని జేఎఫ్ఆర్‌వోపీఎస్ కన్వీనర్ శివగోపాల్ మిశ్రా చెప్పారు. 'రాష్ట్రాలను, వివిధ విభాగాలను సంప్రదించడానికి మరింత సమయం కావాలని వారు మాకు చెప్పారు. ఈ ప్రతిపాదనకు మేం అంగీకరించాం. అందుకే సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించాం' అన్నారు. కేంద్ర ప్రభుత్వం పింఛన్ వ్యవస్థపై సమీక్షించేందుకు సోమనాథన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు కూడా జరిపింది. కమిటీ నివేదిక సమర్పించడంలో జాప్యం గురించి కూడా జేఎఫ్ఆర్‌వోపీఎస్ ప్రతినిధులకు ఆర్థికశాఖ కార్యదర్శి వివరించారని, అయితే, ఈ అంశాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కమిటీ నిర్విరామంగా కృషి చేస్తోందని భరోసా ఇచ్చారని శివగోపాల్ మిశ్రా తెలిపారు. 'కమిటీపై నమ్మకం ఉంచాలని ఆయన మమ్మల్ని కోరారు. అలాగే, పార్లమెంటులో ప్రకటన ద్వారా కమిటీని ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ ఉద్దేశాన్ని కూడా గుర్తించాలని ఆయన కోరారు. అందుకే ప్రభుత్వానికి మరికొంత గడువు ఇవ్వాలని నిర్ణయించాం' అని మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది జూన్, జూలై నెలలతోపాటు ఈనెల 14న కూడా సోమ్‌నాథన్ కమిటీ సమావేశాలు నిర్వహించింది. కమిటీ రాష్ట్ర ప్రభుత్వాలతోనూ క్రియాశీలకంగా సంప్రదింపులు జరుపుతోందని కేంద్ర ఆర్థిక శాఖ తాజాగా జారీచేసిన ఓ సర్క్యులర్‌లో పేర్కొంది.

గర్భిణులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలి

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్రంలో ఉన్న గర్భవతులు, బాలింతల కోసం అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లు వేరుగా ఏర్పాటు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ జి.వెంకట లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న పిల్లలతో వచ్చే బాలింతలకు పోలింగ్‌బూత్ వద్ద ప్రత్యేకంగా ఫీడింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని, గర్భవతులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలింగ్ తేదీ నాటికి పెరిగే ఉష్ణోగ్రతలు దృష్టిలో పెట్టుకుని మహిళలు వడదెబ్బకు గురి కాకుండా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద షెల్టర్, మంచినీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని కోరారు. కొన్ని అత్యవసర సందర్భాల్లో మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు, తదితర విషయాల్లో వారికి తగు న్యాయం చేయడానికి, బాధితులను పరామర్శించడానికి మహిళా కమిషన్ చైర్ పర్సన్, మెంబర్లకు ఎన్నికల నిబంధనల్లో సడలింపు ఇవ్వాలని కోరారు. ఎన్నికల నియమావళిలో గిరిజన మహిళలు ఉన్న ప్రదేశాల్లో మినహాయింపు ఇచ్చినచో ఏపీ మహిళా కమిషన్ తరఫున అవగాహన కార్యక్రమాలు జరపడానికి అవకాశం కల్పించినట్లు అవుతుందని కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీ

» ఎన్నికల ప్రచారానికి వెళ్లిన తైనాల విజయ్‌కుమార్

» ఇంట్లో ఒంటరిగా ఉన్న భార్య

» రాత్రి ఏడున్నరకు గేటు దూకి చొరబడిన దుండగుడు

» మెడపై కత్తిపెట్టి బెదిరింపు

» నగదు, బంగారంతో ఉడాయింపు

» వెంటనే భర్తకు ఫోన్ చేసిన బాధితురాలు

» ప్రచార హోరులో ఫోన్ ఎత్తని వైసీపీ నాయకుడు

» డ్రైవర్‌కు ఫోన్ చేసి చెప్పగా.. ఇంటికి

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ఇంట్లో దోపిడీ జరిగింది. విశాఖ నగరంలోని డాబాగార్డెన్స్‌లో గల లలితా కాలనీలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. విజయ్‌కుమార్ ఎన్నికల ప్రచారానికి ఎస్.కోటకు వెళ్లగా, ఇంట్లో భార్య ఒక్కరే ఉన్నప్పుడు ఈ దోపిడీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయ్‌కుమార్ దంపతులకు ఇద్దరు సంతానం. ఇద్దరు కుమారులు ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడగా, విజయ్‌కుమార్ దంపతులు లలితా కాలనీలో నివాసం ఉంటున్నారు. ఎస్.కోట నియోజకవర్గానికి విజయ్‌కుమార్ పరిశీలకుడు. దీంతో ఆయన అక్కడ ప్రచారంలో పాల్గొంటున్నారు. గురువారం మధ్యాహ్నం ఎంపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీలక్ష్మి పర్యటన ఉండడంతో ఆయన అక్కడకు వెళ్లారు. భార్య ఇంట్లో ఒంటరిగా ఉండగా, రాత్రి ఏడున్నర గంటల సమయంలో ముఖానికి మాస్క్‌తోపాటు నెత్తిన టోపీ పెట్టుకున్న దుండగుడు ప్రహరీ దూకి లోనికి చొరబడ్డాడు. కిచెన్‌లోకి వెళ్లి అక్కడ వంట చేస్తున్న విజయ్‌కుమార్ భార్య మెడపై కత్తి పెట్టి చంపేస్తానని బెదిరించాడు. మెడలోని బంగారం తాడు, గొలుసు తీసుకున్నాడు. అనంతరం బీరువాలోని నగదు, బంగారం కూడా తీసుకుని ఉడాయించాడు. ఆమె వెంటనే భర్తకు ఫోన్ చేయగా ప్రచారం హోరులో విజయ్‌కుమార్ ఫోన్ తీయలేదు. దీంతో కారు డ్రైవర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పడంతో విజయ్‌కుమార్ వెంటనే ఇంటికి చేరుకున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. డీసీపీ-1 మణికంఠ చందోలు, క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, సీసీఎస్ ఏసీపీ ఎ.వెంకటరావు, టూటౌన్ సీఐ తిరుమలరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

తెలిసిన వారి పనేనని అనుమానం

ఇది తెలిసినవారి పనే అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. విజయ్‌కుమార్ ప్రతి రోజూ మధ్యాహ్నం భోజనం తర్వాత ఎస్.కోట వెళుతున్నార ని, ఆ సమయంలో భార్య ఒంటరిగా ఉంటున్నట్టు గమనించిన వ్యక్తులే దోపిడీకి వ్యూహం పన్ని ఉంటారని భావిస్తున్నారు. దుండగుడు తెలుగులో స్పష్టంగా మాట్లాడాడని, మధ్యలో ఎవరో ఫోన్ చేయగా.. పనైపోయింది వచ్చేస్తానని చెప్పాడని విజయ్‌కుమార్ భార్య పోలీసులకు తెలిపారు. విజయ్‌కుమార్ ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలతోపాటు ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఇంటి బయట ఒకరు ద్విచక్ర వాహనంపై వేచి ఉండగా, ఒకరు ఇంట్లోకి ప్రవేశించినట్టు సీసీ కెమెరాల్లో రికార్డయింది. దీంతో దోపిడీలో ఇద్దరి పాత్ర ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఆ ఇద్దరూ స్థానికులే అయి ఉంటారని అనుమానిస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీ, సెల్‌ఫోన్ టవర్ లొకేషన్, ఘటనా స్థలంలో లభ్యమైన వేలిముద్రల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సంక్షేమం.. అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

» మాజీ ఎంపీ మురళీమోహన్

» హోరెత్తిన ప్రజాగళం.. పాట విడుదల

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో కొనసాగించడం టీడీపీ అధినేత, చంద్రబాబుకే సాధ్యమని మాజీ ఎంపీ మాగుంట మురళీమోహన్ స్పష్టం చేశారు. ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు మరోసారి రావాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. పొట్లూరి శ్రీనివాస్‌రావు నిర్మాణంలో రచయిత, డైరెక్టర్ కోనేరు ప్రదీప్‌కుమార్ రూపొందించిన "హోరెత్తిన ప్రజాగళం" పాటను గురువారం, ఎన్టీఆర్‌భవన్‌లో మురళీమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రం వెనుకబడిపోయిందని, రాజధాని లేని దిక్కులేని రాష్ట్రంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ టి.డి.జనార్ధన్ మాట్లాడుతూ... ఐదేళ్లుగా ఏపీలో అరాచకమైన, ప్రజాకంటకమైన పాలన జరుగుతోందన్నారు. ది బోస్టన్ గ్రూప్ చైర్మెన్, సుబ్బు ఎం. కోట మాట్లాడుతూ... అమెరికాలోని ప్రవాసాంధ్రుల యువత అందరూ జనసేనకు మద్దతు తెలుపుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ రాబోయే ఎన్నికలలో గెలవాలన్నదే మా డ్రీమ్ అన్నారు. రోడియం గ్రూప్‌ఆఫ్ కంపెనీస్ చైర్మెన్, పొట్లూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ఏపీలో మళ్లీ మంచి రోజులు వచ్చి చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని అందరూ కంకణం కట్టుకున్నారన్నారు. ఎండి బిఎస్‌సిపిఎల్, బొల్లినేని శీనయ్య, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ జ్యోత్స్న, మీడియా కమిటీ చైర్మన్ తెలుగు దేశం ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నై సౌత్ బరిలో తమిళిసై

» 9 మంది అభ్యర్థులతో బీజేపీ మూడో జాబితా

» ఇప్పటి వరకు 275 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన



న్యూఢిల్లీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలో మిగిలిన పార్టీలతో పోలిస్తే బీజేపీ ఒకడుగు ముందే ఉంటోంది. కాంగ్రెస్ కంటే ముందే రెండు జాబితాలను ప్రకటించిన బీజేపీ, గురువారం 9 మంది అభ్యర్థులతో మూడో జాబితాను విడుదల చేసింది. ఈ తొమ్మిది స్థానాలూ తమిళనాడులోనివే. ఈనెల 19న తెలంగాణ గవర్నర్ పదవితోపాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి రాజీనామా చేసిన తమిళిసై సౌందర రాజన్‌కు చెన్నై సౌత్ లోక్‌సభ సీటును కేటాయించారు. గవర్నర్ పదవికి రాజీనామా చేసిన రెండు రోజులకే ఆమెకు లోక్‌సభ సీటును కేటాయించడం గమనార్హం. ఇక తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలైకు కోయంబత్తూర్, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్‌కు నీలగిరి(ఎస్సీ), కేంద్ర మాజీ మంత్రి పోన్ రాధాకృష్ణన్‌కు కన్యాకుమారి స్థానాలు కేటాయించారు. అదేవిధంగా.. చెన్నై సెంట్రల్ నుంచి వినోజ్ పీ సెల్వమ్, వెల్లూర్ నుంచి ఏసీ షణ్ముగం, కృష్ణగిరి నుంచి సి. నరసింహన్, పెరంబలూర్ నుంచి టీఆర్ పారివేందర్, తూత్తుకుడి నుంచి నైనార్ నాగేంద్రన్ లోక్‌సభకు పోటీ చేయనున్నారు. కాగా, బీజేపీ తొలి జాబితాలో 194 మంది, రెండో జాబితాలో 72 మంది పేర్లను ప్రకటించింది. మూడు జాబితాల్లో కలిపి ఇప్పటి వరకు 275 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. మరో 268 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. కాగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు రెండు జాబితాల్లో కలిపి 82 స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. వాటిలో 15 స్థానాలకు బీజేపీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించేసింది. నాలుగో జాబితాలో ఖమ్మం, వరంగల్ లోక్‌సభ స్థానాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన లోక్‌సభ స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది.

అమెరికన్లది జగమంత కుటుంబం!

» ఆ దేశంలోని పలు కుటుంబాల్లో.. ఎవరికి ఎవరు ఏమవుతారో తెలియని గందరగోళం

న్యూఢిల్లీ, మార్చి 21 : అమెరికాలోని కొన్ని కుటుంబాల్లోని సభ్యులు ఎవరికి ఎవరు ఏమవుతారు అంటే కచ్చితంగా చెప్పలేని పరిస్థితులు ఉన్నాయట. డీఎన్‌ఏ పరీక్షల్లో బయటపడుతున్న విషయాలు భయపెడుతున్నాయి. పీకల్లోతు ప్రేమలో ఉన్న ఓ జంట డీఎన్‌ఏ పరీక్షలు చేయించుకుంటే వారు అన్నాచెల్లెళ్లుగా తేలుతున్నారు. చిన్నప్పటి నుంచి నాన్న అని పిలుచుకున్న వ్యక్తి తమ కన్నతండ్రి కాదని తెలుసుకుని మరికొందరు ముక్కున వేలేసుకుంటున్నారు. డీఎన్‌ఏ పరీక్షల ద్వారా చేసిన ఓ అధ్యయనంలో ఈ విషయాలు వెలుగు చూశాయి. అక్కడ మితిమీరిన స్వేచ్ఛాయుత జీవన విధానం వల్ల వావివరసలు తెలుసుకోకుండా పలువురు లైంగిక సంబంధాలు పెట్టుకోవడమే ఇందుకు కారణం.

ఇలాంటి సంబంధాల కారణంగా కొందరు తమ సమీప రక్తసంబంధీకులకే పుట్టారనే విషయం డీఎన్‌ఏ పరీక్షల్లో బయటపడుతుంది. 1975లో ఓ సైకాలజీ పుస్తకంలో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం ఇలాంటి సంబంధం వల్ల పుట్టిన వారు అమెరికాలోని ప్రతి పది లక్షల మందిలో ఒకరు ఉండేవారు. ఇటీవల చేసిన అధ్యయనాల్లో ప్రతీ ఏడు వేల మందిలో ఒకరు ఉండడం ఆందోళన కలిగించే అంశం. తను, తన మాజీ ప్రియుడు వరసకు అన్నాచెల్లెళ్లు అవుతామనే విషయాన్ని డీఎన్‌ఏ పరీక్షల ద్వారా తెలుసుకున్నామని అమెరికాకు చెందిన విక్టోరియాహిల్(39) అనే మహిళ సీఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొంది. అంతేకాక, తాను నాన్న అని పిలుచుకుంటున్న వ్యక్తి తన కన్నతండ్రి కాదని కూడా తెలిసిందని ఆమె వెల్లడించింది. అయితే, కొందరు వ్యక్తులు చేస్తున్న వీర్య దానాలూ ఈ సమస్యకు ఓ కారణమనే అభిప్రాయాలు ఉన్నాయి.

ఆంధ్ర బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా అరుణ్‌సింగ్

న్యూఢిల్లీ, మార్చి 21: ఆంధ్ర సహా మూడు రాష్ట్రాలకు ఎన్నికల ఇన్‌చార్జులను, సహ ఇన్‌చార్జులను బీజేపీ నాయకత్వం నియమించింది. ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జిగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్, సహ ఇన్‌చార్జిగా యూపీ మాజీ మంత్రి సిద్ధార్థనాథ్ సింగ్ రానున్నారు. రాజస్థాన్ ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ వినయ్ సహస్రబుద్ధే, కో-ఇన్‌చార్జులుగా జాతీయ కార్యదర్శి విజయ్ రాహత్కర్, పశ్చిమ ఢిల్లీ ఎంపీ పర్వేశ్ సాహిబ్‌సింగ్ వర్మ.. హరియాణా ఇన్‌చార్జిగా రాజస్థాన్ బీజేపీ సీనియర్ నేత సతీశ్ పూనియా, సహ ఇన్‌చార్జిగా యూపీ ఎంపీ సురేంద్రసింగ్ నాగర్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

జగన్.. నా అంటే నాశనమే: పిల్లి

అమరావతి, మార్చి21(ఆంధ్రజ్యోతి): నా.. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు అనే జగన్‌రెడ్డి ఈ పదేళ్లలో ఆ వర్గాలకు అందాల్సిన రూ.1.30లక్షల కోట్లు దారి మళ్లించారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్ నా అంటే.. నాశనమే అని అభివర్ణించారు. 'నా బాబాయ్ అని వివేకాను చంపేశారు. నా తల్లి, నా చెల్లి అని వాళ్లనూ తరిమేశాడు' అని విమర్శించారు.

టీడీపీ నేతల ఇళ్లు.. ఆఫీసులూ ధ్వంసం చేస్తాం

» ప్రత్తిపాడు వైసీపీ అభ్యర్థి కిరణ్

అమరావతి, మార్చి21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి రామాంజనేయులు తమ అనుచరులపై దాడి చేశారంటూ గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వైసీపీ అభ్యర్థి బలసాని కిరణ్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అమరావతి సచివాలయంలోని సీఈవో కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. 'టీడీపీ వాళ్లు మావాళ్లపై దాడులకు పాల్పడుతున్నారు. టీడీపీ ఇలాగే చేస్తే, రానున్న రోజుల్లో మీ ఇళ్లే కాదు.. పార్టీ ఆఫీసులను కూడా ధ్వంసం చేస్తాం. జాగ్రత్తగా ఉండండి' అని హెచ్చరించారు. చంద్రబాబు గూండాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మరో నాయకుడు నారాయణమూర్తి మాట్లాడుతూ రాయచోటిలో నారా భువనేశ్వరి చెక్కుల రూపంలో డబ్బులు పంపిణీ చేసి, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని సీఈవోకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

2050 కల్లా భారత్‌లో పడిపోనున్న జననాల రేటు

» 1.29కి చేరుకునే అవకాశాలు..ప్రస్తుతం 2.1గా టీఎఫ్ఆర్

» వెల్లడించిన అధ్యయనం.. లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితం

న్యూఢిల్లీ, మార్చి 21: భారత్‌లో జననాల రేటు 2050 కల్లా భారీగా తగ్గిపోనుందని లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం వెల్లడించింది. ప్రస్తుతం (2021 అంచనాల ప్రకారం) భారత్‌లో టోటల్ ఫెర్టిలిటీ రేట్(టీఎఫ్ఆర్) 2.1గా ఉంది. ఈ రేటు 2050 కల్లా 1.29కి పడిపోయే ప్రమాదముందని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. 1950లో 6.18గా ఉన్న టీఎఫ్ఆర్ 1980కి 4.6కి చేరుకుందని, 2021లో 2.1కి దిగజారిందని గుర్తుచేసింది. ఇందుకు అనేక కారణాలున్నాయని పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రెజా వెల్లడించారు. "జీవన ప్రమాణాలు, పిల్లల పెంపకం భారం, విద్యపై వ్యయం పెరిగాయి. మహిళల్లో సాధికారతపై అవగాహన పెరిగింది. తమ కాళ్లపై తాము నిలదొక్కుకున్నాకే పెళ్లిళ్ల గురించి ఆలోచిస్తున్నారు. కెరీర్‌లో ఎదుగుదల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిణామాలన్నీ టీఎఫ్ఆర్ తగ్గడానికి కారణమవుతోంది" అని ఆమె వివరించారు. టీఎఫ్ఆర్ తగ్గడంపై ప్రతికూల ప్రభావాలు కూడా ఉంటాయని చెప్పారు. "రాబోయే రోజుల్లో జననాల రేటు తగ్గడంతో వృద్ధుల సంఖ్య పెరుగుతుంది. కార్మికుల/లేబర్ సంఖ్య తగ్గుతుంది. లింగపరంగా సామాజిక అసమానతలు పెరిగిపోతాయి" అని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా.. 204 దేశాల్లో నిర్వహించిన ఈ అధ్యయనంలో.. 2050 సంవత్సరం వరకు 155 దేశాల్లో ఇదే పరిస్థితి ఉంటుందని వెల్లడైంది.

హేమంత్ సొరేన్ కస్టడీ ఏప్రిల్ 4 వరకు పొడిగింపు

రాంచీ, మార్చి 21: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్ జ్యుడీషియల్ కస్టడీని ఏప్రిల్ నాలుగో తేదీ వరకు పొడిగిస్తూ ఇక్కడి పీఎల్ఎంఏ ప్రత్యేక కోర్టు ఆదేశాలు ఇచ్చింది. తొలుత ఆయనకు ఇచ్చిన కస్టడీ సమయం గురువారంతో ముగిసింది. ఈడీ వినతి మేరకు కస్టడీని పొడిగిస్తున్నట్టు జడ్జి ప్రకటించారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శుక్రవారం 22 మార్చి 2024
diksuchi@andhrajyothy.com

ఏపీ కస్తూర్బా విద్యాలయాల్లో అడ్మిషన్స్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష పథకం కింద కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో మొత్తం 352 విద్యాలయాలు ఉన్నాయి. ఆరోతరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం(పదకొండో తరగతి)లో చేరేందుకు బాలికలకు ప్రవేశ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకోసం కూడా దరఖాస్తులు కోరుతున్నారు. అనాథలు, వీధి బాలలు, బడి మానేసిన పిల్లలు సహా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ వర్గాలకు చెందిన ఆడపిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: ఆరోతరగతిలో ప్రవేశానికి అయిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం(పదకొండో తరగతి) ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో ప్రవేశానికి ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు పాసై ఉండాలి. ప్రస్తుతం కేజీబీవీల్లో పదోతరగతి చదివిన బాలికలు కూడా పదకొండో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,20,000; పట్టణాల్లో రూ.1,40,000 మించకూడదు.

ఎంపిక: ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. వీటిని పరిశీలించి లిస్టు రూపొందిస్తారు. ఎంపికైనవారికి ఫోన్ ద్వారా సమాచారమిస్తారు. సంబంధిత పాఠశాల నోటీస్ బోర్డులో కూడా చూడవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 11
- **ప్రిపరేషన్ ఆఫ్ సెలెక్షన్ లిస్ట్:** ఏప్రిల్ 15న
- **సెలెక్షన్ లిస్ట్ వెరిఫికేషన్:** ఏప్రిల్ 16 నుంచి 18 వరకు
- **సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్:** ఏప్రిల్ 19 నుంచి 24 వరకు
- **వెబ్‌సైట్:** apkgbv.apcfss.in

ఎండీఎన్ఐవైలో యోగ కోర్సులు

కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగ(ఎండీఎన్ఐవై)- స్వల్పకాలిక యోగ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తారు. ఏప్రిల్ 1 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

ఫౌండేషన్ కోర్స్ ఇన్ యోగ సైన్స్ ఫర్ వెల్‌నెస్

ప్రోగ్రామ్ వ్యవధి ఒక నెల. న్యూఢిల్లీలోని లజ్‌పత్ భవన్‌లో ఉదయం రెండు బ్యాచ్‌లు, సాయంత్రం రెండు బ్యాచ్‌లను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొరార్జీ దేశాయ్ సంస్థలో సాయంత్రం బ్యాచ్ ఆఫ్‌లైన్ మోడ్‌లో ఉంటుంది. ఆన్‌లైన్‌లో ఉదయం మూడు బ్యాచ్‌లు, సాయంత్రం రెండు బ్యాచ్‌లు నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 30 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, తొమ్మిది గంటల నుంచి పదకొండు వరకు, పదకొండు నుంచి ఒంటిగంట వరకు; సాయంత్రం మూడు నుంచి అయిదు వరకు, అయిదు నుంచి ఏడు వరకు తరగతులు ఉంటాయి. నిర్దేశించిన మేరకు అటెండెన్స్ ఉంటేనే ప్రోగ్రామ్ పూర్తయ్యాక సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

అర్హత: కనీసం 15 ఏళ్లు నిండినవారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉండకూడదు. దరఖాస్తుకు మెడికల్ సర్టిఫికెట్, అభ్యర్థి ఫొటో, వ్యాలిడ్ ఐడీ కార్డ్ జతచేయాలి.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.3000

సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగ ఫర్ ప్రొటోకాల్ ఇన్‌స్ట్రక్టర్

ప్రోగ్రామ్ వ్యవధి మూడు నెలలు. మొరార్జీ దేశాయ్ సంస్థలో ఉదయం రెండు బ్యాచ్‌లను ఆన్‌లైన్ విధానంలో; సాయంత్రం రెండు బ్యాచ్‌లను ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 30 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకు తరగతులు ఉంటాయి. హిందీ/ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన ఉంటుంది.

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఫౌండేషన్ కోర్స్ ఇన్ యోగ సైన్స్ ఫర్ వెల్‌నెస్/ఒక నెల వ్యవధి గల తత్సమాన కోర్సు పూర్తి చేసి ఉండాలి. యోగ టీచింగ్‌లో కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్న ప్రొఫెషనల్స్ కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు పూర్తిగా ఆరోగ్యవంతులై ఉండాలి. దరఖాస్తుతోపాటు అర్హతకు సంబంధించిన సర్టిఫికెట్‌లు, అభ్యర్థి ఫొటో, ఆధార్ కార్డ్ కాపీ జతచేయాలి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ విధానంలో అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.9,750; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.6,000


ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** yogamdniy.nic.in



ఐఐటీ ఢిల్లీలో పీజీ, పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫుల్ టైమ్, పార్ట్ టైం కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లలో చేరినవారికి అసిస్టెంట్‌షిప్/ఫైనాన్షియల్ అసిస్టెన్స్/స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.



ఎంటెక్ విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- అప్లయిడ్ మెకానిక్స్: ఇంజనీరింగ్ అనాలిసిస్ అండ్ డిజైన్
- బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయో టెక్నాలజీ: బయో మాలిక్యులర్ అండ్ బయో ప్రాసెస్ ఇంజనీరింగ్
- కెమికల్ ఇంజనీరింగ్
- కెమిస్ట్రీ: మాలిక్యులర్ ఇంజనీరింగ్, కెమికల్ సింథసిస్ అండ్ అనాలిసిస్
- సివిల్ ఇంజనీరింగ్: కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, రాక్ ఇంజనీరింగ్ అండ్ అండర్ గ్రౌండ్ స్ట్రక్చర్స్, జియో టెక్నికల్ అండ్ జియో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
- ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్: కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ టెక్నాలజీ, కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఎలక్ట్రో సర్క్యూట్స్, పవర్ ఎలక్ట్రో - మెషిన్ డ్రైవ్స్, పవర్ సిస్టమ్స్
- ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, రెన్యూవబుల్ ఎనర్జీ టెక్నాలజీస్ అండ్ మేనేజ్‌మెంట్
- మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: మెటీరియల్స్ ఇంజనీరింగ్, పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- మెకానికల్ ఇంజనీరింగ్: మెకానికల్ డిజైన్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, థర్మల్ ఇంజనీరింగ్
- ఫిజిక్స్: అప్లయిడ్ ఆప్టిక్స్, సాలిడ్ స్టేట్ మెటీరియల్స్
- టెక్స్‌టైల్ అండ్ ఫైబర్ ఇంజనీరింగ్: ఫైబర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ కెమికల్ ప్రాసెసింగ్
- సీఏఆర్ఈ: రేడియో ఫ్రీక్వెన్సీ డిజైన్ అండ్ టెక్నాలజీ
- సీఏఎస్: అట్మాస్ఫిరిక్ ఓషనిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- సీబీఎంఈ: బయో మెడికల్ ఇంజనీరింగ్
- సీఏఆర్‌టీ: ఎలక్ట్రిక్ మొబిలిటీ
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్: మెషిన్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్

ఇంటర్ డిసిప్లినరీ ఎంటెక్ స్పెషలైజేషన్‌లు

- సైబర్ సెక్యూరిటీ, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ, ఆప్టో ఎలక్ట్రానిక్స్ అండ్ ఆప్టో కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ డిజైన్ టూల్స్ అండ్ టెక్నాలజీ, టెలీ కమ్యూనికేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, రోబోటిక్స్

ఇతర కోర్సులు

- ఎం డిజైన్: ఇండస్ట్రియల్ డిజైన్
- ఎమ్మెస్సీ-హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్: కాగ్నిటివ్ సైన్స్, ఎకనామిక్స్
- ఎంపీపీ: మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ
- ఎంఏ-హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్: కల్చర్, సొసైటీ, థాట్

పీహెచ్‌డీ విభాగాలు

- అప్లయిడ్ మెకానిక్స్, బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్, మేథమెటిక్స్, మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, టెక్స్‌టైల్ అండ్ ఫైబర్ ఇంజనీరింగ్

అర్హత వివరాలు

- పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ కోర్సులు; పీహెచ్‌డీలో ప్రవేశానికి సంబంధిత స్పెషలైజేషన్‌తో పీజీ కోర్సులు పూర్తిచేసి ఉండాలి. ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి. ఎమ్మెస్సీ, ఎంఏ ప్రోగ్రామ్‌లకు 55 శాతం మార్కులు చాలు. ఇంజనీరింగ్ విభాగాలకు గేట్, డిజైన్ విభాగాలకు సీడ్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారికి గేట్/నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్ తప్పనిసరి కాదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 4
- **వెబ్‌సైట్:** iitd.ac.in

పీహెచ్‌డీ సెంటర్లు

అప్లయిడ్ రీసెర్చ్ ఇన్ ఎలక్ట్రానిక్స్, అట్మాస్పిరిక్ సైన్సెస్, ఆటోమోటివ్ రీసెర్చ్ అండ్ ట్రైబాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్, ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్, రూరల్ డెవలప్‌మెంట్ అండ్ టెక్నాలజీ, సెన్సర్స్-ఇన్‌స్ట్రుమెంటేషన్-సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ రీసెర్చ్ అండ్ ఇన్‌జ్యూరీ ప్రివెన్షన్, వాల్యూ ఎడ్యుకేషన్ ఇన్ ఇంజనీరింగ్

ఎంఎస్ రీసెర్చ్ స్పెషలైజేషన్‌లు

- అప్లయిడ్ మెకానిక్స్, ఆటోమోటివ్ రీసెర్చ్ అండ్ ట్రైబాలజీ, బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సెన్సర్స్-ఇన్‌స్ట్రుమెంటేషన్-సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, మెషిన్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, వీఎల్ఎస్ఐ డిజైన్ టూల్స్ అండ్ టెక్నాలజీ, ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ అండ్ ఇన్‌జ్యూరీ ప్రివెన్షన్

జాబ్ కార్నర్

ఎన్‌ఎల్‌సీలో ఇండస్ట్రియల్ ట్రెయినీలు

ఖాళీలు: 239

నైవేలీ(తమిళనాడు)లోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓఅండ్ఎం): **100 పోస్టులు**
2. ఇండస్ట్రియల్ ట్రెయినీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్): **139 పోస్టులు**

అర్హత: పదో తరగతి, ఐటీఐ, సంబంధిత ట్రేడ్‌లో డిప్లొమా

గరిష్ఠ వయోపరిమితి: యూఆర్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 37 ఏళ్లు; ఓబీసీ అభ్యర్థులు 40 ఏళ్లు, ఎస్టీ/ఎస్సీ అభ్యర్థులు 42 సంవత్సరాలు మించకూడదు.

స్టయిపెండ్: నెలకు ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓఅండ్ఎం) అభ్యర్థులకు రూ.18,000 - రూ.22,000. ఇండస్ట్రియల్ ట్రెయినీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్) అభ్యర్థులకు రూ.14,000 - రూ.18,000.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 19

వెబ్‌సైట్: https://www.nlcindia.in

సింగరేణిలో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఖాళీలు: 327

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్...వివిధ విభాగాల్లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.



- ఎగ్జిక్యూటివ్ కేడర్

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఇ అండ్ ఎం): ఇ2 గ్రేడ్: **42 పోస్టులు**
2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సిస్టమ్స్): ఇ2 గ్రేడ్: **7 పోస్టులు**

- నాన్ ఎగ్జిక్యూటివ్(ఎన్‌సీడబ్ల్యూఏ) కేడర్

1. జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రెయినీ(జేఎంఈటీ), టిఅండ్ఎస్ గ్రేడ్-సి: **100 పోస్టులు**
2. అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రెయినీ(మెకానికల్), టిఅండ్ఎస్ గ్రేడ్-సి: **9 పోస్టులు**
3. అసిస్టెంట్ ఫోర్‌మన్ ట్రెయినీ(ఎలక్ట్రికల్), టిఅండ్ఎస్ గ్రేడ్-సి: **24 పోస్టులు**
4. ఫిట్టర్ ట్రెయినీ, క్యాట్-1: **47 పోస్టులు**
5. ఎలక్ట్రీషియన్ ట్రెయినీ, క్యాట్-1: 98 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత

వయసు: 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 4

వెబ్‌సైట్: https://www.scclmines.com./

ఓరియంటల్ ఇన్సూరెన్స్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్

ఖాళీలు: 100



న్యూఢిల్లీలోని ద ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్-1)

విభాగాలు: అకౌంట్స్, అక్యూరియల్, ఇంజనీరింగ్, ఇంజనీరింగ్(ఐటీ), మెడికల్ ఆఫీసర్, లీగల్.

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/బీడీఎస్, డిగ్రీ(లా), ఐసీఏఐ/ఐసీడబ్ల్యూఏఐ/బీకాం, ఎంబీఏ(ఫైనాన్స్), బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత.

వేతనం: నెలకు రూ.50,925- రూ.96,765

వయోపరిమితి: 2023 డిసెంబరు 31 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు గరిష్ఠంగా అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: ప్రిలిమినరీ టెస్ట్, మెయిన్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలు.

దరఖాస్తు రుసుము: రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.250.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: మార్చి 21

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 12

రాత పరీక్ష: మే/జూన్‌లో

వెబ్‌సైట్: https://orientalinsurance.org.in/

విద్యుత్ నియంత్రణ మండలిలో ఖాళీలు

ఖాళీలు: 28

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ఈఆర్‌సీ).... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. జాయింట్ డైరెక్టర్/ఇంజనీరింగ్: **1 పోస్టు**
2. డిప్యూటీ డైరెక్టర్/ట్రాన్స్‌మిషన్: **1 పోస్టు**
3. డిప్యూటీ డైరెక్టర్/డిస్ట్రిబ్యూషన్: **1 పోస్టు**
4. డిప్యూటీ డైరెక్టర్/లా: **1 పోస్టు**
5. డిప్యూటీ డైరెక్టర్/లీగల్ ప్రొసీజర్: **1 పోస్టు**
6. డిప్యూటీ డైరెక్టర్/టారిఫ్(అకౌంట్స్ అండ్ ఫైనాన్షియల్ అనాలసిస్): **1 పోస్టు**
7. డిప్యూటీ డైరెక్టర్- టారిఫ్(ఎకనామిక్స్): **1 పోస్టు**
8. డిప్యూటీ డైరెక్టర్- టారిఫ్(ఇంజనీరింగ్): **1 పోస్టు**
9. డిప్యూటీ డైరెక్టర్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: **1 పోస్టు**
10. డిప్యూటీ డైరెక్టర్/పే అండ్ అకౌంట్స్: **1 పోస్టు**
11. డిప్యూటీ డైరెక్టర్/కన్జూమర్ అసిస్టెంట్: **1 పోస్టు**
12. అకౌంట్ ఆఫీసర్: **1 పోస్టు**
13. క్యాషియర్: **1 పోస్టు**
14. లైబ్రేరియన్: **1 పోస్టు**
15. స్టెనో కమ్ కంప్యూటర్ ఆపరేటర్: **2 పోస్టులు**
16. క్లర్క్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్: **4 పోస్టులు**
17. పర్సనల్ అసిస్టెంట్: **2 పోస్టులు**
18. రిసెప్షనిస్ట్: **1 పోస్టు**
19. ఆఫీస్ సబార్డినేట్స్: **5 పోస్టులు**

అర్హత: టెన్త్, డిప్లొమా ఇంజనీరింగ్, లా, ఎలక్ట్రికల్/పవర్ ఇంజనీరింగ్, అకౌంటింగ్/కామర్స్, ఎకనామిక్స్, ఎలక్ట్రికల్/కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో డిగ్రీతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం, పని అనుభవం ఉండాలి. ఆఫీస్ సబార్డినేట్స్ పోస్టుకు లైట్ వెహికల్ లైసెన్స్, డ్రైవింగ్ అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 46 ఏళ్లు మించరాదు

ఎంపిక: రాత పరీక్ష లేదా ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.120

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 1

వెబ్‌సైట్: https://tserc.gov.in/

లిటిల్స్



బీర్బల్ చిత్రలేఖనం

అక్బర్ ఆస్థానంలో అందరూ కూర్చున్నారు. మంత్రితో అక్బర్ ఇలా అన్నారు. 'మన రాజ్యంలో మంచి చిత్రకారులు ఎవరైనా ఉన్నారా?' అనడిగారు. 'ఓ.. మేమున్నాం కదా' అని చేయి ఎత్తారు కొందరు అధికారులు. వారిలో బీర్బల్ కూడా ఉన్నారు. 'చిత్రాలు గీయటం.. రంగులు వేయటంలో మేం దిట్టలం' అంటూ అందరూ చెప్పుకొచ్చారు.

అక్బర్ వారితో ఇలా అన్నాడు. 'మీరు చిత్రాలు వేయటం కాదు. అందులో ఊహాత్మకత ఉండాలి. అలాంటి వారికే బంగారు నాణేలు ఇస్తా' అన్నాడు. ఆ తర్వాత అందరూ వారి ఊహాత్మకశక్తి ప్రాణం పోస్తున్నారు. ఓ అధికారి వచ్చి మంచి బొమ్మ గీశానని చెప్పాడు. అక్బర్ కోప్పడ్డాడు. ఇంత చెత్త చిత్రం గీస్తే చూడాలా? వారం సమయంలో వచ్చి చూపించు. చేతకాకపోతే రావద్దు అని చెప్పాడు. పక్కనే ఉన్న అక్బర్ విన్నారు. 'వారం తర్వాత తానూ ఓ బొమ్మ గీస్తాన'ని చెప్పుకొచ్చాడు. 'కవులకు.. బొమ్మలు గీయటం వచ్చా?' అన్నారు కోపంగా. రాజుగారు కోపంగా ఉన్నారని అక్కడనుంచి వెళ్లిపోయాడు బీర్బల్.

వారం రోజుల తర్వాత ఓ చిత్రాన్ని తీసుకొచ్చాడు బీర్బల్. పైగా దాని మీద నల్లటి వస్త్రంతో కప్పాడు. దీంతో ఎంత మంచి చిత్రమో అని అక్బర్ అనుకున్నాడు. ఆ వస్త్రం తీయమన్నాడు. 'ఇది ఊహాత్మకశక్తితో




గీశాను. తమరికి అర్థం అవుతుందో లేదో' అన్నాడు బీర్బల్. 'మాకే అర్థం కాదా?' అన్నాడు అక్బర్. ఆ తర్వాత వస్త్రాన్ని తీశాడు. అదో మేఘాలు ఉండే చిత్రం. 'దీనికి ఏదో ఉంది అనేట్లు చేశావు. ఇదో చిత్రం. దీనికోసం చిత్రకారుడు కావాలా?' అన్నాడు. 'ఇందులో ఊహాత్మకశక్తి ఉంది. భూమి కనపడదు' అన్నాడు. 'అవునా?' అన్నాడు. 'కింద గడ్డి తినే ఆవు ఉంది' అంటూ చెప్పాడు బీర్బల్. అక్బర్ కోప్పడ్డాడు. అదే మరి ఆవు కనపడలేదే? అన్నాడు. 'అదే జహాపనా.. ఆ ఆవు గడ్డి తిని వెళ్లిపోయింది. అందుకే ఈ చిత్రంలో కనపడలేదు' అన్నాడు బీర్బల్. నేను చెప్పిన ఊహాత్మకత ఇదేనా? బావుంది అన్నాడు ఏమీ చేయలేక. 'ఎలాగైనా మెప్పించటంలో మీరు ముందుంటారు' అంటూ బీర్బల్‌ను ప్రశంసించాడు అక్బర్.


ఏవి ఎన్ని?




సరైన నీడ ఏది?



12 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 261

				2	5	8	1	
4				1		2		
								9
2		4					3	
5	6		2		3		7	8
	7					6		5
7								
		2		7				4
	3	9	1	8				

సుడోకు - 260 సమాధానం

3	5	4	1	8	9	6	2	7
7	1	8	2	4	6	3	5	9
6	9	2	3	5	7	1	4	8
5	3	6	7	9	4	2	8	1
1	2	7	8	3	5	9	6	4
8	4	9	6	2	1	7	3	5
9	6	5	4	1	2	8	7	3
2	8	1	5	7	3	4	9	6
4	7	3	9	6	8	5	1	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శుక్రవారం • 22 మార్చి 2024
cinema@andhrajyothy.com



హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ఫాంటసీ అడ్వెంచర్ 'విశ్వంభర' షూటింగ్ శరవేగంతో హైదరాబాద్‌లో జరుగుతోంది. చిరంజీవి, హీరోయిన్ త్రిష తదితరులు పాల్గొనగా కొన్ని సీన్లు, ఓ పాట, యాక్షన్ బ్లాక్‌ను చిత్రీకరించారు. ఇవన్నీ సినిమాలో కీలక సన్నివేశాలు కావడం గమనార్హం. ఈ షెడ్యూల్ పూర్తయినట్లు గురువారం చిత్ర నిర్మాతలు ప్రకటించారు. అలాగే చిరంజీవి నివాసంలో సంగీత దర్శకుడు కీరవాణి, దర్శకుడు వశిష్ట, ఛాయాగ్రాహకుడు చోటా కె నాయుడు, నిర్మాతలు వంశీ, విక్రమ్ తదితరులతో కలసి ఉన్న ఫొటోలను త్రిష సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అలాగే మరో పోస్టర్‌ను నిర్మాతలు విడుదల చేశారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న 'విశ్వంభర' చిత్రాన్ని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు, వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10న ఈ సినిమా విడుదలవుతుంది.

భూకంపం చూసి భయపడ్డా

కార్తికేయ



దర్శకుడు రాజమౌళి కుటుంబంతో కలసి ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తున్నారు. ఆ దేశం తరచూ భూకంపాల బారిన పడుతుందనే విషయం తెలిసిందే. గురువారం రాజమౌళి కుటుంబం ఉన్న స్టార్‌హోటల్ పరిసరాల్లోనూ స్వల్పంగా భూమి కంపించింది. ఎవరికీ ప్రమాదం జరగలేదు. ఈ విషయాన్ని రాజమౌళి తనయుడు కార్తికేయ గురువారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. తన స్మార్ట్ వాచ్‌కు వచ్చిన భూకంపం హెచ్చరిక సందేశాన్ని షేర్ చేస్తూ 'హోటల్ భవనం కదులుతున్నట్లనిపించింది, అది భూకంపం వల్ల అని తెలుసుకొని భయపడ్డా' అని తెలిపారు. 'మహేశ్‌బాబు-రాజమౌళి సినిమా 'ఎస్ఎస్ఎంబీ 29 (వర్కింగ్ టైటిల్) ప్రభావం జపాన్‌లో ఎలా ఉండబోతోందో రిహార్సల్స్ చేస్తున్నారా' అని కార్తికేయను ఓ నెటిజన్ సరదాగా అడిగారు. ఆ సినిమా ప్రభావం జపాన్‌కే పరిమితం కాదు, ప్రపంచమంతా ఉంటుంది అని కార్తికేయ సినిమాపై మరింత అంచనాలు పెంచేలా బదులిచ్చారు.

కొత్త అనుభూతిని పంచే టిల్లు స్క్వేర్

యువతలో విపరీతమైన కల్ట్ ఫాలోయింగ్ సంపాదించుకున్న సినిమాలలో 'డీజే టిల్లు' ఒకటి. టిల్లుగా సిద్ధు జొన్నలగడ్డ పంచిన వినోదాన్ని ప్రేక్షకులు అంత తేలికగా మరిచిపోలేరు. టిల్లు మాటలు, చేష్టలు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఇప్పుడు 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' ఈ నెల 29న వస్తోంది. ఈ సందర్భంగా గురువారం చిత్ర దర్శకుడు మల్లిక్ రామ్ మీడియాతో ముచ్చటించారు.



టిల్లు స్క్వేర్ ప్రాజెక్ట్ లోకి ఎలా వచ్చారు?

డీజే టిల్లు, నేను దర్శకత్వం వహించిన 'అద్భుతం' సినిమాలు ఇంచుమించు ఒకే సమయంలో వచ్చాయి. ఆ తర్వాత నేను, సిద్ధు కలసి ఒక సినిమా చేయాలి అనుకున్నాం. అదే సమయంలో నాగవంశీ గారు 'టిల్లు స్క్వేర్' చేస్తే బాగుంటుందని చెప్పడం, డీజే టిల్లు దర్శకుడు విమల్ కృష్ణ ఇతర కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉండటంతో నేను ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చాను. మొదట కాస్త సంకోచించాను కానీ కథ బాగా వచ్చేసరికి ఇక వెనకడుగు వేయలేదు.

సినిమాలో సిద్ధు ప్రమేయం ఎంతవరకు ఉంటుంది?

సిద్ధు ఒక రచయితగా, నటుడిగా ఎంతవరకు ఇన్వాల్వ్ అవ్వాలో.. అంతవరకే ఇన్వాల్వ్ అవుతాడు. డైరెక్టర్‌కు స్వేచ్ఛను ఇస్తాడు.

టిలు స్క్వేర్ ఎలా ఉండబోతుంది?

డీజే టిల్లు, టిల్లు స్క్వేర్‌కి ఎంతో వ్యత్యాసం ఉంటుంది. డీజే టిల్లు డెడ్ బాడీ నేపథ్యంలో సాగే బ్లాక్ కామెడీ. కానీ టిల్లు స్క్వేర్ ఒక కమర్షియల్ సినిమాలా ఉంటుంది. టిల్లు పాత్ర తీరు అలాగే ఉంటుంది. రాధిక పాత్ర ప్రస్తావన ఉంటుంది. మొదటి భాగాన్ని ముడిపెడుతూ కొన్ని సన్నివేశాలు ఉంటాయి. డీజే టిల్లుని గుర్తు చేస్తూనే టిల్లు స్క్వేర్ అందరికీ కొత్త అనుభూతిని ఇస్తుంది.

అనుపమానే ఎన్నుకోవడానికి కారణం?

ఈ సినిమాలో లిల్లీ పాత్ర చాలెంజింగ్ రోల్. ఆ పాత్ర కోసం ఎందరో పేర్లను పరిశీలించాం. కానీ అనుపమానే పర్ఫెక్ట్ చాయిస్ అనిపించింది. అనుపమాని బోల్డ్‌గా చూపించాలనే ఉద్దేశంతో లిల్లీ పాత్రను రాసుకోలేదు. లిల్లీ పాత్ర తీరే అలా ఉంటుంది.

రీ షూట్‌కి వెళ్ళడానికి కారణం ఏంటి?

ఇంటర్వెల్ తర్వాత ద్వితీయార్థం ప్రారంభ సన్నివేశాలు చాలా సినిమాల్లో తేలిపోతుంటాయి. ఫస్టాఫ్ బాగుంటుంది. క్లైమాక్స్ కూడా బాగుంటుంది. కానీ ఆ 15-20 నిమిషాలు ఆశించిన స్థాయిలో ఉండదు. టిల్లు స్క్వేర్ విషయంలో అలా జరగకూడదన్న ఉద్దేశంతో.. ఆ కొన్ని సన్నివేశాలు మరింత మెరుగ్గా రాసుకొని రీ షూట్ చేశాం.

విజయవంతమైన చిత్రానికి సీక్వెల్ కదా.. ఒత్తిడికి లోనయ్యారా?

ఒత్తిడి ఉండటం సహజం. కానీ కథ బాగా రాసుకోవడంతో.. చిత్రీకరణ సమయంలో పెద్దగా ఒత్తిడి అనిపించలేదు.

ప్రేమలో పడ్డా



'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌తో అలరించడానికి సిద్ధమవుతున్నారు సమంత. ఇందులో ఆమె హనీ అనే గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. హనీ పాత్ర గురించి సమంత మాట్లాడుతూ ఒక కల్పిత పాత్ర నిజ జీవితంలో మనకు స్ఫూర్తిగా నిలవడం గొప్ప విషయం అన్నారు. 'ఇందులో నేను ఫుల్ యాక్షన్ ప్యాక్డ్ రోల్‌లో కనిపిస్తాను. ఇలాంటి పాత్రలు నిజ జీవితంలో కనిపించడం చాలా అరుదు. ప్రేక్షకులకు వినోదం పంచడానికి అనేక పాత్రలను దర్శకులు సృష్టిస్తారు. వాటిలో కొన్ని పాత్రలు మాత్రం మన మనసుకు దగ్గరవుతాయి. షూటింగ్ మొదలుపెట్టిన తర్వాత హనీ పాత్రతో అనుబంధం పెరిగింది. ఆ పాత్ర వ్యక్తిత్వం నా మనసుపై చెరగని ముద్ర వేసింది. పరిస్థితుల ప్రభావం వల్ల దిగులుగా అనిపించినప్పుడల్లా హనీలా ధృడంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. మనం ఎంత ప్రశాంతంగా ఉన్నా ఎన్నో సందర్భాల్లో నెగెటివ్ వాతావరణం మన మనసును కమ్మేసి అశాంతిని కలుగజేస్తుంది. అలాంటప్పుడు హనీలా ప్రవర్తించడానికి ప్రయత్నం చేస్తే నాలో కొత్త ఉత్సాహం వెల్లువెత్తుతుంది. అందుకే ఆ పాత్రతో ప్రేమలో పడ్డాను' అని సమంత పేర్కొన్నారు.



కశ్మీర్ యాపిల్ కాదు.. మిర్చి

అప్సరారాణి ప్రధాన పాత్ర పోషించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'తలకోన'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో దేవర శ్రీధర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 29న సినిమా విడుదల అవుతున్న సందర్భంగా బుధవారం రాత్రి ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో నిర్మాత మాట్లాడుతూ 'మా హీరోయిన్ అప్సరా రాణి ఇంతవరకూ చేయని సినిమా ఇది. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్. అడవి అనగానే కేవలం ప్రకృతి అందాలే కాకుండా ఇంకో కోణం ఉంటుదని చూపించా' అన్నారు. 'మా హీరోయిన్ అప్సరా రాణి చూడడానికి కశ్మీర్ యాపిల్‌లా కనిపిస్తుంది కానీ ఇందులో కశ్మీర్ మిర్చిలా నటించింది. చాలా వెరైటీ స్టోరీ ఇది' అని చెప్పారు దర్శకుడు నగేశ్. ఈ సినిమాలో ఫైట్స్ కూడా చేసినట్లు అప్సరా రాణి చెప్పారు. తన కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

ఆయ్.. పాట విడుదలైందండీ!




నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటిస్తున్న 'ఆయ్' చిత్రంలోని 'సూఫియానా' అంటూ సాగే మెలోడీ సాంగ్‌ను తాజాగా విడుదల చేశారు. శ్రీమణి రాసిన పాటను భరద్వాజ్, రమ్యశ్రీ పాడారు. ప్రస్తుతం సూపర్‌హిట్ సాంగ్స్‌కు కేరాఫ్‌గా మారిన రామ్ మిర్యాల ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. అంజి కంచిపల్లి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అల్లు అరవింద్ సమర్పకులు. బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మాతలు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

మోకాళ్లపై మెట్లెక్కిన జాన్వీ



వీలు చిక్కినప్పుడల్లా ప్రముఖ దేవాలయాలను సందర్శిస్తూ ఆ వీడియోలను అభిమానులతో పంచుకోవడం హీరోయిన్ జాన్వీకపూర్‌కు అలవాటు. ముఖ్యంగా కుటుంబంతో కలసి ఎన్నోసార్లు ఆమె తిరుమలను సందర్శించి, వేంకటేశ్వర స్వామిని భక్తి ప్రపత్తులతో కొలిచారు. ఇటీవలే తన పుట్టిన రోజు సందర్భంగా ఆమె



స్నేహితుడు ఓరీతో కలసి తిరుమల వచ్చారు. దానికి సంబంధించిన వీడియోను ఓరీ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. కాలి నడక దారిలో వారు కొండపైకి వెళ్లారు. మోకాళ్ల మిట్ట వద్ద జాన్వీ మోకాళ్లపై మెట్లు ఎక్కారు. తిరుమల శ్రీవారు అంటే తనకు ఎంతో భక్తి అని జాన్వీ పలు సందర్భాల్లో చెప్పారు. ఇప్పుడు ఈ వీడియో వైరల్ అయింది. ప్రస్తుతం జాన్వీ రామ్‌చరణ్ సరసన ఓ చిత్రంలో నటిస్తున్నారు. అలాగే ఎన్టీఆర్ తో 'దేవర' చిత్రం చేస్తున్నారు.



ఇది భావోద్వేగ ప్రయాణం

దాదాపు 25 ఏళ్ల తర్వాత నటి జ్యోతిక మళ్లీ బాలీవుడ్‌లో నటించిన చిత్రం 'సైతాన్'. ఇందులో అజయ్ దేవగన్‌కు భార్యగా, ఇద్దరు పిల్లలకు తల్లిగా ఆమె నటించారు. ఈ నెల 8న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్ అయి, ఇప్పటికి రూ. 150 కోట్లు వసూలు చేసింది. 'సైతాన్' హిట్ అయిన సందర్భంగా అజయ్ దేవగణ్, మాధవన్‌తో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఓ పోస్ట్ పెట్టారు జ్యోతిక. 'కొన్ని సినిమాలు గమ్యస్థానాలు మాత్రమే కానీ 'సైతాన్' సినిమా మాత్రమే కాదు. చిరకాల మిత్రులతో చేసిన ఓ భావోద్వేగ ప్రయాణం. ప్రతి తల్లి, తండ్రి చూడాల్సిన సినిమా ఇది. ముఖ్యంగా టీనేజ్ పిల్లలు ఉన్న వారు తప్పకుండా వారు ఆ పిల్లలు ఏం చేస్తున్నారో ఓ కన్నేసి ఉంచాలి. ఇంత గొప్ప చిత్రంలో నేనూ భాగం అయినందుకు చాలా ఆనందంగా ఉంది. చిత్ర బృందానికి అభినందనలు' అని పేర్కొన్నారు . గుజరాతీ చిత్రం 'వష్' ఆధారంగా 'సైతాన్' చిత్రం రూపుదిద్దుకుంది.

రిషబ్ సొంతూళ్లో భారీ సెట్



2022లో విడుదలైన 'కాంతార' చిత్రం దేశవ్యాప్తంగా బాక్సాఫీసు దగ్గర సంచలన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. రిషబ్‌శెట్టి హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన ఈ సూపర్‌హిట్‌కు కొనసాగింపు చిత్రాన్ని గతేడాదే నిర్మాణసంస్థ హోంబలే ఫిల్మ్స్ ప్రకటించింది. వచ్చే నెలలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. అయితే అంతా అనుకుంటున్నట్లు 'కాంతార'కు సీక్వెల్ కాదు... ప్రీక్వెల్. 'కాంతార' సినిమా కథ మొదలవడానికి ముందు జరిగిన సంఘటనలతో ప్రీక్వెల్ రూపొందుతోంది. 'కాంతార: చాప్టర్ 1' అనే టైటిల్ ఖరారు చేశారు. 'ది లెజెండ్' అనేది ఉపశీర్షిక. ఇటీవలే చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయగా సోషల్ మీడియాలో వైరల్ అయింది. రిషబ్ సొంతూరు కదిరిలో ఓ భారీసెట్‌ను రూపొందించారు. అధికభాగం షూటింగ్ ఇక్కడే జరుగనుంది. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజనీశ్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు.

పలాస కన్నా పెద్ద హిట్ అవ్వాలి

'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'శశివదనే'. గోదావరి నేపథ్యంలో లవ్, యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాకు సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించారు. అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించారు. ఏప్రిల్ 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సాయి మోహన్ ఉబ్బన మాట్లాడుతూ "ఇది హార్ట్ హిట్టింగ్ మూవీ. క్లైమాక్స్ ఈ సినిమాకు ప్రాణం. సినిమా ముగిశాక ప్రేక్షకులు ఎన్నో భావోద్వేగాలతో బయటికి వస్తారు" అని చెప్పారు. నిర్మాత అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ "రక్షిత్ అట్లూరి, కోమలి వారి నటనతో ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు



తీసుకెళ్లారు" అని ప్రశంసించారు. హీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ "పలాస' కంటే 'శశివదనే' పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. అవుతుందని నమ్మకంగా ఉన్నాను" అని తెలిపారు. నిర్మాత అహితేజ మాట్లాడుతూ "ఈ సినిమాలో ప్రేక్షకులను అలరించే అన్ని అంశాలు ఉన్నాయి. కొత్త తరహా అనుభూతిని ఇచ్చే చిత్రమిది. క్లైమాక్స్ మా సినిమాకు ప్రత్యేక ఆకర్షణ" అని అన్నారు.